

మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిలప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

విఆర్ఎలకు పోస్టింగ్‌లను ఇవ్వండి

ఉత్తర్వులు జారీ చేసిన నవీన్ మిట్టల్

ప్రజాపక్షం/హైదరాబాద్: విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్‌లకు (విఆర్ఎ) ఆయా శాఖలలో పోస్టింగ్ ఉత్తర్వులను జారీ చేయాలని సిసిఎల్ఎ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశాలు జారీ చేశారు. విఆర్ఎలకు ఆయా శాఖలలో జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అ సిస్టెంట్స్, లాస్ట్‌గ్రేడ్ సర్వీస్‌గా కేటాయించి నప్పటికీ పోస్టింగ్‌లను మాత్రం ఇవ్వలేదు. దీంతో ఎటు వంటి జాప్యం లేకుండా వెంటనే వారికి పోస్టింగ్‌లను ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

సంపుటి 07, సంచిక: 213 | గురువారం | 04-07-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

జార్ఖండ్ సిఎం చంపాయీ సోరెన్ రాజీనామా

రాంచీ : జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపాయీ సోరెన్ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ రాధాకృష్ణన్‌కు అందించారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జనవరి 31న ఇడి అధికారులు అప్పటి సిఎం హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేయడంతో చంపాయీ సోరెన్ ఆ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. హేమంత్‌కు రాంచీ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి ఇటీవల ఆయన విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో చంపాయీ సోరెన్ తరువాయి 2లో

పుణెలో జికా వైరస్ కలకలం..

అన్ని రాష్ట్రాలకు కేంద్రం అడ్వైజరీ

న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని పూణెలో జికా వైరస్ కలకలం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ బారినపడినవారిలో ఇద్దరు గర్భవతులు కూడా ఉన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. మహారాష్ట్రలో జికా వైరస్ కేసుల దృష్ట్యా అన్ని రాష్ట్రాలకు అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా గర్భిణి స్త్రీలకు వైరస్ పరీక్షలు తరువాయి 8లో

రాజ్యసభ నుంచి విపక్షాలు వాకౌట్

ప్రధాని తప్పుడు సమాచారం ఇచ్చారని విమర్శ

న్యూఢిల్లీ : పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం సమాధానమిచ్చారు. అయితే మోదీ ప్రసంగం మధ్యలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సభను వాకౌట్ చేసింది. మోదీ ప్రసంగం సమయంలో తాను మాట్లాడాలనుకుటున్నానని, అందుకు అవకాశం కల్పించాలని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కోరగా, చైర్మన్ జగదీప్ ధనఖర్ ఖర్గే అభ్యర్థనను పట్టించుకోలేదు. దీంతో ఇండియా కూటమికి సభ్యులు తమ స్థానాల్లో నుంచి లేచి నిలబడి మాట్లాడేందుకు ఖర్గేకు అనుమతి ఇవ్వాలని నినదించారు. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు, ఆందోళనమధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ నేపథ్యంలో ఖర్గే కొంత సేపటి వరకు తనను మాట్లాడేందుకు అనుమతించాలని అభ్యర్థిస్తూనే ఉన్నారు. అయనా ఆయన విజ్ఞప్తిని పెడచెవినపెట్టి అనుమతించకపోవడంతో ఇండియా కూటమి ఎంపిలు సభను వాకౌట్ చేశాయి. ప్రతిపక్షాల చర్యను చైర్మన్ ఖండించారు. రాజ్యాంగాన్ని అవమానపర్చడమేనన్నారు. అనంతరం వారంతా పార్లమెంట్ గేట్ వద్దకు చేరుకున్నారు. ఖర్గేతో పాటు కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, పి. చిదంబరం, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) అధినేత శరద్ పవార్, డిఎంకెకు చెందిన తిరుచ్చి శివ, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) సాగరికా ఘోష్ మరియు సుస్మితా దేవ్, జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) మహువా మాజీ, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)) మనోజ్ ఝా, శివ సేన (యుబిటి) నేత ప్రియాంక చతుర్వేది తదితరులు అక్కడ సమావేశమయ్యారు. బిజెపికి సైద్ధాంతిక గురువు ఆర్ఎస్ఎస్ ఉండడం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. కాగా, రాష్ట్రపతి ప్రసంగంపై జరిగిన చర్చ తరువాయి 2లో

మణిపూర్‌లో హింస తగ్గుముఖం

నెలకొంటున్న సాధారణ పరిస్థితులు

శాంతి స్థాపనకు కసరత్తు

రాజ్యసభలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: మణిపూర్ కోలుకుంటోందని, ఆ రాష్ట్రంలో హింస తగ్గుముఖం పట్టిందని ప్రధాని మోదీ అన్నారు. ఆయన బుధవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞత తీర్మానంపై చర్చలో భాగంగా మణిపూర్ గురించి మాట్లాడారు. మణిపూర్‌లో హింస మొదలైనప్పటి నుంచి ప్రధాని ఆ రాష్ట్రంలో పర్యటించాలని, మాట్లాడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. లోక్‌సభ మంగళవారం మణిపూర్ నినాదాలతో హోరెత్తింది. పతిపక్షాల డిమాండ్ క్రమంలో ప్రధాని ఎట్టకేలకు నోరు విప్పారు. మణిపూర్ గురించి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు క్రమంగా నెకొంటున్నట్లు తెలిపారు. హింస తరువాయి 2లో

మణిపూర్‌పై ప్రధాని వ్యాఖ్యలు ఆశ్చర్యకరం
కాంగ్రెస్
02

ఇప్పట్లో లేనట్లేనా?

- టిపిసిసి అధ్యక్షుడి నియామకం, మంత్రివర్గ విస్తరణ తాత్కాలిక వాయిదా? ● నేతల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- రాష్ట్రంలో పార్టీ బలోపేతం, సామాజిక సమీకరణాలు, నాయకుల బలాబలాలపై అధిష్టానం దృష్టి

ప్రజాపక్షం/ హైదరాబాద్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) నూతన అధ్యక్షుడి నియామకం విషయంలో కాంగ్రెస్ అధిష్టానం వద్ద తర్జనభర్జన కొనసాగుతూనే ఉంది. కాంగ్రెస్ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎంపిక ప్రక్రియను ఎఐసిసి వాయిదా వేసినట్టు తెలుస్తోంది. ఈ విషయమై వారం రోజుల్లో మరోసారి చర్చించాలని పార్టీ పెద్దలు నిర్ణయించినట్లు పార్టీ నేతలు అంటున్నారు. కాంగ్రెస్ అగ్రనేతల పరస్పర అంగీకారం అనంతరం పిసిసి అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. టిపిసిసి నూతన అధ్యక్షుడి నియామకం మంత్రి వర్గ అంశంతో ముడిపడి తరువాయి 2లో

కాంగ్రెస్‌లో చేరిన కె.కేశవరావు

ఢిల్లీలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణకు చెందిన రాజ్యసభ సభ్యుడు, బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత డాక్టర్ కె.కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఢిల్లీలో డాక్టర్ కేశవరావుకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఖర్గే నివాసంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ, తరువాయి 2లో

కుప్పకూలుతున్న వంతెనలు

15 రోజుల్లో ఏడు ఘటనలు

సివాన్ : బీహార్‌లో వరుసగా వంతెనలు కూలిపోతున్న ఘటనలు చోటు చేసుకొంటున్నాయి. బుధవారం ఉదయం వంతెనలోని కొంత భాగం కూలిపోయింది. దీంతో బీహార్‌లో గత పక్షం రోజుల్లో ఏడు వంతెనలు కూలినట్లయింది. సివాన్ జిల్లాలోని గండకి నదిపై నిర్మించిన వంతెనకు సంబంధించిన కొంత భాగం ఈ రోజు కూలింది. ఇదే జిల్లాలో 10 రోజుల క్రితం ఓ వంతెన కూలిన సంగతి తెలిసిందే. డియోరియా బ్లాక్‌లోని ఈ వంతెనలోని కొంత తరువాయి 8లో

సిఎంల భేటీపై సర్వత్రా ఆసక్తి

ప్రజాభవన్‌లో ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ సిఎం, సిఎస్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీపై సర్వాత్ర ఆసక్తి నెలకొంది. ఈనెల 6వ తేదీన హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరగనున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమావేశం కానున్నారు. ఇందుకు సంబంధించి ప్రజాభవన్‌లో ఏర్పాట్లను బుధవారంప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పరిశీలించారు. సమావేశం నిర్వహణ గురించి వివిధ శాఖల అధికారులకు సూచనలు చేశారు. అలాగే సమావేశంలో పదేండ్ల పెండింగ్ సమస్యలను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చిస్తారని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలు, అంశాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా సర్వసన్నద్ధంగా అందుబాటులో ఉంచాలని ఆయన అధికారులను తరువాయి 2లో

సమస్యల సత్వర పరిష్కారానికి నాంది పలకాలి

సిఎంల సమావేశంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం / హైదరాబాద్: హైదరాబాదులో శనివారం నిర్వహించతలపెట్టిన ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు స్వాగతించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో మధ్య ఉన్న సమస్యల సత్వర పరిష్కారానికి ఈ సమావేశం నాందీ కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివ రావు ఆకాంక్ష వ్యక్తం చేశారు. భద్రాచలంలో ఐదు గ్రామాలు తెలంగాణకు తిరిగి ఇచ్చే విషయంలో సానుకూలతకు రావడం ద్వారా ఉభయ రాష్ట్రాల సిఎంల సమావేశం మంచి సంకేతాలు పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పునర్విభజన జరిగి పదేళ్లు పూర్తయినా, ఇంకా సమస్యలు కొనసాగడం బాధాకరమని, ఇందుకు కేంద్ర, గత రాష్ట్ర ప్రభుత్వాల వైఖరే కారణమని విమర్శించారు. చర్చల ద్వారా తప్ప వివాదాల ద్వారా సమస్యలకు త్వరిత పరిష్కారం లభించదని, కాబట్టి నిర్దిష్ట కాల పరిమితిలోగా పరిష్కారానికి వచ్చేలా ముఖ్యమంత్రుల సమావేశంలో ఏకాభిప్రాయానికి రావాలని కూనంనేని సూచించారు. తిరుమలలో తెలంగాణ రాష్ట్ర ఎంఎల్ఎ సిఫార్సు లేఖలను అనుమతించాలి తిరుమలలో తెలంగాణ తరువాయి 2లో

నిన్నటి ఓటమితో

దిష్టి తీసినట్టయింది

కార్యకర్తలతో కెసిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్ఎస్ విజయ ప్రస్థానంలో 'నిన్నటి' ఓటమితో దిష్టి తీసినట్టయిందని, తిరిగి పునరుత్తేజంతో మరింతగా ప్రజాదరణను కూడగట్టాలని బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. మరికొద్ది రోజుల్లోనే టార్చ్‌లైట్ పట్టుకుని ప్రజలే దేవులాడుకుంటూ బిఆర్ఎస్ వద్దకు వస్తారని,అప్పటి వరకు ఓపికతో ప్రజా సమస్యలపైన పోరాడుతూ, వారికి అందుబాటులో ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎర్రవల్లి నివాసంలో తనను కలిసేందుకు వచ్చిన మహబూబాబాద్, మేడ్చల్, నల్లగొండ జిల్లాల నుండి వచ్చిన కార్య కార్యకర్తలు, నాయకులతో కెసిఆర్ బుధవారం సమావేశమయ్యారు. సమావేశంలో మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి, ఎంఎల్సిలు మధుసూదనాచారి, తక్కెళ్ల పల్లి రవీందర్ రావుతోపాటు మాజీ ఎంఎల్ఎలు, నాయకులు హాజరయ్యారు.

కెసిఆర్ చెప్పేవన్నీ కల్లబొల్లి కబుర్లే

ఏడు మండలాల కోసం బిఆర్ఎస్ దీక్ష చేయాలి

రైతు ఆత్మహత్య వెనుక ఎవరు ఉన్నా విడిచిపెట్టేదిలేదు

రైతుభరోసాపై అభిప్రాయ సేకరణకు సభలు, సమావేశాలు

డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

ప్రజాపక్షం / హైదరాబాద్: మళ్ళీ అధికారంలోకి వచ్చి పదిహేనేండ్లు బిఆర్ఎస్ అధికారంలో ఉంటుందని బిఆర్ఎస్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు చెప్పేవన్నీ కల్లిబొల్లి కబుర్లే అని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ అనంతరం తెలంగాణ నుంచి ఏడు మండలాలు పోవడానికి కారణం బిఆర్ఎస్, బిజెపి అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడు మండలాల కోసం బిఆర్ఎస్ దీక్ష చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో ఏడు మండలాల ప్రస్తావన లేదని, బిజెపి అధికారంలోకి వచ్చాక ఆర్డినెన్సుతో ఏడు మండలాలను ఎపిలో కలిపారని భట్టివిక్రమార్క చెప్పారు. ఏడు మండలాల కోసం పోరాటం చేస్తానని అసెంబ్లీలో ప్రకటించిన కెసిఆర్ ఏమయ్యారని భట్టివిక్రమార్క ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి బిఆర్ఎస్ ఏమి చేయలేదని, కెసిఆర్ చేసిన తప్పిదాలే ఆయనను వెంటాడుతున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు కల్లిబొల్లి మాటలు మాట్లాడుతున్నారని, వాటిని ఎవరూ నమ్మబోరని భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో అన్ని బిల్లులు క్లియర్ తరువాయి 2లో

సాధారణ బదిలీలకు గ్రీన్ సిగ్నల్

నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

కౌన్సెలింగ్ పద్ధతి ద్వారా బదిలీలు

మార్గదర్శకాలు,షెడ్యూల్ విడుదల

ఈనెల 5 నుంచి 20వ తేదీలోపు ప్రక్రియ పూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆరేళ్ల తర్వాత సాధారణ బదిలీలకు మోక్షం లభించింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ నెల 5 నుంచి బదిలీల ప్రక్రియ మొదలుకానుంది. బదిలీల పక్రియను ఈ నెల 20 వరకు పూర్తి చేయనున్నారు. నాలుగేళ్లు ఒకే దగ్గర పనిచేసిన ఉద్యోగులను బదిలీ చేయగా, రెండేళ్ల దాటని వారిని బదిలీ చేయవద్దని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొతం 16 రోజుల్లో బదిలీ ప్రక్రియను ముగించనున్నారు.అన్ని బదిలీలను కౌన్సిలింగ్ పద్ధతి ద్వారానే చేపట్టనున్నారు. ఉద్యోగుల బదిలీల అంశంలో పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. బదిలీ పక్రియ ముగియగానే ఆ మరునటి రోజు 21వ తేదీ నుంచి మళ్లీ సాధారణ బదిలీలపై నిషేధం అమలులోనికి వస్తుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలతో కూడిన షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. ఉద్యోగులు కష్టతరమైన కొన్ని ప్రాంతాలను ఎంచుకోకపోతే,ఆ ప్రాంతాలలో లాటరీ విధానాన్ని అనుసరించి బదిలీలు చేపట్టాలని మార్గదర్శకాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. సాధారణ, ముఖ్యమైన ప్రాంతాల పోస్టులను ఆయా శాఖలే గుర్తించాల్సి ఉంటుందని, శాఖల పరిధిలోని అన్ని విభాగాల్లో కేటగిరీలు, క్యాడర్ల వారీగా జాబితాలను ప్రచురించాలని మార్గదర్శకాల్లో పొందుపరిచారు. బదిలీలకు ముందే అన్ని శాఖలలో స్పష్టమైన ఖాళీలను ప్రచురించాలి. కాంపిటెంట్ అథారిటీ తప్పనిసరిగా బదిలీ చేయాల్సిన ఉద్యోగుల జాబితాను కూడా ప్రచురించాలి. రెండేళ్ల దాటని తరువాయి 8లో

అంగన్‌వాడీ టీచర్లపై కేసులు ఉపసంహరించుకుంటాం..

వేతనాల పెంపు ప్రభుత్వ ఆలోచనలో ఉంది

తెలంగాణ రాష్ట్ర అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు మంత్రి సీతక్క హామీ

ప్రజాపక్షం/హైదరాబాద్

సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లపై పోలీసు కేసులు ఉపసంహరిస్తామని అలాగే వారి వేతనాల పెంపుపై త్వరలో ప్రభుత్వం ఆలోచన చేస్తుందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి నేతృత్వంలో బుధవారం అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ప్రతినిధుల బృందం సచివాలయంలో మంత్రి సీతక్కను కలిసింది. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కోంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రిటైర్మెంట్ బెనిఫిట్ అంగన్వాడీ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో తరువాయి 2లో

చంపాయీ సోరెన్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

నివాసంలో సమావేశమైన జెఎంఎం సారథ్యంలోని కూటమి ఎమ్మెల్యేలంతా సమావేశమై హేమంత్ సోరెన్‌ను సభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో హేమంత్ కొత్త సిఎంగా పగ్గాలు చేపట్టేందుకు వీలుగా ప్రస్తుత సిఎం చంపాయీ సోరెన్ తన రాజీనామాను గవర్నర్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా రాజ్ భవన్ వద్ద ఆయన మాట్లాడుతూ.. జెఎంఎం కూటమి తీసుకున్న నిర్ణయం మేరకు రాజీనామా చేసినట్లు తెలిపారు. తమ కూటమి బలంగా ఉందని చెప్పారు. హేమంత్ విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. సంకీర్ణ భాగస్వామ్య పక్షాలు నాకు బాధ్యతలు అప్పగించాయి. ఇప్పుడు కూటమి హేమంత్ సోరెన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది అని తెలిపారు. మరోవైపు, ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్ ను హేమంత్ కోరినట్లు తెలుస్తోంది.

నాంది పలకాలి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఎంఎల్‌వి సిఫార్సు లేఖలను అనుమతించాలని కూనంనేని సాంబశివరావు ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. "తిరుమల తిరుపతి దేవస్థానం భౌతికంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పటికీ ఆధ్యాత్మికంగా రెండు తెలుగు రాష్ట్రాల దేవాలయం. వెంకటేశ్వరస్వామి రెండు రాష్ట్రాల ఆరాధ్య దైవం. ఉత్తరాదిలో అయోధ్య దేవాలయానికి ఎంత ప్రాతిష్ఠమున్నదో తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి అంతే ప్రాతిష్ఠమున్నది. ఇక్కడికి ప్రపంచ దేశాల నుండి భక్తులు వస్తారు. తెలంగాణ ఎంఎల్‌ఎల సిఫార్సులు చెల్లకపోవడం దురదృష్టకరం" అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దైవదర్శనానికి వచ్చే తెలంగాణ ఎంఎల్‌ఎల నుండి తీసుకువచ్చే సిఫార్సు లేఖలను పరిగణలోకి తీసుకుని, దైవం వద్ద బేధాభిప్రాయం లేకుండా చూడాల్సిన బాధ్యత చంద్రబాబుకు ఉందని ఆయన తెలిపారు.

కల్లబొల్లి కబుర్లే

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామని, రైతు భరోసాపై సబ్ కమిటీ పాత పది జిల్లాలలో ఇందుకు సంబంధించి వర్క్ షాప్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించి అన్ని వర్గాల అభిప్రాయం తీసుకుని ప్రభుత్వానికి నివేదికను ఇస్తుందని చెప్పారు. కమిటీ రిపోర్ట్‌ను అసెంబ్లీలో చర్చకు పెడతామన్నారు. ప్రజలు కోరుకుంటే కొండలు, గుట్టలకు రైతు భరోసా ఇస్తామని, ఏదైనా ప్రజల నిర్ణయమేనని ఆయన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. రెండు లక్షల రుణమాఫీ త్వరలోనే అమలు చేస్తామని, రైతులు అప్పులు చేయకుండా సహాయం చేస్తున్నామన్నారు. కెసిఆర్ ఐదేళ్లలో ఐదు లక్షల రుణమాఫీ చేయలేకపోయారని విమర్శించారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను లోతుగా అధ్యయనం చేసి అమలు చేస్తున్నామన్నారు. ఆర్‌టిసి లో మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల కరెంట్, రూ.500లకే గ్యాస్‌ను ఇప్పటికే అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలు కట్టిన పన్నులతో వచ్చిన ప్రతి పైసా వారి అభివృద్ధి కోసం ఉపయోగించాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. కేబినెట్ విస్తరణపై పూర్తిగా అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని, పిసిసి నూతన అధ్యక్షుని నియామకం విషయంలో కసరత్తు కొనసాగుతుందని ఆయన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం

రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, పుట్టింది బతకడానికి అని, చావడానికి కాదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతు ఆత్మహత్య వెనుక ఎవరున్నారనే దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఆత్మహత్య వెనక ఎవరున్నా విడిచిపెట్టేదిలేదని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీసు శాఖలు కూడా ఈ ఘటన పూర్వాపరాలను పరిశోధన చేస్తున్నాయని, ప్రతి మనిషి ప్రాణం చాలా విలువైందని, సమాజంలోని ప్రతి ఒక్కరి గురించి ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. విచారణ చేసి బాధితులను కఠినంగా శిక్షించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

కేసులు ఉపసంహరించుకుంటాం..

(మొదటి పేజీ తరువాయి)

పెట్టిన హామీ ప్రకారం రూ.18,000 వేతనం చెల్లించాలని, 24 రోజుల సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని మంత్రికి విన్నవించారు. అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని,గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్కు సంబంధించి 2023 సెప్టెంబర్ 5వ తేదీన జి.ఓ.నెం.10 విడుదల చేసిందని, ఈ జి.ఓ. ప్రకారం అంగన్వాడీ టీచర్కు లక్ష రూపాయలు, ఆయాకు రూ.50వేలు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని ఆదేశించారని, ఈ జి.ఓ.కు వ్యతిరేకంగా మిగతా సమస్యలపై 24 రోజుల సమ్మె జరిగిందని గుర్తు చేశారు. ఈ సమ్మె కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలియజేశారని ఈ మధ్య కాలంలో మెమో నెం.1334/ఐసిడిఎస్‌బూ1/2024, ఎప్రిల్ 3న విడుదల చేసి జి.ఓ.నెం.10ని అమలు చేయాలని అధికారులు క్రింది స్థాయికి ఆదేశాలు జారీచేశారని. ఈ జి.ఓ.ను రద్దు చేసి అంగన్వాడీ టీచర్కు రూ.10 లక్షలు, ఆయాకు రూ.5 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని కోరారు. అలాగే 60 సంవత్సరాల పైబడిన వారికి వాలంటరీ రిటైర్మెంట్కు అనుమతించాలని, అంగన్వాడీ టీచర్లు, ఆయాల భర్తీలో కారుణ్య నియామకాలు జరపాలి." మంత్రికి తెలియజేశారు. సమస్యలను సావదానంగా విన్న మంత్రి స్పందిస్తూ.. రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.రెండు లక్షలు , ఆయాలకు రూ.ఒక లక్ష లకు పెంచుతూ జి.ఓ. విడుదల చేస్తున్నామన్నారు. మినీ నుండి మెయిన్ అంగన్వాడీ టీచర్ల వేతన బకాయిలు కూడా చెల్లిస్తామని హామి ఇచ్చారు. మంత్రిని కలిసిన ప్రతినిధుల బృందంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు యం. సాయీశ్వరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి మరియు రాష్ట్ర ట్రెజరర్ ఎం. ప్యారిజాన్లు ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర అంగన్వాడీ టీచర్స్ బ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ప్రతినిధులు మంత్రి సీతక్కతో పాటు, సిపిఐ రాష్ట్ర జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి గారికి కృతజ్ఞతులు తెలిపారు.

లేబర్ పార్టీవైపు ఓటర్ల మొగ్గు!

సర్వేల అంచనాలు... జోరుగా బెట్టింగ్‌లు

నేడే యునైటెడ్ కింగ్‌డమ్ సార్వత్రిక ఎన్నికలు

లండన్: యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె) సార్వత్రిక ఎన్నికలు ఇప్పుడు యావత్ ప్రపంచం వ్యాప్తంగా ఆసక్తిని రేపుతున్నాయి. అగ్రరాజ్యాలలో ఒకటిగా నిలిచి, ప్రపంచాన్ని అత్యంత ప్రభావితం చేయగల యుకెలో గురువారం ఎన్నికలు జరగనున్నాయి. భారత సంతతికి చెందిన ప్రధాని రిషి సునాక్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ పార్టీకి ఈసారి ఓటమి తప్పదని, లేబర్ పార్టీ విజయభేరి మోగించడం ఖాయమని వివిధ సర్వేలు అంచనా వేస్తున్నాయి. లేబర్ పార్టీవైపే ఓటర్లు మొగ్గు చూపుతున్నారన్న వాదన బలంగా వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో, బెట్టింగ్‌ల జోరు పెరిగింది. ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి అల్లుడు కావడంతో సునాక్ రాజకీయ భవిష్యత్తు గురించి కార్పొరేట్ రంగంలోనూ కూడా ఉత్కంఠ కనిపిస్తున్నది. కొత్త హౌస్ ఆఫ్ మాన్స్, కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. మెజారిటీ పార్టీ నాయకుడు ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారు. కన్జర్వేటివ్ పార్టీ దాదాపు 14 ఏళ్లుగా అధికారంలో ఉంది. మరోసారి అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి సునాక్ నేతృత్వంలో ఈ పార్టీ ప్రయత్నిస్తుండగా, ప్రతిపక్ష లేబర్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారంలోకి రావాలని సర్వశక్తులు ఒడ్డుతోంది. ఏళ్లుగా బ్రిటీష్ రాజకీయాలలో కన్జర్వేటివ్స్, లేబర్స్ మధ్య ఆధిపత్య పోరాటం కొనసాగుతుండగా, చిన్న పార్టీలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం దక్కడం లేదు. ఈ రెండు పార్టీలతో పాటు లిబరల్ డెమొక్రాట్లు, రిఫార్మ్ యుకె, నేషనల్ పార్టీ, గ్రీన్స్ కూడా ఎన్నికల బరిలో ఉన్నాయి. కన్జర్వేటివ్ పార్టీ తరపున సునాక్ ప్రధాని అభ్యర్థిగా ఉంటే, లేబర్ పార్టీ నుంచి డాక్టర్ కీర్ స్టార్మర్ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. లిబరల్ డెమొక్రాట్స్ పార్టీ నుంచి ఎడ్ డేవీ. రిఫార్మ్ పార్టీ నుంచి నిగెల్ ఫరాజ్, స్కాటిష్ నేషనల్ పార్టీ (ఎస్ఎన్‌పి) నుంచి జాన్ స్విని , గ్రీన్ పార్టీ నుంచి కార్లా డెనియర్, అడ్రియన్ రామ్‌సే ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు. అణుశక్తిని తగ్గించడం.. 2040 నాటికి అది సున్నాకి చేరుకోవడం.. గ్రీన్ హౌస్‌లను ఇన్సులేట్ చేయడానికి ఏడాదికి 24 బిలియన్ పౌండ్లు, గ్రీన్ ఎకానమీలో పెట్టుబడి పెట్టడం...అందుకు వీలుగా ఏడాదికి 40 బిలియన్ పౌండ్లను కార్బన్ పన్ను ద్వారా చెల్లించడం వంటి హామీలతో లేబర్ పార్టీ దూసుకుపోతున్నది.

ఇలావుంటే, ఎన్నికల నేపథ్యంలో జోరుగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. యుకెలో బెట్టింగ్ చట్టబద్ధమే కాబట్టి, లక్షలాది మంది పందాలు కాస్తున్నారు. అయితే, ఎవరు ప్రధాని అవుతారని కాకుండా, ఏ పార్టీ గెలుస్తుందనే విషయంపైనే బెట్టింగ్ కొనసాగడం గమనార్హం. పిటిఐ కథనం ప్రకారం, లండన్‌లో సర్వత్రా వ్యాపించిన బెట్టింగ్ షాపుల్లో ఒక చోట బుకీ ఒకరు పందాలు కాసేవారి కోసం ఎదురు చూస్తున్నాడు. 'ఎన్నికలపై ఎవరైనా బెట్టింగ్ కాట్టారా' అన్న ప్రశ్నకు నవ్వుతూ, ఏ పార్టీ గెలుస్తుందనే విషయంపైనే జోరుగా బెట్టింగ్ సాగుతున్నదని చెప్పాడు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేదని పేర్కొన్నాడు. లేబర్ పార్టీ గెలుస్తుందని 100 పౌండ్లు పందెం కట్టిన వారికి, ఆ పార్టీ గెలిస్తే 127 పౌండ్లు లభిస్తాయి. అదే కన్జర్వేటివ్ పార్టీపై పందెం కట్టి, అదృష్టవశాత్తు ఆ పార్టీ గెలిస్తే, 100 పౌండ్లకు ఏకంగా 3,000 పౌండ్లు లభిస్తాయి.

లేబర్ పార్టీ ఆధిపత్యం కొనసాగే అవకాశాలు ఉన్నాయనడానికి, ఆ పార్టీ ఎన్నికల్లో విజయభేరి మోగించి, అధికారాన్ని చేపడుతుందని ఎక్కువ మంది విశ్వసిస్తున్నారనడానికి ఈ పందెం తీరుతెన్నులే నిదర్శనం. కాగా, 2020 ఎన్నికల సమయంలో 1.7 బిలియన్ పౌండ్ల బెట్టింగ్ జరిగింది. ప్రపంచంలోనే ఇది అతి పెద్ద బెట్టింగ్‌గా రికార్డుకెక్కింది. అయితే, ఈసారి అంతకంటే ఎక్కువ వ్యాపారం జరుగుతుందని అంటున్నారు. బ్రిటన్‌లో ఏదైనా బెట్టింగ్‌కు అంశమే కాబట్టి, ప్రధానిపై వేటు పడుతుందా? వాటికన్ పోప్ ఆరోగ్యం ఎలా ఉంటుంది? రాచకుటుంబీకులు ఎప్పుడు ఎలాంటి టోపీ పెట్టుకుంటారు? వంటి ఎన్నో రకాల బెట్టింగ్‌లు కొనసాగుతాయి. ఇక ఎన్నికలంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఎన్నికల మాట ఎలా వున్నా, ఇప్పుడు ప్రజలంతా బెట్టింగ్ సెంటర్ల చుట్టూ చేరుతున్నారు. జోరుగా పందాలు కడుతున్నారు.

పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌కు ఊరట

ఇస్లామాబాద్: తోషాఖానా అవినీతి కేసులో ఎన్నికల సంఘం జైలుకెళ్లిన ప్రధానిపై అనర్హత వేటు వేసినందుకు నిరసనగా ఆందోళనలు చేపట్టినప్పుడు నమోదైన కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట లభించింది. 2022లో తోషాఖానా అవినీతి కేసులో ఇమ్రాన్‌ను కోర్టు దోషిగా ప్రకటించడం, ఆ వెంటనే అతనిపై పాకిస్తాన్ ఎన్నికల కమిషన్ (ఇపిసి) సస్పెన్షన్ వేటు విధించడం జరిగిపోయాయి. దీనితో ఇమ్రాన్ అధినేతగా ఉన్న పాకిస్తాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పిటిఐ) నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. ఇమ్రాన్ సైతం ఆందోళనకు పిలుపునివ్వడంతో, అతనిపై కేసు నమోదైంది. అయితే, బుధవారం ఇమ్రాన్‌తోపాటు, ఇదే కేసులో ముద్దాయిలుగా ఉన్న పార్టీ సీనియర్ నాయకులు షా మహమూద్ ఖురేషీ, షేక్ రషీద్, అసద్ ఖైజర్, షెహ్ర్యార్ అఫ్రిది, ఫైసల్ జావేద్, రాజా ఖుర్రం నవాజ్, అలీ నవాజ్ అవాన్‌లను కోర్టు నిర్దోషులుగా పేర్కొంది. అబ్బారా పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. తోషఖానా అనేది ఇమ్రాన్ ప్రధానిగా ఉన్నప్పుడు, అతని కేబినెట్ డివిజన్ యొక్క పరిపాలనా నియంత్రణలో ఉన్న ఒక విభాగం. ప్రపంచంలోని ఇతర దేశాల ప్రభుత్వాధినేతల నుంచి పాకిస్తాన్ ప్రధాన మంత్రి, అధ్యక్షుడు, వివిధ శాఖల అధిపతులు, ప్రముఖులు, పాలకులు, పార్లమెంటేరియన్లు బ్యూరోక్రాట్లకు వచ్చిన అత్యంత విలువైన బహుమతులను సంరక్షించడమే తోషాఖానా ప్రధాన విధి. అయితే, తనకు వచ్చిన విలువైన వస్తువులను నిబంధనలకు వ్యతిరేకంగా అమ్ముకున్నాడని ఇమ్రాన్‌పై ఆరోపణలు వచ్చాయి. కోర్టులో నేరం రుజువు కావడంతో అతనికి శిక్ష పడింది. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా పిటిఐ శ్రేణులు నిరసనలకు దిగడంతో, ఇమ్రాన్‌సహా పలువురు కీలక నేతలపై కేసు నమోదైంది. వీరంతా కోర్టు తాజా తీర్పుతో ఊపిరి పీల్చుకున్నారు.

బైడెన్ కంటే హారిస్ బెటర్!

వాషింగ్టన్: ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పాలక డెమోక్రాట్ అభ్యర్థిగా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ కంటే, వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్‌ను మెరుగైన అభ్యర్థిగా పేర్కొంటున్నారు. సిఎన్‌ఎస్ జరిపిన తాజా సర్వే నివేదిక ప్రకారం, భారత, ఆఫ్రికా వారసత్వ మూలాలున్న హారిస్‌ను మంచి వక్తగా ప్రజలు గుర్తిస్తున్నారు. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో ఇటీవల జరిగిన డిబేట్‌లో బైడెన్ దారుణంగా విఫలమయ్యాడన్న విమర్శలు ఉన్నాయి.

అతను ఏ క్షణంలోనైనా కళ్లు తిరిగి కింద పడిపోతాడేమో అనే రీతిలో కనిపించాడని, తడబడుతూ మాట్లాడాడని మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. డిబేట్‌ను ప్రత్యక్షంగా తిలకించిన వారిలో అత్యధిక శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చివరికి డెమోక్రాట్స్‌లోనే బైడెన్ పట్ల అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఈ పరిస్థితుల్లో అధ్యక్ష పదవికి ట్రంప్‌ను ఢీకొనే శక్తిసామర్థ్యాలు హారిస్‌కే ఉన్నాయని సర్వేలో అత్యధిక మంది పేర్కొన్నట్టు సమాచారం. 81 సం.ల వయసులో బైడెన్ చురుగ్గా ఉండలేకపోతున్నాడని, అతనితో పోలిస్తే 59ఏళ్ల హారిస్ ఉత్సాహంగా కనిపిస్తున్నారని ప్రజల అభిప్రాయం. సిఎన్‌ఎన్ సర్వేలో, ట్రంప్‌పై పోటీ చేసేందుకు ఎవరు సరైన అభ్యర్థి అనే ప్రశ్నకు 43 శాతం మంది హారిస్‌కు, 34శాతం మంది బైడెన్‌కు అనుకూలంగా ఓటు వేశారు. అదే విధంగా మహిళా ఓటర్లలో హారిస్, బైడెన్‌లకు చెరి సమానంగా 44 శాతం ఓట్లు లభించాయి. మొత్తంమీద బైడెన్ అంటే, హారిస్ బెటర్ అనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కాగా, అమెరికాలోని మొత్తం నమోదిక ఓటర్లలో 47 శాతం మంది ట్రంప్‌కు మద్దతునిస్తుంటే, 45శాతం మంది హారిస్ వైపు మొగ్గు చూపుతున్నారని సిఎన్‌ఎన్ తన నివేదికలో పేర్కొంది.

ఎఐపై చైనా తీర్మానానికి యుఎన్ ఆమోదం

ఐక్యరాజ్య సమితి (అమెరికా): కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ఎఐ) వినియోగంలో, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య పెరుగుతున్న అంతరాన్ని తగ్గించేందుకు వీలుగా చైనా చేసిన ప్రతిపాదనకు ఐక్యరాజ్య సమితి (యుఎన్) అమోదం లభించింది. సంపన్న, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వ్యత్యాసం విపరీతంగా పెరుగుతున్న తరుణంలో, ఎఐ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడానికి, ప్రయోజనం పొందడానికి అవకాశాలు ఉన్నాయని ఈ ప్రతిపాదన నిర్ధారించింది. ఈ విషయంలో సంపన్న దేశాలు మిగతా దేశాలకు సహాయసహకారాలు అందించాలని అమెరికా మద్దతుతో చైనా తీర్మానాన్ని జనరల్ అసెంబ్లీ ముందు ఉంచింది. యుఎన్ నేతృత్వంలో, చైనా సహా 123 దేశాలు దీనిని స్పాన్సర్ చేశాయి. ఎఐ సురక్షితమైనదని, నమ్మదగినదని, అన్ని దేశాలు దీనివల్ల విస్తృత ప్రయోజనాలు పొందవచ్చని ఈ ప్రతిపాదన సారాంశం. ఎఐకి సంబంధించిన తొలి ప్రతిపాదనను యుఎన్ ఈ ఏడాది మార్చిలో ఆమోదించగా, ఇది రెండో తీర్మానం. ఈ రంగంలో ఇప్పటికే ఎంతో ముందంజ వేసిన చైనా, అమెరికా దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు సహాయం చేయనున్నాయి. 193 మంది సభ్యులు ఉన్న జనరల్ అసెంబ్లీలో 120కిపైగా దేశాలు చైనా ప్రతిపాదనను స్పాన్సర్ చేయడం అద్భుతమని యుఎన్‌లో చైనా రాయబారి ఫూ కాంగ్ మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

విపక్షాలు వాకౌట్

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా ప్రధాని తప్పుడు సమాచారం ఇవ్వడం వల్లే తాము సభ నుంచి వాకౌట్ చేశామని చెప్పారు. ఆయనకు అబద్ధాలు చెప్పడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం, నిజాలకు వ్యతిరేకంగా మాట్లాడటం అలవాటని ఖర్గే అన్నారు. ప్రధాని రాజ్యాంగంపై మాట్లాడుతున్న సమయంలో... 'మీరు రాజ్యాంగాన్ని రాయలేదని, దానికి మీరు వ్యతిరేకులని, రాజ్యాంగానికి ఎవరెవరు వ్యతిరేకంగా ఉన్నారో స్పష్టం చేయదల్చుకున్నాను' అని ఖర్గే వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ అధికార వార్త సంస్థ అయిన 'ఆర్గనైజర్'లో నవంబరు 30, 1950లో వచ్చిన కథనాన్ని ఖర్గే ఉటంకిస్తూ అందులో భారతీయత ఏమీలేదని ఈ సంస్థ రాజ్యాం గాన్ని వ్యతిరేకించిందన్నారు. వారు రాజ్యాంగాన్ని వ్యతిరేకించారని, ఇప్పుడేమో పరిరక్షిస్తామని చెబుతున్నారన్నారు. వారు మొదటి నుంచి రాజ్యాంగ వ్యతిరేకులేనని విమర్శించారు. ప్రతిపక్ష నేతను సభలో మాట్లాడనివ్వకపోవడంతో విపక్షాలు వాకౌట్ చేశాయని చెప్పారు. 'కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రధాని కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఖర్గేజీ పదేపదే మాట్లాడేందుకు అనుమతించాలని చెప్పారు. చైర్మన్ అనుమతించలేదు. విపక్ష నేతలంతా ఆయన ను అనుమతించాలని డిమాండ్ చేసినా చైర్మన్ పట్టించుకోలేదు' అని జెఎంఎం నాయకుడు అన్నారు. 'చైర్మన్ ప్రతిపక్షాల వైపు చూడరు, తమను అవమానించారని భావించడం వల్లే వాకౌట్ చేసామని తెలిపారు. ప్రతిపక్ష నేతను మాట్లాడేందుకు అనుమతించడం సభ సంప్రదాయమని కాంగ్రెస్‌కు చెందిన ప్రమోద్ తివారీ అన్నారు. రాజ్యాంగబద్ధమైన ప్రతిపక్ష నేత పదవిని బిజెపి అగౌరవ పరిచిందని దేవ్ అన్నారు.

రాజ్యాంగ పదవిని ఎవరైనా గౌరవించాల్సిందే : పవార్

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదులు తెలిపే తీర్మానంపై మోదీ మాట్లాడుతుండగా ప్రతిపక్ష నాయకుడు ఖర్గేని మాట్లాడాలనివ్వాలని విపక్ష ఎంపిలు నిరసన వ్యక్తం చేయడం, చివరకు వారు సభ నుంచి వాకౌట్ చేయడంపై ఎన్‌సిపి (ఎస్‌పి)చీఫ్ శరద్ పవార్ స్పందించారు. మల్లికార్జున్ ఖర్గే ప్రతిపక్ష నేతగా రాజ్యాంగ పదవిలో ఉన్నందున ఆయనను ప్రధానమంత్రి మోదీ, రాజ్యసభ చైర్మన్ గౌరవించాల్సి ఉంటుందని అన్నారు. 'ఆయన (ఖర్గే) రాజ్యాంగ పదవిలో ఉన్నారు. ప్రధాని కావచ్చు, సభ చైర్మన్ కావచ్చు, ఆయనను గౌరవించాలి. కానీ బుధవారం ఆ విషయాన్ని విస్మరించారు. ప్రతిపక్షం మొత్తం ఆయనకు (ఖర్గే) మద్దతుగా నిలిచింది. ఆ కారణంగానే మేమంతా వాకౌట్ చేశాం' అని పవార్ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

సిఎంల భేటీపై సర్వత్రా ఆసక్తి

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సిఎం ఆదేశించారు.

గురుశిష్యులు కాదు.. సహచరులు : గురుశిష్యులు భేటీ కాబోతున్నారంటూ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పందించారు. ఎపి సిఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గురుశిష్యులు కాదని, వారు సహచరులని ఆయన స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి కూడా చాలా సార్లు చెప్పారన్నారు. చంద్రబాబు ఎపి సిఎం, రేవంత్‌రెడ్డి తెలంగాణ సిఎం అని తేల్చిచెప్పారు. చంద్రబాబు, రేవంత్ గురుశిష్యులు అనే వారివి అవగాహనలేని మాటలని భట్టివిక్రమార్క కొట్టిపారేశారు.

కాంగ్రెస్‌లో చేరిన కె.కేశవరావు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో డాక్టర్ కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. డాక్టర్ కేశవరావు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు కొద్ది రోజుల కింద ప్రకటించి రాష్ట్ర కాంగ్రె స్ నేతలతో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా డాక్టర్ కేశవరావు కుమార్తె, హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

ఇప్పట్లో లేనట్లేనా?

(మొదటి పేజీ తరువాయి)

ఉండడంతో తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పార్టీ నాయకులు అంటున్నారు. ఇటీవల ఢిల్లీకి వెళ్ళిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, పలువురు మంత్రులు, సీనియర్ నాయకులతో కాంగ్రెస్ అధిష్ఠానం నేతలు టిపిసిసి నూతన అధ్యక్షుని ఎన్నికలపై చర్చలు జరిపారు. బుధవారం ఢిల్లీకి వెళ్ళిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పార్టీ అధిష్ఠానం నేతలు మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, ఎఐసిసిసి కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ చర్చలు జరిపారు. అయితే పిసిసి అధ్యక్ష పదవినిఆశించే నాయకులు ఎక్కువగా ఉండడంతో పార్టీ అధిష్ఠానం చర్చోపచర్చలు చేస్తున్నది.

రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, సామాజిక సమీకరణాలు, బలాబలాలు తదితర అంశాలపై నాయకులతో దఫదఫాలుగా చర్చలు జరిపింది. టిపిసిసి అధ్యక్ష పదవి కోసం ఎంఎల్‌సి మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపి మధుయాస్కీ గౌడ్, ఎంపిలు బలరాంనాయక్, సురేశ్ షెట్కర్, ఎఐసిసిసి కార్యదర్శి సంపత్‌కుమార్‌లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్కలు సైతం అధ్యక్ష పదవిని అడుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అయితే ఒక నాయకునికి ఒకే పదవి ఉండాలని, తద్వారా పార్టీ అధికారంలో లేనప్పుడు కష్టపడిన నాయకులకు ఎక్కువ మందికి న్యాయం చేయవచ్చని కొంత మంది అధిష్ఠానం వద్ద వాదన వినిపించినట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. దీంతో పిసిసి అధ్యక్షుడి నియామకం తేలిన తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, పార్టీ అభివృద్ధి, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ అధిష్ఠానం పిసిసి కొత్త అధ్యక్షుని నియామకం విషయంలో ఆచీతూచీ వ్యవహరిస్తున్నదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అంటున్నారు.

మణిపూర్‌పై ప్రధాని వ్యాఖ్యలు ఆశ్చర్యకరం : కాంగ్రెస్

న్యూఢిల్లీ : రాజ్యాసభలో ప్రధాని నరేంద్ర మోదీ మణిపూర్‌పై చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ మండిపడింది. ఈశాన్య రాష్ట్రంలో ఇంకా ఉద్రిక్త పరిస్థితులు ఉన్నప్పటికీ సాధారణ పరిస్థితులే ఉన్నాయని చెప్పడం ఆశ్చర్యం కలిగించిందని పేర్కొంది. గత ఏడాది మే మాసంలో మణిపూర్‌లో కల్లోల పరిస్థితులు నెలకొన్న నాటి నుంచి ఇప్పటి వరకూ కూడా ప్రధాని ఆ రాష్ట్రంలో పర్యటించకపోవడం దురదృష్టకరమని దుయ్యబట్టారు. మణిపూర్‌లో హింస నిరంతరం తగ్గుముఖం పడుతోందని, రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయని, సంపూర్ణ శాంతి నెలకొనేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధాని మోదీ చెప్పడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శలు చేశాయి. రాజ్యసభలో మోదీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఇతరులతో కలిసి పనిచేస్తోందన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ స్పందిస్తూ, మణిపూర్‌పై ఎట్టకేలకు మౌనం వీడిన ప్రధాని ఆ రాష్ట్రంలో పరిస్థితి సాధారణంగా ఉందని నాన్‌బయోలాజికల్ ప్రధాని పేర్కొనడం ఆశ్చర్యం వేసిందన్నారు. వాస్తవానికి, మణిపూర్‌లో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉందని ఈనెల లోక్‌సభలో ఇన్నర్ మణిపూర్ ఎంపి ఎత్తిచూపారని, హింస చెలరేగిన నాటి నుంచి మోదీ ఆ రాష్ట్రంలో పర్యటించడంగానీ, రాజకీయ నాయకులతో మాట్లాడడం గానీ చేయలేదన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో కూడా ఈ అంశాన్ని చప్పగా లేవనెత్తారన్నారు. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, మణిపూర్‌లో 500 మందికి పైగా అరెస్టు చేశారని, 11,000 మందికి పైగా ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయని ప్రధాని చెప్పారు. మణిపూర్ కూడా వరదల పరిస్థితిని ఎదుర్కొంటోందని, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్)కి చెందిన రెండు బృందాలను కేంద్రం రాష్ట్రానికి పంపిందని మోదీ తెలిపారు. అంతకు ముందు రోజు, లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగానికి ముందు మణిపూర్‌కు చెందిన తన రెండవ ఎంపిని మాట్లాడటానికి అనుమతించకపోవడంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడింది. ప్రధాని తన పాత ఆరోపణలను పునరావృతం చేశారని, జోకులు పేల్చారని, నవ్వులు పూయించారని, అయితే హింసాత్మక రాష్ట్రానికి చెందిన శాసనసభ్యుని వాణిని వినే ఓపిక తనకు లేదని కాంగ్రెస్ పేర్కొంది. మణిపూర్ దుస్థితికి ప్రధాని ఉద్దేశ్యపూర్వకంగా 'వెనుక తిరిగినట్లు' కనిపిస్తోందని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది.

హింస తగ్గుముఖం

(మొదటి పేజీ తరువాయి)

తగ్గుముఖం పట్టిందన్నారు. రాష్ట్రంలోని అనేక చోట్ల బడు లు తెరుచుకున్నాయని చెప్పారు. శాంతిని నెలకొల్పేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నిర్విరామంగా శ్రమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 11వేలకుపైగా ఎఫ్‌ఐఆర్‌లు నమోదు కాగా 500 మందికిపైగా అరెస్టు అయ్యారని మోదీ వెల్లడించారు. వరదలు కూడా ఆ రాష్ట్రంలో బీభత్సం సృష్టించాయని, రెండు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను రాష్ట్రానికి పంపామని ఆయనన్నారు.

జమ్మూకశ్మీర్‌లో తుదిదశకు ఉగ్రవాదంపై పోరు

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదంపై పోరు దాదాపుగా చివరి దశకు చేరుకుందన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం అంతమవుతున్నట్లు చెప్పుకొచ్చారు. గతంలో షట్‌డౌన్లు, సమ్మెలు, ఉగ్రవాదల నుంచి బెదిరింపులు, బాంబు పేలుళ్లు వంటివి ప్రజాస్వామ్యంపై నల్లనీడగా ఉండేవని చెప్పారు. తాజా ఎన్నికల్లో రాజ్యాంగంపై అపారమైన నమ్మకాన్ని కనబరుస్తూ జమ్మూకశ్మీర్ ప్రజలు ఓటేశారని మోదీ చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకం పుంజుకుందని, పెట్టుబడులు పెరిగాయని తెలిపారు.

అవినీతిని ఉపేక్షించం

అవినీతిపరులను ఉపేక్షించేది లేదని మోదీ ఉద్ఘాటించారు. పార్టీలకు అతీతంగా అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి వ్యవహారాల్లో సముచిత చర్యలు తీసుకునేలా దర్యాప్తు సంస్థలకు సర్వాధికారాలు ఉన్నాయని ప్రధాని తెలిపారు. అవినీతి గురించి మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలను ప్రస్తావించారు. అదే సమయంలో పశ్చిమ బెంగాల్ గురించి మాట్లాడుతూ మహిళపై బహిరంగ దాడిని గుర్తుచేశారు. ఈ ఘటనపై విపక్షాలు మౌనం వహిస్తున్నాయని విమర్శించారు. సందేశ్‌ఖలి ఘటనను ప్రస్తావించారు. హింస, అన్యాయాన్ని సమ్మిళితంగా, నిష్పాక్షికంగా ఖండించాలని మోదీ పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ రాజ్యాంగానికి పెద్ద శత్రువు

కాంగ్రెస్ పార్టీని రాజ్యాంగానికి అతిపెద్ద శత్రువుగా మోదీ ఆరోపించారు. అవాస్తవాలు చెప్పే పార్టీ అని విమర్శించారు. ఎమర్జెనీ విధింపు, జాతీయ సలహా మండలి (ఎన్ఏసీ) ఏర్పాటు వంటివి కాంగ్రెస్ ద్వారా రాజ్యాంగ ఉల్లంఘనకు ఉదాహరణలన్నారు. ఇలాంటి పార్టీతోనా మీరు జట్టుకట్టేదంటూ వెనుకబడిన వర్గాలకు చెందిన కాంగ్రెస్ మిత్రపక్షాలనుద్దేశించి విమర్శించారు.

ఎన్డీయే వరుసగా మూడవసారి అధికారంలోకి రావడంపై ప్రధా ని హర్షం వ్యక్తంచేశారు. తమ పదేళ్ల పాలనకు మెచ్చి ప్రజలు మరొక అవకాశమిచ్చారని చెప్పుకున్నారు. దశాబ్దం పాటు అధికారంలో ఉన్న పార్టీ తిరిగి ఎన్నిక కావడం 60ఏళ్లలో మొదటిసారి జరిగిందని గొప్పలు పోయారు. స్వీయసమృద్ధి దేశంగా భారత్‌ను ప్రగతి పథంలో ముందుకు సాగించేందుకు బీజేపీ నేతృత్వ ఎన్డీయేకు అనుకూలంగా ప్రజాతీర్పు వచ్చిందని అన్నారు. ఇదిలావుంటే, రాష్ట్రపతి ప్రసంగంపై కృతజ్ఞతా తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత నెలకొన్న గందరగోళంతో రాజ్యసభ వాయిదా పడింది. ప్రధాని సమాధానం, కృతజ్ఞతా తీర్మానానికి సభ ఆమోదంతో జూన్ 27న మొదలైన రాజ్యాసభ 264వ సెషన్ ముగిసింది. లోక్‌సభ మంగళవారం వాయిదా పడటం విదితమే.

మోదీ... మణిపూర్ వెళ్లేదెప్పుడు : కాంగ్రెస్

న్యూఢిల్లీ: మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నట్లు రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రకటించారు కానీ వాస్తవానికి ఈశాన్య రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. గతేడాది మే నుంచి అట్టుడికిపోతున్న మణిపూర్‌ని మోదీ ఇప్పటివరకు సందర్శించలేదని, ఆయన ఎప్పుడు వెళతారని ప్రశ్నించింది. శాంతి నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు మోదీ చెప్పడాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం దుయ్యబట్టారు. 'కొన్ని నెలల మౌనం తర్వాత రాజ్యసభలో మణిపూర్ గురించి అవతారపురుడైన ప్రధాని ఒక ప్రకటన చేశారు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నట్లు తెలిపారు. వాస్తవానికి ఆ రాష్ట్రంలో ఉద్రిక్తత కొనసాగుతోంది.

ఇన్నర్ మణిపూర్ ఎంపీ ఆ రాష్ట్ర పరిస్థితులను లోక్‌సభకు ఇప్పటికే తెలియజేశారు' అని అన్నారు. మన నాన్ బయోలాజికల్ ప్రధాన మంత్రి ఇప్పటివరకు మణిపూర్‌లో కాలు మోపలేదని, ఆ రాష్ట్ర రాజకీయ నేతలు ఎవరితోనూ ఆయన భేటీ కాలేదని, మంతనాలు జరపలేదని దుయ్యబట్టారు. మణిపూర్ గురించి రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావన లేని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. 2023, మే 3వ తేదీ నుంచి ఆ రాష్ట్రం అట్టుడికిపోతోంది. లోక్‌సభలో మణిపూర్‌కు చెందిన విపక్ష ఎంపీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ప్రభుత్వ తీరును కాంగ్రెస్ ఇంతకుముందు ఖండించింది. ప్రధాని మాటల్లో కొత్తగా ఏమీ లేదని దుయ్యబట్టింది. ప్రధాని జోకులు వేశారు... విమర్శలు గుప్పించారు కానీ హింస బాధిత రాష్ట్ర ప్రతినిధి చెప్పేది వినేందుకు ఆయనకు సహనం లేకపోయిందని విమర్శించింది. మణిపూర్ దుస్థితి నుంచి మోదీ కావాలనే చూపు తిప్పుకున్నారని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఆ రాష్ట్ర ప్రజల వెతలు ప్రధానికి ఏ మాత్రం పట్టడంలేదని దుయ్యబట్టింది.

కాంట్రాక్ట్ వదలకుంటే చంపేస్తామంటున్నారు..

డిజిపికి బాధితుడి ఫిర్యాదు

ప్రజాపక్షం/హైదరాబాద్: రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్ పనులు ఆపకపోతే చంపేస్తామని తోటి కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారని ఓ బాధితుడు డిజిపి రవి గుప్తాకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు..రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్ కార్మికులపై సహచర కాంట్రాక్టర్లు దాడికి పాల్పడి, రూ.5 లక్షల విలువైన నిర్మాణ సామాగ్రిని ఎత్తుకెళ్లి చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితుడు కుర్మ సతీష్‌కుమార్ తెలిపారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో సింగరేణి సంస్థలో నస్పూర్‌లో రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి సర్కారు టెండర్‌లో తాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా తక్కువ బిడ్ కోడ్ చేసిన తనకు కాంట్రాక్టు దక్కిందన్నారు. దీనికి సంబంధించిన పనులు వారం రోజులుగా జరుగుతుండగా శనివారం నాడు కొందరు గుండాలు పట్టపగలు వచ్చి తన వద్ద పనిచేసే కార్మికులపై దాడి చేశారని బాధితుడు డిజిపి రవిగుప్తాకు తెలిపాడు. దాడి చేసిన వారు సహచర కాంట్రాక్టర్లేనని, వారి తరపున కొందరు గుండాలు వచ్చి పనులు జరుగుతున్న ప్రాంతం నుంచి ఐదు లక్షల రూపాయల విలువచేసే కంకర, ఇసుక సిమెంట్ కాంక్రీట్ మిల్లర్‌ను దౌర్జన్యంగా ఎత్తుకు పోయారని బాధితుడు తన ఫిర్యాదులో వివరించారు. దీనికన్నా ముందు ఇంకొందరు కాంట్రాక్టర్లు అధికారికంగా టెండర్లు దక్కించుకుంటే వారిపైన కూడా వీరు అలాగే దాడులకు పాల్పడి, గుండాయిజం చేసి ఆస్తులను దోచుకున్నారని సతీష్‌కుమార్ తెలిపారు. దీనిపై తాను దాడికి పాల్పడ్డ కాంట్రాక్టర్లతో మాట్లాడితే చంపేస్తామని బెదిరిచారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్మికులపై దాడికి పాల్పడిన తొమ్మిది మంది కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఎవరు స్పందించలేదని తెలిపాడు. దాడి దృశ్యాలను అధికారులకు చూపించానన్నారు. దాడికి పాల్పడ్డ కాంట్రాక్టర్లు, వారి అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిజిపిని కోరారు.

సమాచారం ఇవ్వండి.. రూ.2లక్షలు పొందండి

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్న రేవంత్ సర్కార్ ఆదేశాలతో.. తెలంగాణ నార్కోటిక్స్ పోలీసు లు కీలక నిర్ణయం తీసుకున్నారు. గంజాయిపై సమాచారం ఇచ్చిన వారికి రూ. 2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు.100 కిలోల కంటే ఎక్కువ గంజాయి స్మగ్లింగ్ గురించి సమాచారం ఇస్తే మాత్రమే. ఈ మొత్తా న్ని బహుమతిగా గెలుచుకునే అవకాశం ఉంది. అందు కోసం 8712671 111 నంబరుకు ఫోన్ చేసి సమాచారమివ్వాలి.హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (ఎన్ఇడబ్ల్యూ) అధికారులు పేర్కొన్నారు.

భూమి ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాల్సిందే : రఘునందన్‌రావు

ప్రజాపక్షం/ హైదరాబాద్ : భూమి ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని బిజెపి ఎంపి రఘునందన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయం లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడు తూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి రైతుకు డిసెంబర్ 9వ తేదీ లోపు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాం గ్రెస్ ఇప్పటికీ చేయ్యపోగా సవాలక్ష కొర్రీలను పెడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీల కారణంగానే రైతులకు ఆ త్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రుణం ఉన్న ప్రతి రైతుకు దానిని మాఫీ చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు.

నిరుద్యోగుల సమస్యలను సిఎం రేవంత్ పరిష్కరించాలి

వామపక్ష యువజన,విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సంయుక్త డిమాండ్

ప్రజాపక్షం / హైదరాబాద్ : నిరుద్యోగుల సమస్యలపై సిఎం రేవంత్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన స్పందించి తక్షణం పరిష్కరించాలని వామపక్ష యువజన, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సంయుక్తంగా డిమాండ్ చేసింది. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో తెలిపింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుద్యోగులకు ఇబ్బందులు రాకుండా, ఉద్యోగాలను భర్తీ చేస్తామని స్పష్టంగా హామీ ఇచ్చిన క్రమంలో వాటిని అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగులు పలు సమస్యలతో సతమతమౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను అనుసరిస్తే అదే పరిస్థితి కాంగ్రెస్‌కు కూడా వస్తుందని వారు తెలిపారు. నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం నిలబడాలని, వారి సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మీడియా సాక్షిగా పరిష్కరించే హామీని ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన నేతల్లో కల్లూరు ధర్మేంద్ర (ఏ.ఐ.వై.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి), కోటా రమేష్, అనగంటి వెంకటేష్ (డివై ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి), కె.ఎస్. ప్రదీప్ (పివైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు), మమత (ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి), గ్యారా నరేష్ (ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి), తదితరులు పాల్గొన్నారు.

క్షమాభిక్షపై 213 మంది ఖైదీల విడుదల

సమాజంలో పౌరులుగా మెలగాలి : జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్ర

ప్రజాపక్షం/హదరాబాద్: దీర్ఘకాలంగా జైలులో మగ్గుతున్న ఖైదీలకు ప్రభు త్వం కల్పించిన క్షమాభిక్షపై బుధవారం రాష్ట్రంలోని వివిధ జైళ్ల నుంచి 213 మంది ఖైదీలు విడుదలైనట్లు జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్ర తెలిపారు. విడుదలైన ఖదీలు సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని వారికి కితాబు ఇచ్చారు. విడుదలైన ఖైదీలతో సౌమ్యమిశ్ర చర్లపల్లి జైలు వద్ద కౌన్సిలింగ్, జాబ్‌మేళ నిర్వహించారు. వివిధ జైళ్ల నుండి ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు ప్రజావాణి కార్యక్రమంలో అనేక సంవత్సరాలుగా జైళ్లలో మగ్గుతున్న ఖైదీలను ముందస్తుగా విడుదల చేయాలని అభ్యర్థించడంతో ప్రభు త్వం వారికి క్షమాభిక్ష పెట్టిందన్నారు. విడుదలైన వారిలో జీవిత శిక్ష పడిన ఖైదీలు 205 మంది, ఎనిమిది మంది నాన్ లైఫ్ ఖైదీలు, 35 మంది మహిళా ఖైదీలు ఉన్నారన్నారు. ఖైదీలతో పాటు వారి కుటుంబ సభ్యుల ముఖాలను చూస్తుంటే తనకు చాలా సంతోషంగా ఉందని, విడుదలైన ఖైదీలకు కొత్త జీవితాన్ని గడపడానికి రెండో అవకాశం వచ్చిందని సౌమ్యమిశ్ర పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ అధికారులు డాక్టర్ డి.శ్రీనివాస్. ఎం. సంపత్, సంతోష్ కుమార్ రాయ్, ఎన్. శివ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జైలు పేరు	విడుదలైన ఖైదీలు
చర్లపల్లి	61
చంచల్‌గూడ	27
వరంగల్	20
చర్లపల్లి అగ్రికల్చర్ కాలనీ	31
నిజామాబాద్	35
సంగారెడ్డి	1
నిజామాబాద్	15
మహబూబ్‌నగర్	2
నల్గొండ	4
అదిలాబాద్	3
కరీంనగర్	7
ఖమ్మం	4
ఆసీఫాబాద్	3

మిషన్ భగీరథపై గత ప్రకటనలు

బోగస్‌వేనా ?

అధికారులను ప్రశ్నించిన ఉపముఖ్యమంత్రి భట్టి
స్థానికంగానే తాగునీటి సోర్స్ ఏర్పాటు చేయండి
కార్మికుల వేతనాలపై సమగ్ర నివేదిక ఇవ్వండి : మంత్రి

ప్రజాపక్షం / హైదరాబాద్

"మిషన్ భగీరథ పథకం కింద రూ.42 వేల కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని 1150 ఆవాసాలకు 50 శాతం నీళ్ళు సరఫరా చేస్తున్నామని ప్రస్తుతం చెబుతున్నారు. ఇదే పథకం కింద రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతుందని, నీటి ఎద్దడి లేదని సర్పంచుల సంతకాలతో గతంలో అసెంబ్లీలో ప్రకటించారు. కేంద్రానికి నివేదిక పంపారు. అంటే ఆనాటి ప్రకటన భోగస్ అని భావించాలా" అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ప్రశ్నించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి భట్టివిక్రమార్క అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. "రాష్ట్రంలో 23,824 ఆవాసాలు ఉండగా 1156 ఆవాసాల్లో 50 శాతం మాత్రమే నీళ్ళు ఇవ్వగలుగుతున్నాం అంటున్నారు. ఆలేరు, భువనగిరి, నల్గొండ నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందడంలేదు. నిధులు కావాలని మీ శాఖ నుంచే ఫైల్ రావడం ఏమిటి" అని డిప్యూటీ సిఎం మిషన్ భగీరథ అధికారులను ప్రశ్నించారు. మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి సరఫరాపై ప్రస్తుతం జరుగుతున్న సర్వే, అది ఎప్పుడు పూర్తవుతుంది తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే పూర్తికాగానే రాష్ట్రంలోని అందరి ఎంఎల్‌ఎలకు ఆ నివేదికలు అందజేసి తాగునీరు అందుతుందన్న విషయాన్ని వారి ద్వారా నిర్ధారణ చేసుకోవాలని డిప్యూటీ సిఎం అధికారులకు సూచించారు. రూ.42 వేల కోట్లు ఖర్చు చేసినా ఇంకా తాగునీటి ఎద్దడి ఉందని కొత్తగూడెం, ఆలేరు లాంటి నియోజకవర్గాల్లో అదనపు నిధులు కోరుతున్నారని, ఇదేమిటని డిప్యూటీ సిఎం ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మున్సిపాలిటీలకు హైదరాబాద్ మెట్రో నుంచి తాగునీటిని సరఫరా చేస్తుండగా వివిధ మున్సిపాలిటీలు మిషన్ భగీరథ కింద మంచి నీటి సరఫరా చేస్తున్నట్టు రికార్డుల్లో ఎందుకు చూపిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. తాగునీటి సరఫరాకు ప్రధాన సోర్స్‌ను వందల కిలోమీటర్ల నుంచి కాకుండా ప్రతి సమీపంలో నుంచి తీసుకోవాలని డిప్యూటీ సిఎం సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి తీసుకోవడం కారణంగా తరచూ పైప్ లైన్‌లు పగిలిపోవడం వంటివి ఉత్పన్నమై తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద పనిచేస్తున్న సిబ్బంది జీతాలు నెలల తరబడి ఎందుకు పెండింగ్‌లో ఉంటున్నాయని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఒక్కో ప్రాంతంలో ఒక రకంగా కార్మికుల వేతనాలు ఉంటున్నాయని, రూ.8000 నుంచి రూ.13 వేల వరకు అందుతున్నట్టు తనకు సమాచారం ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వేతనాల నిధుల్లో ఎక్కువ మొత్తం ఏజెన్సీలు కట్ చేసుకుని మిషన్ భగీరథ కార్మికులకు తక్కువ జీతాలు ఇస్తున్నారని, దీనిపై సమీక్ష చేయాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వేతనాలు కార్మికులకు ప్రయోజనం చేకూర్చాలే తప్ప మధ్య దళారులకు కాదని అన్నారు. రాష్ట్రంలో మొత్తం ఉన్న ఏజెన్సీలు ఎన్ని, ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు, ఏజెన్సీలు కార్మికులకు ఇస్తున్న వేతనాల వివరాల తో సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ కార్మికులకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకంగా వేతనాలు ఉండేలా ఫిక్స్ చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం కోసం చేసిన వేల కోట్ల అప్పు చెల్లిస్తున్నా పథకం ప్రయోజనం పూర్తిస్థాయిలో నెరవేరడంలేదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. సమీక్ష సమావేశంలో స్పెషల్ సిఎస్ రామకృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, టిఎస్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రెటరీ స్మిత సబర్వాల్, స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

11 దాటినా ఖాళీ కుర్చీలా ?

ఆఫీసర్లపై మంత్రి కోమటిరెడ్డి ఫైర్

ప్రజాపక్షం/హైదరాబాద్: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సచివాలయంలోని ఆర్ అండ్ బి సెక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఉద్యోగుల పనితీరు గురించి తెలుసుకోడానికి వెళ్లిన మంత్రికి, ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. సమయం దాటి పోయినా చాలా మంది ఉద్యోగులు ఆఫీసుకు రాకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణంగా ఉద్యోగులు ఉదయం 10 గంటలకు కార్యాలయాలకు హాజరుకావాల్సి ఉంటుంది. కానీ, సెక్రటేరియట్ ఉద్యోగులు మాత్రం 11 గంటలు దాటినా రాకపోవడంతో మంత్రి మండిపడ్డారు. "11 అయినా రాలేదు..మళ్లీ సాయంత్రం 6 గంటలకు వెళ్లిపోతారు" అంటూ మంత్రి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని విషయాలపై అధికారులు స్పందించకపోవడంతో మీ వివరాలు మీకు కూడా తెలియదా అంటూ అంటూ ఫైర్ అయ్యారు. ఇకపై ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఇలా అయితే కుదరదంటూ వార్నింగ్ ఇచ్చారు.

'దీనితో నీ ప్రాణం పోదు' అని చెప్పడంతోనే..

మందుతాగి ప్రాణాలు కోల్పోయిన రైతు

కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. కోదండ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఈ మందుతో నీ ప్రాణం ఏమిపోదు అని చెప్పడంతోనే ఖమ్మం జిల్లా రైతు ప్రభాకర్ మందు తాగి ప్రాణాలు కొల్పోయారని, దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యాక్షుడు ఎం. కోదండరెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతు ప్రభాకర్‌ను ఉద్దేశపూర్వకంగా బిఆర్‌ఎస్ నేతలే ఆత్మహత్య చేసుకునేలా ప్రొత్సహించారని ఆరోపించారు. మందు తాగమని చెప్పి మరి వీడియోలు తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాటి మనిషి ప్రాణాలు హరించే మందు తాగుతుంటే ఎందు కు ఆపలేదని ప్రశ్నించారు. ప్రతిపక్షంలోకి వచ్చా క బిఆర్‌ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేసేందుకు ఆత్మహత్యలను ప్రొత్సహిస్తుందని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ ఉద్య మం సమయంలో కూడా అనేక మంది విద్యార్థి, యువకులను ఆత్మహత్యలు చేసుకునేలా బిఆర్‌ఎస్ నేతలు ప్రొత్సహించారని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో రైతు వ్యవసాయ భూమిని ఆక్రమించారని వీడియో తీస్తూ ఆత్మహత్య చేసుకున్నారన్నారు. అందులో కాంగ్రెస్‌ను దృష్టిలో పెట్టుకొని మాట్లాడారన్నారు. ఆ రైతు ప్రభాకర్ టిఆర్‌ఎస్ వ్యక్తి అని, అక్కడ ఉండే నాయకులు ఈ మందుతో నీ ప్రాణం ఏమిపోదు అని చెప్పడంతో ఆయన మందు తాగి చనిపోయాడని ఆవేదన వ్య క్తం చేశారు. ధరణితో లక్షలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. రైతు ప్రభాకర్ ఆత్మహత్య మీద పూర్తి విచారణ చేయాలని కిసాన్ కాంగ్రెస్ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. హ క్కు ఉన్న ప్రతి రైతుకు భూమి హక్కు పత్రాలు వస్తాయని, ఎవరూ అధైర్య పడవద్దు అని కోదండ రెడ్డి అన్నారు. కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ రైతు ప్రభాకర్‌ను బిఆర్‌ఎస్ నేతలు రెచ్చగొట్టి ఆత్మహత్య చేసుకునేలా పురిగొల్పారని ఆరోపించారు.

ప్రధాని మోడీకి మతాల మధ్య చిచ్చు పెట్టడం మాత్రమే తెలుసు

టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ విమర్శ

ప్రజాపక్షం/ హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కేవలం మతాలపై మాట్లాడడం వారి మధ్య చిచ్చు పెట్టడం తప్ప మారేమి పట్టదని టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీకి మతాల మధ్య చిచ్చులుపెట్టడమే ఆయన మార్కు పాలన తప్ప ప్రజల సమస్యలు ఏమి పట్టవని ధ్వజమెత్తారు. ప్రధాని మోడీ ఎప్పుడైనా రైతుల సమస్యలపై మాట్లాడరా? నల్ల చట్టాలు వద్దని ఆందోళన చేసిన రైతులను జీపులతో తొక్కిస్తే మాట్లాడారా, లైంగిక వేధింపులతో న్యాయం చేయాలని కోరుతూ రోడ్ ఎక్కిన రెజర్ల కోసం ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. చివరికి మ ణిపూర్‌లో జాతుల మ ధ్య హింసపై కూడా ఆయన మాట్లాడలేదని, తాజాగా నీట్ పరీక్ష ప్రశ్నాపత్రంలీక్ కావడంతో 24 లక్షల మంది విద్యార్థుల జీవితా లు ప్రశ్నార్థకంగా మారినా ప్రధానికి మాట్లాడేందుకు నోరు రావడం లేదని, కాని ప్రజా సమస్యలపై తమ గళం వినిపిస్తున్న విపక్ష నేతల దూషణలకు దిగ్గడం మాత్రం వచ్చాని మధు యాష్కీ ఎద్దేవా చేశారు. ఇప్పటికై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజా సమస్యలపై మాట్లాడాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్య, వైద్యం, వ్యవసాయంపై దృష్టి సారిద్దాం

అభివృద్ధికి పార్టీలకతీతంగా పనిచేయాలి : మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/చిగురుమామిడి : విద్య, వైద్యం, వ్యవసాయంపై దృష్టి సారిద్దామని, రాజకీయాల కతీతంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చిగురుమామిడి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఎంపిటిసిలు, జడ్పిటిసిల పదవీ విరమణ సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఎన్నికల వరకే రాజకీయాలని, అభివృద్ధిలో అందరూ కలిసి పనిచేయాలన్నారు. తాను హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర మంత్రిగా ఉన్నానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్‌లో నియంతృత్వ పరిపాలన ఉండదని, ప్రజాస్వామ్య ప్రజాపరిపాలన జరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో వచ్చానని, ప్రజా సమస్యలను తెలిసిన వాడినని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గత నెలలో హుస్నాబాద్‌లో నిర్వహించిన జాబ్ మేళాకు 8 వేల మంది వచ్చారన్నారు. చిగురుమామిడి లోనూ జాబ్ మేళా పెడతామన్నారు. హుస్నాబాద్ అంటే పొన్నం ప్రభాకర్ అనే గౌరవం పెంచుతానన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన బిడ్డగా గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి జరుగుతున్న సర్వేకు సహకరించాలన్నారు. వంద శాతం చిగురుమామిడి మండలంలో వ్యవసాయానికి నీరు అందిస్తామని, రోడ్డు, నీళ్లు తదితర సమస్యలన్నీ పరిష్కరిస్తానని పేర్కొన్నారు. రాజకీయాలంటే విమర్శలు, ప్రతి విమర్శలుంటాయని, ఉగాది పచ్చడిలో చేదు, తీపి, వగరు ఉండవచ్చన్నారు. ఐదేళ్లలో ప్రజా సమస్యల పరిష్కారంలో పాటుపడిన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిపి వినీత కొత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ప్రజలకు సేవలందించడంలో తన కుటుంబాన్ని సైతం లెక్కచేయక ప్రజాక్షేత్రంలో పనిచేశానని వెల్లడించారు. తన తండ్రి మాధవరెడ్డి ఎంతఈవో పదవీ విరమణ పొందిన తర్వాత తండ్రి జ్ఞాపకాన్ని గుర్తు చేస్తూ కంటతడి పెట్టారు. ఐదు సంవత్సరాలుగా వివిధ శాఖల అధికారులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు తనకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. చిగురుమామిడి మండలాన్ని అభివృద్ధి పరచాలని మంత్రిని కోరారు. అంతకుముందు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో మండల ప్రజాపరిషత్ గ్రాంటు రెండు లక్షలచే నిర్మించిన భారత రాజ్యాంగ చిహ్నాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, ఎంపిడివో మధుసూధన్, తహసీల్దార్ నరేందర్, జడ్పిటిసి గీకురు రవీందర్, వైస్ ఎంపిపి బేతి రాజిరెడ్డి, వివిధ గ్రామాల ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులున్నారు.

రాహుల్ ప్రసంగాన్ని విమర్శించడం ప్రధానికి తగదు

టి పిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రపతి ప్రసంగంపై లోక్‌సభలో ధన్యవాద తీర్మానంపై చర్చలో భాగంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జులై 1న అద్భుతంగా మాట్లాడి దేశప్రజల దృష్టిని ఆకర్షించారని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ అన్నారు. ప్రజలందరు రాహుల్ గాంధీ మాట్లాడిన తీరును ప్రశంసిస్తుంటే, ఇది మోడీకి కంటగింపుగా మారిందన్నారు. బుధవా రం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌ను అనేక సంవత్సరాల వరకు జనం క్షమించరని ప్రధాని మోడీ ఆక్షేపించడం ఆ యన భావ దారిద్రానికి నిదర్శనం అన్నారు. రాహుల్ ప్రసంగాన్ని దేశ ప్రజలు ఎంతగానో మెచ్చుకున్నారన్నారని గుర్తు చేశారు. కాగా ప్రతిపక్ష నేత పదవి ఔన్నత్యాన్ని భంగపరుస్తూ ప్రధాని మాట్లాడారని, ఇప్పటికైనా రాహుల్ గాంధీ కి మోడీ క్షమాపణ చెప్పి, తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్‌ది పిల్ల చేష్ట బాలక్ బుద్ధి అని ప్రధాని విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. రాహుల్‌ది బాలక్ బుద్ధి అయితే మోడీ తన ఖ్యాతిని ఎందుకు చూపలేకపోయారని మండిపడ్డారు. ఆయన పెద్దరికం, పెద్దతనం ఎక్కడ పోయాయన్నారు. ఎందుకు హుందాగా ప్రవర్తించలేకపోయారో చెప్పాలన్నారు. చివరికి కాంగ్రెస్‌ను నెహ్రూను రాహుల్‌ను టార్గెట్ చేసి ప్రధాని మోడీ మాట్లాడారని మూడు సార్లు వరసగా కాంగ్రెస్‌కు లోక్‌సభలో 100 సీట్లలోపే వచ్చాయని దెప్పిపొడుస్తూ మాట్లాడారని ఇది భావ్యమా అని నిలదీశారు. ఇప్పుడు వచ్చిన సీట్లు కూడా మిత్రపక్షాల ఓట్లతో వచ్చాయని అంటున్నారని, బిజెపికి కూడా స్వతహాగా లోక్‌సభలో సాధారణ మెజారిటీ కూడా రాలేదనే విషయాన్ని ప్రధాని మరిచిపోయారా ? అని ప్రశ్నించారు.

ధాన్యం సేకరణలో ఈ ఏడాది సరికొత్త రికార్డు

- ☞ ముగిసిన రబీ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ
- ☞ 8,99,546 మంది రైతులకు రూ.10547 కోట్ల చెల్లింపులు
- ☞ మూడు రోజుల్లోనే రైతు ఖాతాల్లో వేసిన ప్రభుత్వం.....

ప్రజాపక్షం/ హైదరాబాద్ : రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లను అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. జూన్ 30తో ఈ ప్రక్రియను ముగించారు. ఈ సీజన్‌కు సంబంధించి రాష్ట్రమంతటా 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ఎంత వేగంగా పూర్తి చేసిందో అంతే వేగంతో రైతుల ఖాతాల్లో డబ్బులు వేసి ది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు కేవలం మూడు రోజుల్లోనే చెల్లింపులు పూర్తి చేసింది. మొత్తం 8,99,546 మంది రైతుల ఖాతాల్లో రూ.10547 కోట్లు జమ చేసింది. గత ప్రభుత్వ హాయంలో రైతన్నలకు సకాలంలో ధాన్యం డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఐకెపి కేంద్రాల్లో ధాన్యం అమ్మిన తర్వాత నెల నుంచి 40 రోజులకు కాని డబ్బులు అందని పరిస్థితి ఉండేది.. కాని కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. డబ్బుల కోసం రైతులు ఎదురు చూసే పరిస్థితి లేకుండా కొనుగోళ్ల సెంటర్ల ద్వారా ధాన్యం సేకరించిన వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు పడాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో సివిల్ సప్లయిస్ విభాగం ధాన్యం అమ్మిన రైతులందరికీ మూడు రోజుల్లోనే డబ్బులు చెల్లించి కొత్త రికార్డు నెలకొల్పింది. దీనికి తోడు గతంలో 6889 ఐకెపి సెంటర్లను ఏర్పాటు చేసి ఏఫ్రిల్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించగా ఈ ప్రభుత్వం 7178 కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా రెండు వారాల ముందుగానే మార్చి 25 నుంచే ధాన్యంసేకరణను ప్రారంభించింది. అయితే ఈ ఏడాది 75.40 లక్షల మెట్రిక్ టన్నుల వద్ద కొనుగోళ్లు జరుగుతాయని సివిల్ సప్లయిస్ విభాగం మొదట్లో అంచనా వేయగా , కానీ మార్కెట్లో మ ద్దతు ధర కంటే ఎక్కువ ధర రావటం, ప్రైవేటు వ్యాపారులు పోటీ పడి మంచి ధరకు కొనుగోలు చేయటంతో కేంద్రాలకు వచ్చిన ధాన్యం అంచనా తగ్గింది.

అకాల వర్షాలతో నష్ట పోకుండా పటిష్ట చర్యలు

ఈదురు గాలులు, అకాల వర్షాలకు కూడా రైతులు నష్టపోకుండా ఈసారి కొనుగోలు కేంద్రాల్లో సివిల్ సప్లయిస్ విభాగం పక్కాగా ఏర్పాట్లు చేసింది.. ముఖ్యమంత్రి ఆదేశాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసింది. అంతేకాకుండా గతంలో ధాన్యం కస్ట మ్ మిల్లింగ్ చేసి బియ్యం తిరిగి ఇవ్వని మిల్లర్లకు ఈసా రి ధాన్యం కేటాయించలేదు. నూటికి నూరు శాతం కస్టమ్ మిల్లింగ్ రైస్ అప్పగించిన మిల్లర్లకు మాత్రమే ప్రాధాన్యతను ఇచ్చింది. రాష్ట్రంలో 1532 మంది మిల్లర్లు ధాన్యం మిల్లింగ్ చేసి బియ్యం ఇవ్వకుండా ఎగవేసిన జాబితాలో ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు 116 మందిపై సివిల్ సప్లయిస్ విభాగం రెవిన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించింది. 2023 డిసెంబర్ నుంచి 2024 మే నెలాఖరు వరకు 28 వేల మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ తిరిగి స్వాధీనం చేసుకుంది.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయత్‌రాజ్ శాఖ
నాగర్‌కర్నూల్ :: పిఆయు డివిజన్‌లో చిట్ టెండర్ నోటీస్ నెం. DB/ATP/01/2024-25, తేది:28.06.2024
క్ర.సం.1, మండలం: వంగూర్, పని పేరు: వంగూర్ మండలం, కొండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో బిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అంచనా విలువ: రూ.10.00లక్షలు. క్ర.సం.2, మండలం: వంగూర్, పని పేరు: వంగూర్ మండలం, కొండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో గ్రంథాలయ భవన నిర్మాణం. అంచనా విలువ: రూ.10.00లక్షలు. క్ర.సం.3, మండలం: కల్వకుర్తి మండలం, పని పేరు: నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి హెడ్ క్వార్టర్స్ & మున్సిపాలిటీలో ఉర్దూఘర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అంచనా విలువ: రూ.10.00లక్షలు, మొత్తం 3 పనులకు దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి తేది: 11.07.2024, టెండర్ షెడ్యూల్ జారీ: 11.07.2024, టెండర్ ప్రారంభ & స్వీకరణ తేది: 12.07.2024.
సం/- జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, పిఆయు డివిజన్, నాగర్‌కర్నూల్.
DIPR R.O. No. : 225-DP/CL/ADVT/1/2024-25 Date: 03-07-2024

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, నార్సింగి
రంగారెడ్డి జిల్లా
E1/MCN/ENGG/115/2024 (ఆసక్తి వ్యక్తీకరణ (ఇ.ఓ.ఐ)) తేది : 01.07.2024
నార్సింగి పురపాలక సంఘం థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ద్వారా పనుల నాణ్యతను పర్యవేక్షించే ఏర్పాటుకు వ్యక్తిగత కన్సల్టెంట్‌లు / ఏజెన్సీలు / సంస్థల నుండి ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనలను కోరుతున్నది. అనుభవం కలిగిన ఆసక్తి గల పార్టీలు కిందివి సమర్పించగలరు. 1. కవరింగ్ లెటర్, 2. బిడ్డర్ వాలిడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, 3. గడిచిన ఐదేళ్లలో తెలంగాణ రాష్ట్రంలోని ఏదైనా రాష్ట్ర ప్రభుత్వ విభాగంలో థర్డ్‌పార్టీ కంట్రోల్ సేవలు, 4. పాన్ కార్డ్, జిఎస్‌టి, 5. ఎన్ఏబిఎల్ అక్రిడేటెడ్ పొందిన స్వంత ఇంజనీరింగ్ టెస్టింగ్ ల్యాబ్ హైదరాబాద్‌లో కలిగిన బిడ్డర్, 6. ఏదైనా పురపాలక సంఘంలో ఇదే రకమైన పనీ చేసినట్లయితే ఇఎస్ఐ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, 7. బిడ్డర్ ఐఎస్ఓ 9001 : 2015 క్యూఎంఎస్ అక్రిడేటెడ్ అయ్యి ఉండాలి, 8. కన్సల్టెంట్ థర్డ్‌పార్టీ కంట్రోల్‌లో బిఇ / బిటెక్ (సివిల్) పూర్తి చేసిన 20 సంవత్సరాల అనుభవం కలిగిన టీమ్ లీడర్‌ను నియమించుకోగలగాలి. దీంతో పాటు ఇతర సపోర్టింగ్ టెక్నికల్ మరియు నాన్ టెక్నికల్ స్టాఫ్ ప్రత్యేకించి ఈ పని నిమిత్తమే నియమించుకోగలగాలి. 9. బిడ్డర్ గడిచిన ఐదు ఆర్థిక సంవత్సరాలలో ఏదైనా ఒకే ఆర్థిక సంవత్సరంలో రూ.100.00 కోట్ల విలువకు తక్కువ కాకుండా ఇదే రకమైన పనులు పర్యవేక్షించి ఉండాలి. సంబంధిత సర్టిఫికెట్‌ను జతచేయాలి. పర్యవేక్షించిన మొత్తం పనుల విలువను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ క్యాడర్‌కు తక్కువకాని అధికారులతో సరిపై చేయించాలి. 11. బిడ్డర్ గడిచిన ఐదు ఆర్థిక సంవత్సరాలలో ఒక్క ఆర్థిక సంవత్సరంలోనైనా వార్షిక టర్నోవర్ రూ. 2.00 కోట్లకు తక్కువ కాకుండా థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ సేవలు చేసి ఉండటంతో పాటు సిఏ ద్వారా వార్షిక టర్నోవర్ సర్టిఫికేట్ మరియు గడిచిన ఐదు సంవత్సరాల ఆడిటెడ్ యాన్యువల్ అకౌంట్స్ కలిగి ఉండాలి. 11. జాయింట్ వెంచర్ లేదా ఇతర ఏజెన్సీలతో టై అప్ (భాగస్వామ్యం) అనుమతించబడదు మరియు విఫల సంస్థలు అనుమతించబడవు. 12. సబ్ కాంట్రాక్ట్ అనుమతించబడదు. టెండర్ ప్రతిపాదన అర్హత సాధించేందుకు డాక్యుమెంట్‌లను వేర్వేరు ఎన్వలప్(కవర్)లలో సమర్పించగలరు.
కన్సల్టెంట్‌లు / సంస్థలు తమ సంబంధిత అనుభవానికి సంబంధించిన డాక్యుమెంట్‌లను అందజేయాలి మరియు అన్ని ఇతర డాక్యుమెంట్‌లను మున్సిపల్ కమిషనర్ నార్సింగి మున్సిపాలిటీ పేరుతో రూ.1000/- (ఒక వెయ్యి రూపాయలు) డిడితో ఆసక్తి వ్యక్తీకరణ (ఇఓఐ)ను 08.07.2024వ తేదీన ఉదయం 11 గంటలకు లేదా అంతకుముందు పంపగలరు. అదే రోజు ఉదయం 11:30 గంటలకు వాటిని ఓపెన్ చేయబడును.
పూర్తి టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్ మరియు ఫైనాన్షియల్ బిడ్ ఫార్మాట్‌ను ఆసక్తి ఉన్న పార్టీల కోరికపై ఇవ్వబడును. మరిన్ని వివరాల కోసం మున్సిపల్ కమిషనర్‌ను కార్యాలయ సమయంలో సంప్రదించవచ్చును.
ప్రదేశం : నార్సింగి
సం/- కమిషనర్, నార్సింగి పురపాలక సంఘం
DIPR R.O. No. : 1439-PP/CL/ADVT/1/2024-25 Date: 03-07-2024

ప్రజాపక్షం

గురువారం, జులై 04

కొత్త లోక్‌సభకు కొత్త శోభ

18వ సార్వత్రిక ఎన్నికల అనంతరం కొలువుతీరిన కొత్త లోక్‌సభ కొత్త కళ సంతరించుకుంది. కొత్తభవనం, కొత్త ఫర్నీచర్, కొత్త లైటింగ్, కొత్త కుడ్య చిత్రాలు ఇందుకు కారణం కాదు. ప్రతిపక్ష పార్టీల సభ్యులు దాదాపుగా సగం సీట్లను ఆక్రమించటం, ఎన్నికలకు ముందు ఏర్పడిన 'ఇండియా' కూటమి – ఐక్య ప్రతిపక్షంగా వ్యవహరించటం సభకు కొత్త శోభను చేకూర్చింది. పదేళ్ల తర్వాత గుర్తింపు పొందిన ప్రతిపక్షనాయకుడు 234 మంది సభ్యుల మద్దతుతో ప్రతిపక్ష బెంచీల తొలివరసలో నిలబడినప్పుడు సభకు నిండుదనం వచ్చింది. ఆ స్థానం నుంచి రాహుల్‌గాంధీ తొలి ప్రసంగం – పార్లమెంటులో ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగం పాలక బిజెపి పక్షం గుండెల్లో గునపాలు దించింది. 'పప్పు' అంటూ ఆతని వ్యక్తిత్వాన్ని కొన్నేళ్లుగా అవమానిస్తున్న వాచాలులకు ఆయన మాటలు తూటాల్లా తగిలాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితర మంత్రులు ఎన్నిసార్లు అడ్డుతగిలేరో! ఏనాడు 40శాతం ఓట్లురాని ఈ హిందూత్వ దురహంకారులు దేశంలో 80శాతంపైగా ఉన్న హిందువులందరికీ తామే ప్రతినిధులుగా భుజకీర్తులు తగిలించుకుని ఊరేగుతున్నారు. అయితే, శాంతి, అహింసలను ప్రబోధించే హిందూయిజానికి విరుద్ధంగా హింస...హింస...హింస, ద్వేషం...ద్వేషం...ద్వేషం నూరిపోస్తున్న మీరు అసలు హిందువులేనా అని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లను రాహుల్ ప్రశ్నించినపుడు, తన వాదనకు మద్దతుగా శివతత్వాన్ని గుర్తుచేస్తూ పరమశివుని ఫోటో ప్రదర్శించినపుడు బిజెపి సభ్యుల ముఖాలు కళావిహీనమైనాయి. దురుసుతనానికి ప్రతీకగా భావించబడే అమిత్ షా రాహుల్‌ను ఆపేందుకు స్పీకర్ సహాయం అర్థించాల్సి వచ్చింది. రాహుల్ హిందూ సమాజం మొత్తాన్నిఅవమానించారని, సభకు క్షమాపణ చెప్పాలని వాపోవటం ప్రధానివంతు అయింది. ప్రధానమంత్రి మోదీ రాష్ట్రపతికి ధన్యవాదాల తీర్మానంపై చర్చకు సమాధానమిస్తూ రాహుల్‌ది 'బాలబుద్ధి' అని, శతాబ్దాలపాటు కాంగ్రెస్‌ను ప్రజలు క్షమించరని శాపనార్థాలు పెట్టారు. గత రెండు లోక్‌సభల్లో బండ మెజారిటీతో ప్రతిపక్షంపై ఒంటికాలిమీద విరుచుకుపడుతూ, మూకుమ్మడి సస్పెన్షన్‌లకు పాల్పడుతూ నిరంకుశంగా వ్యవహరించిన బిజెపి ఇప్పుడు ప్రతిపక్షంనుండి ఎదురుదాడికి గురవుతూ, వారి విమర్శలకు సమాధానం చెప్పుకోవలసిన నిస్సహాయ స్థితిలోకి నెట్టబడింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పు సారాంశం ఇదే. రెండు గంటలకు పైగా ప్రసంగించిన ప్రధాని సంవత్సరంపైబడి జాతికలహంతో రగులుతున్న మణిపూర్‌ని ఎందుకు సందర్శించలేదు, రాష్ట్రపతి ప్రసంగంలో ఆ సమస్యను ఎందుకు ప్రస్తావించలేదన్న ప్రతిపక్షం ప్రశ్నకు జవాబు చెప్పలేదు. 25లక్షలమంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడిన నీట్ – యుజి పరీక్ష నిర్వహణలో పేపర్ లీకేజి, అవినీతి తదితర లోటుపాట్లపై ప్రభుత్వం చర్చకు ముందుకు రావాలంటే ప్రధాని నోరు మెదపరు. ఎంత సేపటికీ చరిత్రలో కలిసిపోయిన ఎమర్జెన్సీ విధింపు, ఢిల్లీలో సిక్కుల ఊచకోత ఉదంతాల వెనుక ఆశ్రయం పొందటం, తామేదో దేశాన్ని ఉద్ధరించామంటూ గత కాంగ్రెస్ పాలనపై దుమ్మెత్తిపోయటం మినహా ప్రజలెదుర్కొంటున్న తక్షణ సమస్యలకు ఉపశమనం గూర్చి మాట్లాడరు. వారు గతంనుండి బయటకు రావాలి. జవాబుదారీతనం అలవరచుకోవాలి.

రాజ్యసభలోనూ ప్రభుత్వం డిఫెన్స్‌లోనే ఉంది. కాంగ్రెస్ హేమాహేమీలనేకమంది సభ్యులుగా ఉన్న పెద్దలసభలో ప్రతిపక్షనాయకుడు మల్లికార్జున ఖర్గేని నిలువరించటం సభాధ్యక్షుడు, ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధంకర్ చేతకావటం లేదు. అందుకని ఎంత ఘోష పెడుతున్నా ప్రధానివైపు తప్ప అటువైపే చూడని ఆయన పక్షపాతవైఖరికి నిరసనగా యావత్ ప్రతిపక్షం వాకౌట్ చేసింది. వాకౌట్ రాజ్యాంగ విరుద్ధమంటున్నాడాయన. రాజ్యాంగం అండగా ప్రతిపక్షం ప్రభుత్వాన్ని నిలదీస్తోంది. రాజ్యాంగానికి, అంబేద్కర్‌కు తామే అసలు సిసలు విధేయులమని మోదీ చెప్పుకుంటే నమ్మేకాలం గతించింది. ఆచరణలో నిజాయితీ నిరూపించుకోవలసిన స్థితిలోకి నెట్టబడ్డారు.

బొగ్గు గనుల వేలం రద్దుకై పోరాటంలో పాల్గొనండి

ఎస్.బాల్‌రాజ్
ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
8074246685

1945 సంవత్సరంలో తెలంగాణలో ఉన్న దక్కన్ కంపెనీ ఎఐటియుసి పోరాటాలు, ఉద్యమాల పర్యవసానంగా సింగరేణి ప్రభుత్వ రంగ పరిశ్రమ ఏర్పాటు చేసింది. గోదావరి పరివాహక ప్రాంతంలో బొగ్గు నిల్వలు ఉన్న ప్రాంతాలు సింగరేణికి కేటాయించింది. 1973లో ఇందిరాగాంధీ ప్రభుత్వం వామ పక్షాల డిమాండ్ మేరకు కోల్ ఇండియాను ప్రభుత్వరంగ పరిశ్రమగా మార్చింది. అప్పటి నుండి కోల్ ఇండియా ప్రాంతంలో వచ్చిన బొగ్గుగనులను కోల్ ఇండియాకు, తెలంగాణ ప్రాంతంలో వచ్చిన బొగ్గు గనులు సింగరేణికి మాత్రమే కేటాయించారు. కేంద్రంలో అధికారానికి వచ్చిన మోడీ ప్రభుత్వం 2015లో "మైన్స్ మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేటరీ బిల్లు"లో మార్పులు తీసుకొచ్చి బొగ్గుగనులను వేలంవేసి ప్రైవేటు వారికి, మోడీ స్నేహితులకు అప్పగిస్తున్నారు.

కేంద్రప్రభుత్వం మరింత దూకుడుగా 2021సంవత్సరంలో సింగరేణికి రావాల్సిన 4 బొగ్గు బ్లాకులను వేలం పెడితే దానికి వ్యతిరేకంగా సింగరేణిలో అన్ని సంఘాలు కలిసి 3 రోజులు సమ్మె చేశాయి. సింగరేణి కంపెనీ 4 బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనవద్దని, అదే విధంగా పరోక్షంగా ఇల్లందులో కోయగూడెం ఓసి 3 అరబిందో కంపెనీకి, సత్తుపల్లిలో ఓసి 3ని అవంతిక గ్రూపుకు నామినేషన్‌పై వచ్చే విధంగా చేశారు.

నరేంద్ర మోడీ రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ప్రారంభానికి వచ్చినప్పుడు తెలంగాణ సమస్త ప్రజానీకం మోడీ గో బ్యాక్ అంటూ నిరసనలు చేసినా, కిషన్ రెడ్డి బొగ్గుగనుల శాఖామంత్రిగా సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే విధంగా సింగరేణి బొగ్గుబావులను కొన్నింటిని ప్రైవేటుపరం చేయకుండా కొత్తగా వచ్చే బొగ్గు గనుల వేలం ద్వారా ప్రైవేటు వారికి ఇస్తున్నారు. దేశానికి ప్రధానమంత్రి అయిన మోడీ చాలాసార్లు "ప్రభుత్వరంగ పరిశ్రమలు పుట్టిందే గిట్టడానికి" అని చెప్పారు. అందులో భాగంగా అన్ని ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటువారికి అమ్మివేస్తున్నారు. అయితే సింగరేణిని ప్రైవేటుపరం చేస్తే ఒక్క సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకే కాదు యావత్ తెలంగాణ ప్రజలందరికి నష్టమే. సింగరేణి ప్రభుత్వరంగంలో ఉండటం వలన కొన్ని అండర్ గ్రౌండ్ బావులలో ఒక టన్ను బొగ్గు తీయటానికి 8 నుండి 15వేలు ఖర్చు అవుతుంటే ప్రభుత్వ నిర్ణయం ప్రకారం కేవలం 2, 3వేలకు అమ్మటం వలన సింగరేణికి కోట్లాది రూపాయల నష్టం వస్తుంది. అదే ఆదానీ లాంటి ప్రైవేటు కంపెనీలు ఒక టన్ను 12వేల నుండి 21వేల రూపాయలకు అమ్ముతున్నారు. అంటే బొగ్గు రేటు పెరిగితే బొగ్గును ఉపయోగించే కరెంటు, సిమెంట్, ఇనుము తయారు చేసే ఇతర పరిశ్రమల ఉత్పత్తుల రేట్లు 3.4శాతం పెరుగుతుంది. దీని వలన నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజల జీవితాలు దుర్భరమవుతాయి.

బిజెపి ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారానికి వచ్చిన వెంటనే 10వ సారి దేశంలోని బొగ్గుగనులు, బావుల వేలం ప్రక్రియ ప్రారంభించి కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెట్టేందుకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లలో పాల్గొనాలని ప్రకటించి దేశ విదేశీ పెట్టుబడిదారులకు బొగ్గుబావులన్నింటిని అప్పగిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి గనుల శాఖామంత్రిగా నియమించబడ్డ జి.కిషన్‌రెడ్డి సమక్షంలో తెలంగాణ సింగరేణి గనులను ప్రైవేటుపరం చేసేందుకు మొదటి అడుగు వేయటం జరిగింది. నైజాం నవాబ్ కాలంలోనే సింగరేణి ప్రభుత్వరంగ సంస్థగా ఏర్పడింది. కొన్ని వందల సంవత్సరాలు త్రవ్వినా తరగని బొగ్గు నిక్షిప్తమై ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సింగరేణి ప్రతి సంవత్సరం 8వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తూ తెలంగాణ అభివృద్ధిలో అంతర్‌భాగమై పోయింది. అదే విధంగా కేంద్ర ప్రభుత్వానికి 49వేల కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం చెల్లిస్తున్నా లాభాలతో నడుస్తున్న సింగరేణిని ప్రైవేటువారికి ధారాదత్తం చేయటం "తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కున్నట్లు అవుతుంది''. సింగరేణి బొగ్గుగనులను ప్రైవేటువారికి కట్టబెట్టటం సహించలేని తెలంగాణ సమాజం, సింగరేణి కార్మికులు పోరాటాలు, ఉద్యమాలు చేస్తూ సమ్మెలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం వెనకడుగువేయకపోవటం విస్తుగొల్పుతున్నది.

గతంలోనే కోయగూడెం ఓసి 3 బ్లాక్‌ను, సత్తుపల్లి బ్లాకును ప్రైవేటువారికి ఇవ్వటంతో సింగరేణికి తీవ్రమైన నష్టం వాటిల్లింది. అయినా కేంద్ర ప్రభుత్వం మంచిర్యాల జిల్లా, మందమర్రి, శ్రావణపల్లి బ్లాకును వేలంలో పెట్టుబడిదారులకు కేటాయించటం తెలంగాణ అభివృద్ధికి, తెలంగాణ నిరుద్యోగులకు, కార్మికులకు, ప్రజలకు అన్యాయం చేయటమే. సింగరేణి లాభాలతో ఉండటం, రాబోవు 100 సంవత్సరాల పాటు బొగ్గు నిల్వలు పుష్కలంగా ఉన్నందున గోదావరి పరివాహాక ప్రాంతంలో ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు పాగ వేసి సింగరేణి బొగ్గుగనులను దోపిడి చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వల్ల సింగరేణికి కొత్త బొగ్గుగనులను కేటాయించకపోతే రాబోవు 10 సంవత్సరాల కాలంలో బొగ్గు బావులు మూతపడే ప్రమాదం ఉంది. కొత్త బావులు కేటాయించకపోతే సింగరేణి పూర్తి స్థాయిలో ప్రైవేటు వారి చేతుల్లోకి వెళుతుంది. బొగ్గు బావుల ప్రైవేటీకరణ వల్ల తెలంగాణ రాష్ట్రానికి, నిరుద్యోగులకు, సింగరేణి కార్మికులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని పాలకులు గుర్తించాలి. సింగరేణి బొగ్గుగనులు తెలంగాణాలోని 6 జిల్లాల్లో విస్తరించి బొగ్గు నిల్వలు ఉన్నాయి. సింగరేణి ప్రైవేటీకరణ, వేలం వలన తెలంగాణ రాష్ట్రంలోని వామపక్ష పార్టీలు, అన్ని కార్మిక సంఘాలు రాజకీయాలకు అతీతంగా కార్మికులు, ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధమై సింగరేణిని ప్రైవేటీకరణ నుండి కాపాడుకోవాలని పోరాడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలలో భాగంగా దేశవ్యాపితంగా 61 బొగ్గు బావులను ప్రైవేటు, కార్పొరేట్ పెట్టుబడిదారులకు వేలం ద్వారా కారుచౌకగా అమ్మి జాతీయ సంపదను కొంతమంది కేంద్ర ప్రభుత్వ అనుయాయులకు కేటాయించేందుకు జరుగుతున్న వేలాలను తక్షణమే ఆపాలని తెలంగాణ రాష్ట్రంలో అన్ని కార్మిక సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా తీర్మానించి రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో జులై 5న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించి కలెక్టర్లకు మెమోరాండాలు ఇవ్వాలని తీర్మానించటం జరిగింది. జులై 6 నుండి 12 వరకు అన్ని జిఎం ఆఫీసులు, హెడ్ ఆఫీసుల ముందు నిరాహారదీక్షలు చేస్తారు. జులై 10న అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున అన్ని కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలతో ధర్నాలు నిర్వహించి వేలంను ఆపాలని డిమాండ్ చేయనున్నారు. జులై 17న దేశవ్యాపితంగా 61 బొగ్గు బావులను వేలం వేస్తున్న దుర్దినం రోజు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ముందు పెద్ద ఎత్తున ధర్నా చేయాలని నిర్ణయించారు.

బొగ్గుబావుల వేలంను రద్దు చేయాలని తెలంగాణలోని వామపక్ష పార్టీల సంయుక్త సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించి సింగరేణి బొగ్గు బావులను సింగరేణి యాజమాన్యానికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ జులై 5న కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించాయి. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని బొగ్గుగనుల వేలం పాటను రద్దు చేయాలని, బొగ్గు బ్లాకులు నేరుగా సింగరేణికి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వామపక్ష పార్టీలు, అన్ని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఆంగ్లేయుల గుండెల్లోకి దూసుకెళ్లిన విప్లవ బాణం

మన దేశ స్వాతంత్ర్య ఉద్యమం వివిధ రూపాల్లో జరిగింది.ఇందులో విప్లవ మార్గం ఒకటి. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వంటి వారు బ్రిటిష్ వారిని ఎదిరించి ప్రాణ త్యాగం చేశారు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కునుకులేకుండా చేసిన సీతారామరాజు.. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశారు.

అల్లూరి సీతారామరాజు 1897 జులై 4న విశాఖపట్నం జిల్లా పాండ్రంగిలో జన్మించారు. అయితే పెరిగింది మాత్రం పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో. రామరాజు తండ్రి వెంకట రామరాజు, తల్లి సూర్యనారాయణమ్మ. 9వ తరగతి వరకు చదివిన అల్లూరి.. సంస్కృతం, జోతిష్యశాస్త్రం, జాతక శాస్త్రం, విలువిద్య, గుర్రపు స్వారీలో ప్రావీణ్యం పొందారు. 1917లో విశాఖపట్నం జిల్లా క్రిష్ణదేవీపేట ద్వారా మన్యంలోకి అడుగుపెట్టారు. మన్యం ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి, బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను పురిగొల్పారు.

గంటందొర, మిగిలిన అనుచరుల సాయంతో బ్రిటిష్ అధికారులపై విప్లవానికి అల్లూరి తెరతీశారు. 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై తొలిసారి దాడి చేశారు. 23వ తేదీన క్రిష్ణదేవీపేట పోలీస్ స్టేషన్, 24న తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై దాడిచేశారు. ఈ మూడు స్టేషన్లపై దాడి ద్వారా భారీగా ఆయుధాలను సేకరించుకొని తిరుగుబాటు ప్రారంభించారు. ఇక అక్కడి నుంచి వరసపెట్టి పోలీస్ స్టేషన్లపై దాడులు చేస్తూ బ్రిటిష్ అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు అల్లూరి. ఈ తిరుగుబాటును ఎలాగైనా అణచివేయాలని నిర్ణయించుకున్న బ్రిటిష్ ప్రభుత్వం.. మన్యంలో ముమ్మర చర్యలు చేపట్టి చాలామంది రాజు అనుచరులను చంపేసింది.

బ్రిటిష్ ప్రభుత్వం మన్యం ప్రజలను కాల్చుకుతినడం మొదలుపెట్టింది. ప్రభుత్వం ప్రజలను పెడుతున్న కష్టాలను చూడలేని రాజు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డారు. 1924 మే 7న విశాఖపట్నం జిల్లా మంప గ్రామానికి సమీపాన రాజు స్వయంగా లొంగిపోయారు. సీతారామరాజుపై పగతో రగిలిపోతున్న బ్రిటిష్ అధికారులు ఆయన్ని కాల్చిచంపారు. అల్లూరి త్యాగం చిరస్మరణీయం.

(జూన్ 4అల్లూరి సీతారామరాజు జయంతి)

ఎం.రాం ప్రదీప్,
9492712836

అమెరికా జాతిపిత జార్జ్ వాషింగ్టన్!

ఇంగ్లాండ్ పాలనలో ఉన్న అమెరికా సంయుక్త రాష్ట్రాలు చేపట్టిన అమెరికన్ విప్లవం ఫలితంగా 04 జూలై 1776న స్వాతంత్ర్యాన్ని పొంది స్వేచ్ఛా గాలులు పీల్చడం జరిగింది. ఈ మహాఘట్టాన్ని పురస్కరించుకొని 04/05 జులై రోజున అమెరికాలోని 50 సంయుక్త రాష్ట్రాలు సెలవు దినాన్ని పాటిస్తున్నాయి.1812లో జరిగిన యుద్ధానంతరం 'యుయస్ ఇండిపెండెన్స్ డే' వేడుకలను ఘనంగా పాటించటం ప్రారంభించారు. 1870 తరువాత స్వాతంత్ర్య దినం రోజున ప్రభుత్వ వేతనంతో కూడిన సెలవు దినంగా పాటించుట జరుగుతున్నది. ఈ ఉత్సవాల్లో భాగంగా దేశ వ్యాప్తంగా కవాతులు, వినోదాలు, సభలు, సమావేశాలు, క్రీడలు, కుటుంబ కలయికలు, బాణాసంచాల జిలుగు వెలుగులు, విహార యాత్రలు లాంటి వేడుకల్లో ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొంటూ సంబరాల్లో మునిగి తేలుతారు.



04జులై – అమెరికా పుట్టిన రోజు:

అప్పటి వరకు బ్రిటన్‌కు చెందిన 'కింగ్ జార్జ్ 3' చక్రవర్తి పాలనలో 13 అమెరికన్ కాలనీలు ఉండేవి. నాటి బ్రిటన్ పాలనలోని అమెరికన్ ఖండపు కాంగ్రేస్ 02 జూన్ 1776న స్వాతంత్ర్య ప్రకటనకు సంబంధించిన తీర్మానం చేసినప్పటికీ 04 జులైన మాత్రమే స్వాతంత్ర్య ప్రకటనపై సంతకాలు చేయడంతో అమెరికా పుట్టిన రోజుగా పాటించుట జరిగింది. 'థామస్ జఫెర్సన్' నాయకత్వంలో ఏర్పడిన ఐదుగురు సభ్యుల కమిటీ స్వాతంత్ర్య ప్రకటనను తయారు చేశారు. ఈ కమిటీలోని థామస్ జఫెర్సన్, జాన్ ఆడమ్స్, బెంజిమన్ ఫ్రాంక్లిన్ ఒక వైపు, ఇంగ్లాండ్ పాలకులు మరో వైపు ఏకగ్రీవంగా స్వాతంత్ర్య ప్రకటనపై సంతకం చేయడం జరిగింది.

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటన్ చక్రవర్తి పాలనలో అమెరికన్లు దుర్భర బానిసలుగా బతకడం జరిగిందని, 'జార్జ్ వాషింగ్టన్' నేతృత్వంలో స్వాతంత్ర్యం కోసం పెద్దఎత్తున ఉద్యమాలు, పోరాటాలు జరిగాయని చరిత్ర వివరిస్తున్నది. ఈ కారణంగానే తనదైన అమెరికన్ రాజ్యాంగంతో పాలన చేసిన తొలి అధ్యక్షుడు (1789 –1797) జార్జ్ వాషింగ్టన్‌ను 'అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతి పిత (ఫాదర్ ఆఫ్ యుయస్)'గా పిలవడం జరుగుతున్నది. తనకంటూ ఒక అమెరికన్ రాజ్యాంగం లేకుండానే 1776 నుంచి 1789 వరకు ఎనిమిది మంది అధ్యక్షులు సేవలు అందించారు. 1787లో ఏర్పడిన అమెరికా రాజ్యాంగ రచన కమిటీకి జార్జ్ వాషింగ్టన్ చైర్మన్‌గా వ్యవహరిస్తూ ప్రధాన భూమికను నిర్వహించారు. 'డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్' ప్రకటనపై సంతకాలు చేసిన థామస్ జఫర్సన్, జాన్ ఆడమ్స్‌లు అనంతరం అమెరికా అధ్యక్షులుగా పని చేయడమే కాకుండా ఇద్దరు 50వ స్వాతంత్ర్య వేడుకలు జరుగుతున్న రోజు 04 జూలై 1826న తుది శ్వాస విడవడం జరిగింది. అదే విధంగా మరో అమెరికా అధ్యక్షుడు జేమ్స్ మన్రో కూడా 04 జులై 1831న తుదిశ్వాస విడవడం జరిగింది. 04 జులై 1872న జన్మించిన కెల్విన్ కూలిడ్జ్ కూడా యుయస్ అధ్యక్షుడిగా పని చేశారు.

అమెరికా 46వ అధ్యక్షుడిగా జో బైడెన్:

స్వాతంత్ర్యం పొందిన అమెరికాకు 46వ అధ్యక్షుడిగా నేడు జో బైడెన్ సేవలను అందించుట మనకు తెలుసు. 1776కు పూర్వం నేటి అమెరికా సంయుక్త రాష్ట్రాలను 'కాంటినెంటల్ కాంగ్రెస్'గా పిలిచేవారు. జార్జ్ వాషింగ్టన్ ప్రభుత్వ హయాంలో 1792లో ప్రారంభమైన 'వైట్ హౌజ్' నిర్మాణం 1800 వరకు కొనసాగింది. శ్వేతసౌధంలో అడుగిడిన తొలి అధ్యక్షుడిగా 'జాన్ ఆడమ్స్' చరిత్రలో నిలిచారు. నవంబర్ 05, 2024న జరుగనున్న యుఎస్ అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి పూర్వ అధ్యక్షులు డొనాల్ ట్రంప్ మధ్య నువ్వా నేనా అనే రీతిలో పోటీ నెలకొని ముమ్మర ప్రచారం జరుగుతున్నది. నేడు అమెరికా పౌర సమాజం 248వ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో మనం దరం వారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం.

'హేపీ ఇండిపెండెన్స్ డే టు అమెరికన్స్'.

(04 జులై 'అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం' సందర్భంగా)

డా బిఎం. రెడ్డి, 9949700037

కొత్త క్రిమినల్ చట్టాలు... ప్రజా ఉద్యమాలు అణచడానికేనా?

ఎన్‌డిఏ ప్రభుత్వం 2023లో కొత్తగా తీసుకొచ్చిన మూడు క్రిమినల్ న్యాయచట్టాలు 2024 జులై 1 నుండి అమలులోనికి వచ్చినవి. వీటిని పరిశీలించితే ప్రజాస్వామ్య ఉద్యమాలపైన, హక్కులకొరకు ఉద్యమిస్తున్న ఉద్యమకారులపైన కఠినతరమైన చట్టాలను ప్రయోగించి వారిని జీవితాంతం జైళ్లలో లేదా మరణశిక్ష విధించే విధంగా రూపొందించారు. పాత చట్టాలలో ఉన్న వాటికీ అదనంగా కొన్ని సెక్షన్స్ చేర్చి మరింత కఠినతరం చేశారు. వీటి అమలులో పోలీసులకు విశేష అధికారాలు కల్పించారు. పాత భారతీయ శిక్షాస్మృతిలోని 24 సెక్షన్లను తొలగించి, కొత్తగా తీసుకొచ్చిన బిఎన్‌ఎస్‌లో 23 కొత్త సెక్షన్లను చేర్చి కొత్త చట్టాన్ని రూపొందించారు.

కొత్త చట్టం ద్వారా రాజద్రోహం అనే దాన్ని దేశద్రోహంగా మార్చారు.హక్కులకొరకు ఉద్యమించే వారిపైనా, పౌరహక్కులకొరకు ఉద్యమంచే వారిపైనా చివరకు హక్కుల రక్షణలకు ఢిల్లీ పార్లమెంటును ముట్టడించినా, ప్రజాస్వామ్య ఉద్యమకారులను అణచివేతకు.. కొత్త రాష్ట్రం కోసం ఎవరైనా గొంతు ఎత్తితే కూడా ఈ కొత్త నిబంధన ప్రకారం నేరం అవుతుంది. పాత నిబంధనలో సార్వభౌమత్వం, సమగ్రత అన్న పదాలు లేవు.వాటిని ఈ కొత్త నిబంధనలో చేర్చారు. ఇవి ప్రజాస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన చట్టాలని న్యాయకోవిదులు, మేధావులు, విపక్ష పార్టీల నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కొత్త క్రిమినల్ చట్టాల అమలును వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ చట్టాల్లో అనేక తిరోగమన నిబంధనలు ఉన్నాయని విమర్శించారు.

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రూపకల్పన చేసుకోవడం జరిగింది. ఈ 77 సంవత్సరాల ప్రజాస్వామ్య పాలనలో అనేక చట్టాల్లో మార్పులు చేసుకోవడం జరిగింది. 2014 లో అధికారంలోనికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బ్రిటిష్ కాలము నాటి చట్టాలను మన దేశ పరిపాలన అవసరాలకు అనుకూలంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రకటించింది. అందుకు అనుగుణంగా పార్లమెంట్‌లో చట్టాలపై చర్చించి ప్రజామోదంతో చట్టాల రూపకల్పన చేసుకోవచ్చు. కానీ 2019లో బిజెపికి తిరుగులేని మెజార్టీ రావడంతో ఏకపక్షంగా చట్టాలు తెచ్చింది. వారు చెబుతున్నట్టు చట్టాలలో మార్పులు తీసుక రావలసిన సంస్కరణలపై చర్చించి అవసరం వస్తే పార్లమెంట్ స్టాండింగ్ కమిటీని వేసి, బహిరంగ చర్చలకు అనుమతించి ప్రజాభిప్రాయాన్ని పొందుతూ చట్టాల్లో చేర్పులు మార్పులు తీసుకురావచ్చు. కానీ 2020–21లో ప్రధాన ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్ సమావేశాలు బహిష్కరించిన సందర్భంలో ఎలాంటి చర్చ లు లేకుండా 44 కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొచ్చి నాలుగు కోడ్‌లుగా మార్చినారు. అదే విధంగా 2023 పార్లమెంట్ సమావేశంలో ఇండియన్ పీనల్ కోడ్ (ఐ పి సి) స్థానంలో భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సి ఆర్ పి సి) స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహితచట్టాన్ని, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఏ)స్థానంలో భారతీయ సాక్షియ అధినియం చట్టాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ 146 మంది సభ్యులను సస్పెండ్ చేసి కనీసం చర్చలు లేకుండా, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపకుండా మూజువాణి ఓటుతో కొత్త చట్టాలు డిసెంబర్ 2023 నాడు పార్లమెంట్లో ఆమోదించుకున్నారు. కొత్త చట్టాలపై ఎలాంటి చర్చ జరగకుండా కొన్ని నిమిషాలలోనే పార్లమెంట్లో ఆమోదం పొందారు. 2024 జులై 1 నుంచి ఈ మూడు చట్టాలు అమలులోకి తీసుకొచ్చారు.

భారతీయ న్యాయ సంహిత :

భారతీయ న్యాయ సంహిత చట్టంలో 350 విభాగాలు ఉన్నాయి. దేశంలోని కొత్త క్రిమినల్ కోడ్ దీనిలో 511 సెక్షన్లు ఉన్నాయి. 163 ఏళ్ల పాత ఐపిసిని ఈ కొత్త చట్టం భర్తీ చేయనుంది. అత్యాచారం, ఆర్గనైజ్డ్ క్రైమ్స్, సైబర్ క్రైమ్స్ వంటివి పరిష్కరించేందుకు కొత్త చట్టంలో పొందుపరిచారు.

ఈ కొత్త చట్టాలతో దేశ న్యాయవ్యవస్థలో ఎన్నో కీలక మార్పులు చోటు చేసుకుంటాయని తెలిసింది. జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్‌లో పోలీసులకు కంప్లైంట్ రిజిస్ట్రేషన్, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ మోడ్‌ల ద్వారా సమన్లు పంపడం, క్రూరమైన నేరాలకు సంబంధించి వీడియోగ్రఫీ తప్పనిసరి వంటి నిబంధనలు కొత్త చట్టాల ద్వారా అమల్లోనికి వస్తాయని చెబుతున్నది. రాజ్యాంగంలో పొందుపరిచిన ఐడియాలజీలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత సామాజిక వాస్తవాలను, నేరాలను పరిష్కరించేందుకు, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన మెకానిజాన్ని ఈ చట్టాలు అందిస్తాయని హోంశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు.

కొత్త నేరచట్టాలను వాయిదా వేయాలి :

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా కొత్త నేర చట్టాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ అంశాన్ని విపక్ష పార్టీలు పార్లమెంటులో లేవనెత్తుతాయని స్పష్టం చేశారు. ఈ మూడు కొత్త నేర చట్టాలను సిపిఐ వ్యతిరేకిస్తుందని తెలిపారు.

మూడు కొత్త నేర చట్టాల అమలును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ఖండించారు. ఎన్నికలలో రాజకీయంగా, నైతికంగా ఎదురుదెబ్బ తిన్న మోదీజీ బిజెపి రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్లు నటిస్తున్నారు. ఇండియా ఐక్య సంఘటన ఇకపై ఈ 'బుల్డోజర్ జస్టిస్' ను పార్లమెంటరీ వ్యవస్థలో అమలు చేయడానికి అనుమతించం అని స్పష్టం చేసింది. 'జులై 1, 2024 అర్ధరాత్రి 12 నుంచి అమలులోకి వచ్చిన కొత్త నేర చట్టాలు ఈరోజు భారతదేశాన్ని పోలీసు రాజ్యంగా మార్చడానికి పునాదులు వేశాయి. వాటి అమలును తక్షణమే నిలిపి చేయాలని తృణమూల్ కాంగ్రెస్ నేత..మమత బెనర్జీ, డీఎంకే నేత స్టాలిన్, తదితరులు తీవ్రంగా వ్యతిరేకించారు.

– పరిశీలకుడు

ప్రతి ఉన్నత పాఠశాల మినీ గురుకులంగా మారాలి



ఎన్.తిర్మల్,
9441864514

విద్యారంగంలో ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఆలోచన తెలంగాణా విద్యారంగం అభివృద్ధికి తోడ్పడుతుంది.2009 విద్యాహక్కు చట్టం కూడా అదే చెబుతుంది! ప్రాథమికోన్నత విద్య పూర్తి అయ్యే వరకు విద్యాబాధ్యత మొత్తం ప్రభుత్వమే వహించాలి. పదేళ్ళుగా తెలంగాణా విద్యారంగం అపసవ్య దిశలో ప్రయాణంచేసి అది రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు సౌకర్యాలు లేమితో కొన్ని, సౌకర్యాలు ఉంటే బోధనా సిబ్బంది లేక మరికొన్ని, ఈరెండు ఉంటే సరైన విద్యార్థుల సంఖ్య లేక వెలవెల పోయిన పాఠశాలలు కొన్ని – ఇలా తెలంగాణా పాఠశాల వ్యవస్థ కునారిల్లింది. దీనికి ప్రధానకారణం గత ప్రభుత్వం విద్యారంగంలో అనుసరించిన అనాలోచిత నిర్ణయాలు మాత్రమే! ప్రభుత్వ పాఠశాలల్లో వసతి సౌకర్యాలు కల్పించకపోగా కేవలం నెలకు 3వేల రూపాయల స్వల్ప గౌరవవేతనంతో పాఠశాల పారిశుద్ధ్యం నిర్వహిస్తున్న స్వీపర్లను సైతం తొలగించి పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తం చేశారు. కులాల పేరుతో గురుకుల పాఠశాలలు పెట్టడం మూలంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న బలహీన వర్గాల పిల్లలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుండి గురుకులాల్లో చేరిపోవడంతో వందలసంఖ్యలో ఉండాల్సిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పిల్లల సంఖ్య పదుల సంఖ్యలోకి జారిపోయాయి. గురుకుల పాఠశాలల్లో తాత్కాలిక సిబ్బంది నియామకాలు న్యాయం చేయలేకపోయాయి. బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈగలు తోలుకోవలసిన పరిస్థితి ఉండగా, గురుకుల పాఠశాలల్లో పిల్లలున్నా తాత్కాలిక నియామకాలతో వ్యవస్థను భ్రష్టు పట్టించారు. చివరకు తెలంగాణా రాష్ట్రంలో కెజి టు పిజి విద్య నినాదం అపహాస్యం అయ్యింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యవస్థ అనేది గ్రామాల్లో ఉన్న కుల, మత వ్యవస్థను సైతం బలహీన పరిచి, పాఠశాలలో సర్వ విద్యార్థి సమానత్వం అనే కాన్సెప్ట్‌ను మనం చూశాం. అలాంటి అభ్యుదయ వ్యవస్థను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ గురుకులాలు ఏర్పాటుచేసింది. దీనికి సంకేతమే వారే చెప్పాలి. ప్రస్తుత ప్రభుత్వం ఉన్నత పాఠశాలలన్నింటినీ బలోపేతం చేస్తామని విద్యాసమీక్షలో ప్రకటించడం మంచి నిర్ణయం కానుంది. ఇప్పుడున్న ఉన్నత పాఠశాలలన్నింటా రిటైర్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులస్థానాలు భర్తీ చేయడం, వసతి సౌకర్యం, విశాలమైన భూములు, భవనాలు కలిగిఉన్న ఉన్నత పాఠశాలలను మినీ గురుకులాలుగా మార్చడం, పాఠశాల మానిటరింగ్ వ్యవస్థను పటిష్టం చేయడం, పాఠశాల భౌతిక వనరులను మెరుగుపర్చడం ద్వారా తిరిగి ప్రభుత్వ పాఠశాల వ్యవస్థకు పునర్ వైభవం తేవడంతో పాటు, గ్రామీణ విద్యావ్యవస్థ బలోపేతం అవుతుంది.

అంతేకాదు! 2009విద్యాహక్కుచట్టం అంశాలు నూటికి నూరుశాతం అమలుజరిపినట్లు అవుతుంది. విద్యాకమీషన్ సూచనల మేరకే దేశవ్యాప్తంగా సర్వశిక్షా అభియాన్ అనే వ్యవస్థ ద్వారా ఒక కిలోమీటరు లోపల ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్ల లోపల ప్రాథమికోన్నత పాఠశాల, ప్రతి ఐదు కిలోమీటర్ల రేడియేషన్ లోపల ఉన్నత పాఠశాల ఉండాలనే ప్రాథమిక సూత్రం చట్టబద్ధమైనది. చట్టప్రకారమే ఈ పాఠశాల వ్యవస్థ ఏర్పడినపుడు చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలకు ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం చేయడం అనేది ఏ రకంగా చేసినా విద్యాహక్కు చట్టానికి విరుద్ధమే అవుతుంది. ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయడం మూలంగా ప్రైవేటు విద్యావ్యవస్థ సమాజంలో తెస్తున్న వికృత విద్యా మూలాల నుండి భవిష్యత్ తరాలను కాపాడిన వారం అవుతాము. ఉదాహరణకు గత ఏడేండ్లుగా దేశ రాజధాని ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం విద్యను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు ప్రైవేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులు మారిపోయారు. అంతేకాదు ఈ ఏడాది 4వేల నీట్ సీట్లు ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలు సాధించేవరకు ప్రస్థానం చేరుకుంది. ఎక్కడైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తే మార్పు పెద్ద కష్టం కాదు. ఢిల్లీలో విద్యారంగంపై బడ్జెట్‌లో 25శాతం కేటాయిస్తున్నారు! అలాంటి త్యాగం కూడా ప్రభుత్వాలు ముందు చూపుతో చేయాల్సి ఉంటుంది. మన తెలంగాణా రాష్ట్రంలో విద్యారంగంలో నిష్ణాతులైన మేధావులు ఉన్నారు. ఆరంగంలో ప్రయోగం చేసి అనుభవాలు పొందిన ఆకునూరి మురళి లాంటి రిటైర్డ్ అధికారులు ఉన్నారు. కనుక ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేయాలనే కాన్సెప్ట్ పాలకులకు వచ్చింది. అంటే పాలకులు మానవవనరుల అభివృద్ధినే సరైన అభివృద్ధి అనే ఉన్నత భావంతో ఉన్నట్లు లెక్క! కనుక తెలంగాణా ప్రభుత్వం సమీక్షలతోనే సరిపుచ్చుకుండా, ప్రణాళికాబద్ధంగా విద్యారంగంపై సరైన దృక్కోణంతో పనిచేయాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేయడంతో పాటు, గురుకుల సిబ్బందిని పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మినీ గురుకులాలకు మార్పు చేయడం, గురుకుల భవనాలు ఉన్న చోట అక్కడ సమీపంలోని ఉన్నత పాఠశాలలను విలీనం చేయడం ద్వారా సర్దుబాట్లు కూడా పెద్ద అసాధ్యం కాదు. ఇప్పుడు ఎలాగూ అల్పాహారం, మధ్యాహ్న భోజనం ప్రభుత్వ పాఠశాలల్లో ఇస్తున్నారు. రాత్రి భోజనం ప్లాన్ చేసుకుంటే మినీ హాస్టల్ నిర్వహణ అంత కష్టం కాదు. పైగా సాయంత్రం సమయం పాఠశాలల్లో అదనపు అధ్యయన తరగతులు నిర్వహణకు సైతం ఈ విధానం తోడ్పడుతుంది.

సమాజ మూలాల్లో ప్రభుత్వ పాఠశాలలు దర్పణంగా ఉంటాయి కనుక ఈ పాఠశాలల్లో చదివేపిల్లలు జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను సైతం పరిష్కారం చేసుకునే శక్తి పెరుగుతుంది. ప్రస్తుతం మన తెలంగాణా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు అన్నింటినీ అభివృద్ధి చేయాలనేది ఆలోచనకాదు, అది ఆశయం! కనుక అమలులో చిత్తశుద్ధి ఉండాలని, మన విద్యా వ్యవస్థ గాడిలో పడాలని ఆశిద్దాం!

యువత స్వయం ఉపాధితో రాణించాలి

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట: యువత స్వయం ఉపాధి పొందుతూ మరి కొంత మందికి ఉపాధి కల్పించేలా వ్యాపారాల్లో ముందుకు సాగాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 15వ వార్డు కుడకుడ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సిటి కేఫ్ హోటల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హోటల్‌కు వచ్చే వినియోగదారుల మన్ననలు పొందేలా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, నాయకులు అంజద్ అలీ, బైరు నాగరాజు, తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, వెన్న మధుకర్ రెడ్డి, నిర్వహకులు పరశనబోయిన అరుణ్ కుమార్, పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/సూర్యాపేట: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ సెక్యూరిటి డిఎస్‌పి సుంకరి శ్రీనివాసరావు అ న్నారు. బుధవారం జిల్లా ఎస్‌పి సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాలతో జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మా ట్లాడుతూ విద్యార్థులు తమ చదువుకు అవసరమయ్యే మేరకే ఇంటర్నెట్‌ను సద్విని యోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు సైబర్ మోసాలపై 1930, వేధింపులకు గురైతే 100కు సమాచారం ఇవ్వాలన్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, సైబర్ సె క్యూరిటీ ఇన్ స్పెక్టర్ లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా వ్యక్తి గత వివరాలు, బ్యాంకు వివరాలను బహిర్గతం చేయవద్దని సూచించారు.పోలీస్ కళాబృందం సభ్యులు సాంస్కృతిక, పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణ ఎస్‌ఐ మహేంద్రనాథ్, సైబర్ సెక్యూరిటి ఎస్‌ఐలు రాజశేఖర్, అశోక్,కళాశాల ప్రిన్సిపల్ సైదులు, పోలీస్ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా కుటుంబానికి ధీమా



ప్రజాపక్షం/నేరేడుచర్ల : ప్రమాదబీమా తీసుకున్న వారి కుటుంబాలకు ప్రమాద బీమా ధీమాగా ఉంటుందని సూర్యాపేట డివిజన్ పోస్టల్ సూపరింటెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు అన్నారు.బుధవారం మండలంలోని మేదారం గ్రామంలో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు ద్వారా గ్రామానికి చెందిన మామిడి నాగయ్య గత ఆరునెలల క్రితం టాటా ఏఐజి నుండి రూ.10లక్షల ప్రమాద భీమా తీసుకుని మార్చి 12 న రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందడంతో మృతుని భార్య మామిడి సునీత కుటుంబ సభ్యులకు రూ.10లక్షల ప్రమాదభీమా చెక్కును ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పోస్టఆఫీస్ ప్రజలందరికి అందుబాటులో ఉండి పోస్టఆఫీస్ ద్వారా అందించే అన్ని రకాల పథకాలను చేర వేయడం కోసం తమ సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. ఐపిపిబి హుజూర్‌నగర్‌శాఖ మేనేజర్ రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రమాద బీమాకు సంబంధించిన పాలసీల్లో ఇప్పటి వరకు 19 మందికి కోటి 90లక్షలు క్లెమ్‌లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టాటా ఏఐజి సేల్స్ మేనేజర్ వీరేందర్, హుజూర్‌నగర్ పోస్టల్ సబ్ డివిజన్ ఇన్స్‌పెక్టర్ గౌని సురేష్,అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మణ్, జి.కోటయ్య , పంచాయతీ కార్యదర్శి ప్రేమలత,మాజీ సర్పంచ్ సుంకరబోయిన స్వాతిమధు,బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ చౌగాని రాంబాబు,అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ కవిశ్రీలేఖ,మాజీ బిపిఎం అప్పారావుపాల్గొన్నారు.

జీవితం ప్రజాసేవకే అంకితం

దేవరకొండ ఎంఎల్ఎ బాలునాయక్



ప్రజాపక్షం/చింతపల్లి : దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలు నాయక్ వేడుకల సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసింది. సుమారు 60 మంది తమ రక్తాన్ని దానం చేశారు. ఈ జన్మదిన వేడుకలకు హాజరైన ఎంఎల్‌ఏ బాలునాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలతో, శాలువలతో ఘనంగా సత్కరించారు. తదనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు.చింతపల్లి మండల అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తాన న్నారు. ఎంపిపి కొండూరి భవాని పవన్‌కుమార్, డిసిసి ఉపాధ్యక్షుడు దొంతం సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, ముచ్చర్ల యాదగిరి, వైస్ ఎంపిపి యాదిగౌడ్, అంగిరేకుల గోవర్ధన్, ఎరుకల వెంకటయ్య గౌడ్, కొండల్, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రావు, హరినాయక్, రవినాయక్, నర్సిరెడ్డి, సలీం, వినోద్, నాయకులు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి చేస్తా : బీర్ల

ప్రజాపక్షం/ఆత్మకూర్(యం): ఆత్మకూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పార్టీలకతీతంగా మండల అభివృద్ధి కోసం సహకరించాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం, అనంతరం ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అన్ని గ్యారెంటీలను అమలు పరుస్తామన్నారు. పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులు ప్రజలతో ఉండాలని, వచ్చే అవకాశాలను కూడా వినియోగించుకొని ప్రజాప్రతినిధులుగా నిలవాలని కోరారు. ఎంపీపీ తండా మంగమ్మ శ్రీశైలం గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నరేందర్ గుప్తా, వైస్ ఎంపీపీ భాషబోయిన పద్మ పాపయ్య, పిఎసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, ఎంపీడీవో నిరంజన్ వాలి, డిప్యూటీ తహసిల్దార్ సిపియోద్దీన్, మండల ప్రత్యేక అధికారి రాజారామ్, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/బీబీనగర్ : అధికారుల ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రం, యూత్ బిల్డింగ్, ఓపెన్ జిమ్, మున్నూరు కాపు సంఘం భవనానికి ప్రహరి గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సీయాం పరిశ్రమ యజమాన్యం సహకారంతో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎరుకల సుధాకర్ గౌడ్, జెడ్పిటిసి కోలి ప్రణీతాపింగల్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ వాకిడి గణేష్ రెడ్డి, ఎంపీటీసీలు గోలి నరేందర్ రెడ్డి, టం టం భార్గవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాల కోసమే వన మహోత్సవం

మొక్కలు నాటిన మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ

ప్రజాపక్షం/ఖమ్మం: భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలు తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం ఖమ్మంజిల్లా సత్తుపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో మొక్కలు నాటారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో గొల్లగూడెం అటవీలో 33320 మొక్కలను నాటే కార్యక్రమాన్ని మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అటవీ ఉత్పత్తుల స్టాల్స్‌ను, ఫోటో ప్రదర్శనలు మంత్రులు తిలకించారు. అనంతరం సత్తుపల్లిలోని జలగం వెంగళరావు కళాశాలలో వన మహోత్సవం పై అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మనిషి మనుగడకు పచ్చదనం ఎంతో ముఖ్యమన్నారు. ఆరోగ్యంగా మన పూర్వీకులు వందేళ్లు బతికారంటే అందుకు చెట్లే కారణమన్నారు. మొక్క నుండి మనం చాలా లబ్ది పొందుతున్నామని పచ్చదనం గొప్పతనాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. పచ్చదనం మధ్యకు వెళితే ఒత్తిడికి దూరమై ప్రశాంతత కలుగుతుందని చెట్లను పెంచడం చాలా కష్టమని కాని నరికివేయడం చాలా తేలిక అని పొంగులేటి తెలిపారు. ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి సంరక్షించే బాధ్యతను తీసుకుంటే పచ్చదనం వెల్లివిరుస్తుందని ఆయన తెలిపారు. 20 ఏళ్ల నుండి ఆశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తుందని కులాలు, మతాల మధ్య సమతుల్యతను పాటిస్తూ అభివృద్ధిలో పయనిస్తుందన్నారు. అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కల పెంపకం జరగాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని 14 వేల నర్సరీలలో 22 కోట్ల మొక్కలను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. మొక్కలు నాటి సంరక్షించేందుకు అన్ని శాఖలు తమ తమ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి, అటవీ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అహ్మద్ నదీమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అటవీ సంరక్షణ అధికారి డి. భీమా నాయక్, ఖమ్మంజిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రం సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సన్యాసయ్య, జెడ్పి సిఈవో వినోద్, డిపివో హరికిషన్, ప్రముఖ కవి, ప్రకృతి ప్రేమికుడు జయరాజ్, ఆర్డివో ఎల్. రాజేందర్, మున్సిపల్ ఛైర్మన్ కె. మహేష్ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు కరీంనగర్ జిల్లా వేదిక కావాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ప్రతి ఇంటి నుంచి ఒక ఇన్నోవేటర్ తయారు కావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలకు కరీంనగర్ జిల్లా వేదికగా నిలవాలని సూచించారు. బుధవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై అధికారులతో జిల్లా కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. చదువు వయస్సుతో పనిలేదని, ప్రతి ఒక్కరూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. విద్యాశాఖ అధికారులతో పాటు పలు శాఖల అధికారులు, పాఠశాలలతో పాటు గ్రామాల్లో ఈ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఈవో జనార్ధన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, డిపివో రవీందర్, డీఆర్డీవో శ్రీధర్, ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్‌రావు, ఎన్‌వైకే కో ఆర్డినేటర్ రాంబాబు, ఈడీఎం శ్రీరామ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు

ప్రజాపక్షం/సూర్యాపేట: అర్హులైన ప్రతి గడకు సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పని చేయాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గుజ్జా దీపికయుగేంధర్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్‌లు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ తమ పదవికాలం ముగియడంతో జిల్లాలో జెడ్‌పి నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలను సభ్యులకు వివరించారు. తాము ఐదేళ్ళపాటు చేసిన ప్రజాసేవ ఎంతో సంతృప్తిని ఇచ్చిందని, ఈ అవకాశం కల్పించిన ప్రజలకు, సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ, నీటి పారుదల రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని అభివృద్ధే లక్ష్యంగా మహత్ముడు కన్న కలలను సాకారం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం సభ్యులు ప్రాంతాల్లోని సమస్యను పరిష్కరించాలని సభ దృష్టికి తీసుకోచ్చారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సభ్యులు తమ సమస్యలను లేవనెత్తడంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గుజ్జ దీపికయుగేంధర్ రావులను సభ్యులు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, ఇఈఓ అప్పారావు, వివిధ శాఖల అధికారులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం

✻ సంక్షేమ హాస్టళ్లు ఇల్లులా ఉండాలి : కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ: ప్రభుత్వ హాస్టల్లో ఉంటూ విద్యనభసించే విద్యార్థులు అందరూ దారిద్ర్య రేఖకు దిగువనున్న వారే ఉంటారని ,హాస్టల్ వార్డెన్ గా పనిచేసే అధికారులకు తల్లికున్నంత ఓపిక ఉండాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయావరణలో ఉన్న ఉదయాదిత్య భవన్లో అన్ని సంక్షేమ హాస్టళ్ల వెల్ఫేర్ అధికారులు,కేజీబీవీ పాఠశాలలు, మోడల్ పాఠశాలల ప్రిన్సిపల్స్, సంబంధిత జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. హాస్టల్లను సరైన విధంగా నిర్వహించాలని,హాస్టళ్లలో కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలని, ఎక్కడ తాగునీటి కలుషితం లేకుండా చూసుకోవాలని, అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం వంట సా మాగ్రి సరఫరా చేస్తున్నది ? లేనిది చూడాలని, అన్ని హాస్టళ్లలో నిర్దేశించిన ప్రకారం సీట్లు భర్తీ చేయాలని ,ఎక్కడైనా హాస్టల్ సీట్లకు డిమాండ్ ఎక్కువగా ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. జిల్లాలో హాస్టళ్ళు, కేజీబీవీలు, మోడల్ స్కూల్‌లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనల ప ట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర, సాంఘిక సంక్షేమ,గిరిజన సంక్షేమ శాఖల ఇంచార్జ్ అధికారులు పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కోటేశ్వర రావు, హౌజింగ్ పిడి రాజ్ కుమార్,డిఈఓ బిక్షపతి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి విజయేందర్ రెడ్డి,డిఎంహెచ్ఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు,కెజిబివి పాఠశాలలు,మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

సింగరేణి బొగ్గు గనుల వేలం పాటను నిలిపివేయాలి

5న కలెక్టరేట్ ఎదుట ధర్నా జయప్రదం చేయండి

ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి : రాష్ట్రానికి వరప్రసాదం లాంటి సింగరేణి బొగ్గు గనులను వేలం వేయడాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని, బ్లాకులను సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 5న కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించతలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మిల్కూరి వాసుదేవరెడ్డి, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథ్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో వెంకటస్వామి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ చేయడానికి కుట్రలు పడుతుందని, నూతన చట్టాన్ని తీసుకువచ్చి సింగరేణిని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలని చూస్తోందన్నారు. ఆదానీ, అంబానీల చేతుల్లోనే కేంద్రం నడుస్తోందని, అందులో భాగంగా రాష్ట్రంలో సింగరేణి బొగ్గు గనులను వేలాన్ని వేసేందుకు కేంద్రం పూనుకుందన్నారు. తెలంగాణలో బిజెపికి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపిలు స్పందించకపోవడం తీరని అన్యాయమన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుగులోతు భీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథ్ మాస్‌లైన్ జిల్లా నాయకులు తదితరులున్నారు.

ప్రజలకు సేవ చేస్తేనే రాజకీయ నాయకులకు గుర్తింపు

ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి





ప్రజా పక్షం/మోటకొండూరు: నిత్యం ప్రజలతో ఉంటూ ప్రజా సమస్యలపై స్పందిస్తూ పరిష్కార మార్గాన్ని చూపేవారికి గుర్తింపు ఉంటుందని ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. ఆయన బుధవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా తీర్పును గౌరవి స్తుందని ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటామని తెలిపారు. మండలాన్ని అధికారంలో ఎవరున్నా అభివృద్ధి పరచాలని తెలిపారు. తాజా మాజీ జెడ్పిటిసి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ కరోనా ప్రభావంతో మండలానికి అధిక నిధులు కేటాయించలేదని, వచ్చిన నిధులను అన్ని గ్రామాలకు సమానంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటామని తెలిపారు. అనంతరం పదవీ కాలం ముగిసిన జెడ్పిపిటిసి పల్లా వెంకటరెడ్డి, ఎంపిపి పైల్ల ఇందిర సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ ఇల్లందుల మల్లేష్ గౌడ్, ఎంపిటిసిలు పన్నాల అంజిరెడ్డి, బుగ్గ పద్మ, నెమ్మాని స్వప్న సుబ్రహ్మణ్యం, పూలపల్లి జ్యోతి లక్ష్మి స్వామి, చాడ ప్రతిభారెడ్డిలను మెమెంటో, శాలువాలతో పూలమాలలతో ఎంపిడిఓ ఇందిర, ఎంపిఓ కిషన్, సూపరింటెండెంట్ యశోద, వ్యవ సాయాదికారి సుజాత, ఎపియం సత్యనారాయణ, హార్టికల్చర్ అదికారి నజీమ, వైద్యాదికారి విజయ్, ఎపిఓ అరుణ కుమారి, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది వివిద గ్రామాల మాజీ సర్పంచ్‌లు బిఆర్ఎస్ నేతలు సత్కరించారు.

ఆరుద్ర కార్తి దాటిన అందని రైతుభరోసా

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరేడు నెలలు దాటిన రైతు భరోసా కింద రైతులకు సహాయం అందించడంలో పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రోహిణి కార్తెలో రైతుబంధు పథకం నిధులు విడుదల చేసే వారని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరుద్ర కార్తి దాటిన రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయకపోవడం శోచనీయమని ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం మోట కొండూరు మండల కేంద్రంలోని మహలక్ష్మీ పంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సుదగాని హరిశంకర్ గౌడ్, తాజా మాజీ జెడ్పిటిసి పల్లా వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ పైల్ల ఇందిర సత్యనారాయణ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు భూమండ్ల ఐలయ్య, సింగిరెడ్డి నర్సిరెడ్డి, యండి బురాన్, పన్నాల అంజిరెడ్డి, బాల్ద లింగం, బోట్ల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములమవుదాం

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/భూదాన్‌పోచంపల్లి: నియోజకవర్గ ప్రజా సంక్షేమం ప్రాంతాల అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా ఎలాంటి భేషజాలు లేకుండా కలిసి ప్రతి పనిలో భాగస్వాములమౌదామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా,మండల పరిషత్ ప్రజా ప్రతినిధుల ఐదు సంవత్సరాల పదవీకాలం ముగిసిన సందర్భంగా బుధవారం స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులుగా గెలవడానికి ఎన్నో వ్యయప్రాయాసలకోర్చి ప్రజా జీవితంలో ప్రజలిచ్చిన తీర్పుకు అనుగుణంగా అభివృద్ధికి సంక్షేమానికి తమ వంతుగా కృషిచేసిన వాళ్లందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పిటిసి,వైస్ ఎంపీపీ వివిధ గ్రామాల ఎంపీటీసీలు తమ తమ గ్రామాలలో చేసిన అభివృద్ధిని సంక్షేమాన్ని అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ఐదు సం.ల పదవి కాలాన్ని పూర్తి చేసుకున్న ఎంపీపీ మాదుగుల ప్రభాకర్ రెడ్డి, జడ్పిటిసి కోటపుష్పలత మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, ఎంపీటీసీలు చిల్లర జంగయ్య, శంకరమ్మ, రావుల శ్రీదేవి, బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్, బుచ్చయ్య, సుమలత,యాదగిరి, కో ఆప్షన్ మెంబర్ అఫ్జల్‌లకు ఆయన శాలువాతో ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్ తాసిల్దారు శ్రీకాంత్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ కాందాడి భూపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, కౌన్సిలర్స్ మల్లారెడ్డి గుండు మధు కర్నాటి రవీందర్, పెద్దల చక్రపాణి, ఎమ్మార్వో కార్యాలయ ఉద్యోగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య వ్యవస్థ బలోపేతానికి కృషి

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



ప్రజాపక్షం/తుర్కపల్లి: విద్యా,వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎల్లవేళలా కృషిచేస్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విరమణ అనేది పదవికి మాత్రమే కానీ ప్రజా సంక్షేమానికి కాదు అని అన్నారు. రాష్ట్రంలో రైట్‌టురీ కాల్ వలన ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఐదు సంవత్స రాలలో పాటు కొనసాగకుండా ప్రజలకు ఎలాంటి సేవ చేయని నాయకులను వెంటనే రైట్‌టు రీ కాల్ చేసి ప్రజా ప్రతినిధుల అధికారము నుండి తొలగించే పద్ధతిని రైట్‌టు రీకాల్ అని అంటారన్నారు. ఈ పద్ధతి ద్వారా ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు ఎన్నికల్లో నిలబడే ముందు ప్రజాసేవ చేసే గుణం, లక్షణాలు ఉన్న వారే రాజకీయంలోకి వచ్చి ప్రజలకు సేవ చేస్తారన్నారు. ఎలాంటి సేవ చేయని రాజకీయ నాయకులకు బదులు అధికారులు వ్యవస్థను తీసుకొని వచ్చి అధికారులే పాలన చేసే విధంగా రాబోవు కాలంలో కృషి చేస్తానని అన్నారు. గ్రామాల్లో విద్య, వైద్యానికి పెద్దపీట వేసి ప్రజలను అన్ని విధాలుగా ముందుకు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని అన్నారు. ఎంపీపీ భూక్య సుశీల రవీందర్ నాయక్, జెడ్పి వైస్ చైర్మన్ ధనావత్ బిక్కు నాయక్ ,వైస్ ఎంపీపీ మహదేవుని శ్రీనివాస్, పిఏసిఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జినుకల శ్యాంసుందర్, ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీ బాయి, తహసిల్దార్ దేశ నాయక్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకులు ఇన్నారెడ్డి, ఎంపీటీసీలు బో రెడ్డి వనజ హనుమంత రెడ్డి, పలుగుల నవీన్ కుమార్, గిద్దె కరుణాకర్, మోహన్ బాబు నాయక్ ,కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి ,ప్రతిభ రాజేష్ నాయక్, బోళ్ల కనకమహాలక్ష్మి , కోఆప్షన్ సభ్యుడు మత్‌షరీఫ్,అన్నిశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చిచ్చుపెట్టిన జీవో నెం.58,59 మెడకు రెగ్యులరైజేషన్ ఉచ్చు

పాలకులు పెట్టిన పంచాయితీ

ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి: తమ రాజకీయ స్వలాభం కోసం నాటి పాలకులు అసెంబ్లీ ఎన్నికల ముందు జిల్లా కేంద్రంలో రెగ్యులరైజేషన్ పేరుతో ప్రభుత్వ భూములపంపిణీ నేడు వివాదంగా మారింది. జీవో నెం.58,59లను అడ్డంపెట్టుకోని చేసిన భూ కేటాయింపులు సూర్యాపేట రాజకీయాల్లో చిచ్చుపెట్టింది. ఇందులో జరిగినఅక్రమాలు వెలుగు చూడడంతో రెగ్యూ లరైజేషన్ ఆనాటి అధికారుల మేడకు ఉచ్చు బిగుస్తుంది. సూర్యాపేట జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని చివ్వెంల మండలం కుడకుడ రెవెన్యూ పరిధిలోని 126 సర్వే నెంబర్‌లో ఏఫ్రిల్, మే 2023లో ఆ నాటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులవత్తిడి మేరకు అధికారులు 90 మంది బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, వారి భజనచేసేఅనుకూలమైన మీడియా ప్రతినిధులకు రూ.25 కోట్ల విలువ చేసే ఐదుఎకరాల ప్రభుత్వ భూమిని కట్టబెట్టారు. జీవో నెంబర్ 58,59లను అడ్డం పెట్టుకోని నివాసాలు లేకున్నా అక్రమ పద్దతిలో రెగ్యూలరైజేషన్ చేసి పట్టాలను వారికి అందజేసిన విషయం ఇటీవల వెలుగు చూసింది. ఈ భూ కేటాయింపులు నేడు సూర్యాపేట రాజకీయాల్లో చిచ్చుపెట్టాయి. ఇదే సర్వే నెంబర్‌లో అనేక మంది నిరుపేద లు ఇండ్ల స్థలాల కోసం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గుడిసేలు వేశారు. తమ స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలుచేసిన నాటి పాలకులు మాత్రం కనికరించలేదు. గుడిసేలు వేసుకోని నివాసం ఉంటున్న పేదలను అధికారులతో బలవంతంగా ఖాళీ చేయించారు. దీనికి కారకులైన వామపక్ష పార్టీల నాయకులపై అక్రమ కేసు లు బనాయించి వేదింపులకు గురి చేశారు. చివరికి గుడిసేలకునిప్పంటించారు. విలువైన భూమిని పేదలకు ఇచ్చే ందుకు ఇష్టం లేని ఆ ప్రజాప్రతినిధి తనకు అంటకాగిన బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులకు, కార్యకర్తలకు కట్టబెట్టారు. తన స్వార్థం కోసం మీడియా ప్రతినిధులనుకూ డా రెండుగా చీల్చి చట్టబద్దంగా ఇంటి స్థలాలు ఇప్పించాల్సిన అతను తనకు అనుకూలమైన వారికి మాత్రమే 126 సర్వే నెంబర్‌లో స్థలాలను ఇప్పించారు. నాటి పాలకులుపెట్టిన భూ పంపిణీ పంచాయతీతో బిఆర్ఎస్ నేతల, మీడియా ప్రతినిధులరెండుగా చీలిపోయారు. స్థలాలు దక్కినవారు సంతోష పడుతుండగా రానీవారు నిరాశలోనై వ్యతిరేకవర్గంగా తయారయ్యారు.



నేతల ఇండ్ల చుట్టూ ప్రదక్షిణ

కుడకుడ 126 సర్వే నెంబర్‌లో జీవో నెంబర్ 58, 59 ద్వారా ఇంటి స్థలాల కేటాయింపు వివాదాస్పదంగా మారడంతో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సీరియస్‌గా తీసుకోని విచారణకు అధికారులను ఆదేశించారు. దీంతో తమకు కేటాయించిన స్థలాలను ఏలాగైన కాపాడుకునేందుకు పలువురు నాయకులు, మీడియా ప్రతినిధులు అధికార కాంగ్రెస్ పార్టీ నేతల ఇండ్ల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు.రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ప్రసన్నం చేసుకోని కాకపడుతున్నారు. ఈ స్థలాలు పొందిన బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కా ర్యకర్తలుతో పాటు కొందరు మీడియా ప్రతినిధులు ఆర్థికంగా ఉన్న వారే. 2014 సాధారణ ఎన్నికల ముందు నాటి సూర్యాపేట శాసన సభ్యులుగా పని చేసిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి పాత్రికేయులకు ప్రభుత్వం నుండి ఇంటి స్థలాలను ఇప్పించారు. ఆ నాడు సుమారు 135 మందికిపైగా లబ్ది పొందారు. వారే తిరిగి బిఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో కూడా ఇంటి స్థలాలు పొందడం విస్మయానికి గురి చేస్తుంది. దీనిని కప్పిపుచ్చి దామోదర్ రెడ్డి దగ్గర తిరిగి లబ్దిపొందేందుకు ప్రయత్నిస్తుండగా ఇదే విషయాన్ని ఆయన లేవనేత్తగా ఉమ్మడి రాష్ట్రంలో నాడు తీసుకున్నామని, నేడు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందిగా దానికి దీనికి సంబంధం లేదని చెప్పడం గమనార్హం. మరి కొంత మంది పాత్రికేయులు నాటి పాలకులకు అండగా ఉంటూ ఖాళీగా ప్రభుత్వ స్థలం కనబడితే చాలు కబ్జాచేసి ఒకటి రెండు కాదు అంతకంటే ఎక్కువకూడా అమ్ముకున్న వారు లేకపోలేదు.

అధికారుల మెడకు రెగ్యులరైజేషన్ ఉచ్చు

సర్వే నెంబర్ 126 భూముల రెగ్యూలరైజేషన్ అధికారుల మెడకు చుట్టుకుంటుంది. నాటి అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల వత్తిడి మేరకు అనర్హులకు జీవో నెంబర్ 58,59లను అడ్డం పెట్టుకోని భూ కేటాయింపులు చేసి రెగ్యూలరైజేషన్ చేయడం వారికి శాపంగా మారింది. ఈ భూ కేటాయింపులపై విచారణ జరుగుతుండడంతో ఏం జరుగుతుందోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు.నిబంధనలు ఉల్లంగించిన విషయాన్ని గుర్తు చేసుకోని మదనపడుతున్నారు. దీనంతటికి నాటి పాలకులే కారణమని చెప్పుకోస్తున్నారు.

బొగ్గుగనుల వేలంపాట రద్దు చేయాలి

ప్రజాపక్షం / నర్సంపేట: బొగ్గు గనుల వేలం పాటలను రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడవ సారి అధికారం చేపట్టిన తర్వాత 60 బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడానికి నిర్ణయం తీసుకొని ప్రయివేట్ వ్యక్తులకు బొగ్గు గనులు అప్పజెప్పడానికి చేసే ప్రయత్నం సింగరేణి సంస్థకు తీరని నష్టమని, బొగ్గు గనులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న గని కార్మికుల ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఇలాంటి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించే బిజెపి విధానంను ఎండగట్టేందుకు కార్మికులందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని వామపక్ష పార్టీలు ముక్త కంఠంతో ఖండిస్తూఉన్న ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని, బొగ్గు గనుల వేలం ఆపేంతవరకు తీవ్రమైన పోరాటాలు సాగిస్తామని ఎన్నికలకు ముందు బొగ్గు గనులను ప్రయివేట్ పరం చేయమని తెలంగాణకు గుండెకాయ లాంటి సింగరేణి సంస్థను కాపాడుకుంటాం మని మయా మాటలు చెప్పిన బిజెపి నాయకులు ఈ రోజు పల్లెతూ మాట కూడా మాట్లాడకుండా మౌనంగా ఉండడం సిగ్గుచెటని ఈ నెల 5వ తేదిన రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహించి నిరసన వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు.

ఆర్బిట్ విద్యార్థి అద్భుత ప్రతిభ

ప్రజాపక్షం/హసన్‌పర్తి: మండలంలోని ఎల్లాపూర్ శివారులోని ఆర్బిట్ ఈ టెక్నో పాఠశాల విద్యార్థిని ఇ. సింధూరరెడ్డి పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించింది. కాగా మళ్లీ రీ వెరిఫికేషన్ కోసం అప్లై చేసుకోగా అందులో 10/10 జీపీఏ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంటు సీహెచ్ భగవాన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 10/10 జీపీఏ సాధించిన సింధూరరెడ్డిని పాఠశాల డైరెక్టర్ హరికరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

6 నుంచి భద్రకాళీ నవరాత్రోత్సవాలు

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : నగరంలోని చారిత్రక ప్రసిద్ధి గాంచిన భద్రకాళి దేవాలయంలో ఈనెల 6 నుంచి 21 తేదీ వరకు శ్రీ భద్రకాళి శాకాంభరి నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ ప్రధాన అర్చకుడు శేషు, ఈఓ శేషు భారతి తెలిపారు. బుధవారం దేవాయలంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మొదటగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు శేష కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు అమ్మవారికి అలంకరణ, దేవాయలంలో ఏర్పాట్లపై మాట్లాడారు. ఈ సమావేశంలో దేవాలయ సూపరింటెండెంట్ విజయ్, కొర్పరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఏడుపాయల'ఇఒగా కృష్ణప్రసాద్

ప్రజాపక్షం/పాపన్నపేట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల ఆలయ ఈవో గా దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కృష్ణ ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఏడుపాయల ఈవోగా పనిచేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వినోద్ రెడ్డి వేములవాడ రాజరాజేశ్వరి ఆలయానికి బదిలీ పై వెళ్లారు. హైదరాబాద్ లోని దేవాదాయశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ కమిషనర్ ను ఏడుపాయల ఈవోగా బదిలీ చేశారు. దీనితో ఆయన బుధవారం నాడు ఏడుపాయల వన దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఈవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఆలయ సిబ్బంది శ్రీనివాస్,మధుసూదన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, బ్రహ్మం, వారిని సన్మానించారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటండి

ప్రజాపక్షం/రాయపర్తి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావి తరాలకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాగన్న గూడెం గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటారు. అనంతరం మన ఊరు మన ఎమ్మెల్యే పల్లె బాట కార్యక్రమంలో రాగన్న గూడెం గ్రామాన్ని సందర్శించి ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో మీ ముందుకు వస్తున్నని తెలిపారు. గ్రామాలలో తిరుగుతూ స్వయంగా వారి సమస్యలు విని పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. స్పెషల్ ఆఫీసర్ గ్రామ తహశీల్దార్ ఏం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోథ్ హమ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్దన్ రెడ్డి, సుధాల దేవేందర్, సరికొండా కృష్ణారెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, ఈ రెడ్డి నర్సింహ రెడ్డి, వివిధ శాఖా ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

ప్రజాపక్షం/రాయపర్తి: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని జిల్లా కలెక్టర్ శ్రీ సత్య శారదా దేవి అన్నారు. బుధవారం మండలంలోని పెరికేడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఆమె తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని అన్నారు. విద్యార్థుల ఆదర్శ శాతాన్ని పెంచాలని అన్నారు. జెడ్‌పిహెచ్ఎస్ పెరికవేడు పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పర్యవేక్షించారు. పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. డీఈవో వాసంతి, మండల నోడల్ ఆఫీసర్ స్పూజన్ తేజ, తహసిల్దార్ శ్రీనివాస్, మండల విద్యాధికారి శనోముల రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్‌గా సంతోష్

ప్రజాపక్షం/ఆత్మకూరు : ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.సంతోష్ బుధ వారంబాధ్యతలు స్వీకరించారు. వరంగల్ సిపి అంబర్ కిషోర్ జా తొమ్మిది మంది సీఐలను కమిషనరేట్ పరిధిలో బదిలీ చేయగా సంతోష్ ఆత్మకూరుకు బదిలీ పై వచ్చారు. ఆత్మకూరు సీఐగా పని చేసిన క్రాంతికుమార్ పరకాల టౌన్‌కు బదిలీపై వెళ్లారు.సీఐ మాట్లాడుతూ మండలంలో శాంతి బద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

రాజీయే రాజమార్గం

ప్రజాపక్షం/నర్సాపూర్: రాజీయే రాజమార్గమని నర్సాపూర్ మున్సిప్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కే అనిత అన్నారు. బుధవారం నర్సాపూర్ కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. కక్షిదారుల మధ్య రాజి కుదిరించి కేసులను కొట్టివేశారు. జడ్జి అనిత మాట్లాడుతూ కుటుంబ తగాదాల్లో కక్ష సాధింపులతో పట్టింపులకు పోకుండా సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.భార్యాభర్తలు, కుటుంబ సభ్యులు తరచు గొడవలు పడుతూ కేసుల్లో ఇరుక్కొని కోర్టుచుట్టూ తిరుగుతూ సమయాన్ని వృధాచేసుకోవద్దన్నారు. న్యాయవాది స్వరూపరాణి సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల హాజరు శాతంపై శ్రద్ధ

ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/మల్హర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో డిగ్రీ, పీజీ, బిఈడి, టిటిసి చదివిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నారని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం మల్హర్ రావు మండలం వల్లెంకుంట గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 లక్షల రూపాయలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన జరిగేందుకు ప్రభుత్వం పాఠశాలల మరమ్మతుల కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. 36 మంది విద్యార్థులు ఉన్న బడిలో 8 మంది ఉపాధ్యాయులున్నారని బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల నమోదుకు చేపట్టిన చర్యలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో 48మంది విద్యార్థులున్నారని మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్ మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులతో ఫోటోలు దిగి బాగా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరగా స్పందించిన మంత్రి అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారంగా 317 రాష్ట్రపతి ఉత్తర్వులు తయారు చేశారన్నారు. ఉద్యోగుల సమస్యలను గుర్తించిన ప్రభుత్వం సవరణ చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సవరణకు రాష్ట్ర ప్రభు త్వం న్యాయవాదులను సంప్రదించి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే జడ్పి సీఈవో విజయలక్ష్మి, డిఆర్డిఓ నరేష్, పంచాయతీరాజ్ ఈఈ దిలీప్, మండల ప్రత్యేక అధికారి అవినాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, ఐత ప్రకాష్‌రెడ్డి, జడ్పీటీసీ ఐత కోమల రాజిరెడ్డి, ఎంపీపీ చింతలపల్లి మలహార్ రావు,మండల అధ్యక్షులు బడితల రాజయ్య, పిఏసిఎస్ చైర్మన్ ఇప్ప మొండి,ప్రదానోపాధ్యాయుడు సుదర్శన్ పాల్గొన్నారు.

కొయ్యూరు నుండి రుద్రారం వరకు రోడ్డు వెడల్పు పనులు

మల్హర్ మండలంలోని బుధవారం రహదారులు మరియు భవనముల శాఖ ఆధ్వర్యంలో రుద్రారం నుండి కొయ్యూరు కి.మీ. 0/0 నుండి 13/0 వరకు 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు వెడల్పు పనులకు శంఖుస్థాపన చేశారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రమాదాలు నివారణకు ట్రాఫిక్ ఆంక్షలు పాటించే విధంగా డివైడర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్స్. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక ఆదికారి అవినాష్, జడ్పి సీఈవో విజయలక్ష్మి, డిఆర్డీఓ నరేష్.దండు రమేష్, ఐత ప్రకాష్ రెడ్డి, జడ్పిటిసి అయిత కోమల రాజిరెడ్డి,మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, అధికారులు, సిబ్బంది నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం ఉక్కు కోసం పోరాడుతాం

సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారధి

ప్రజాపక్షం/మహబూబాద్ ప్రతినిధి: బయ్యారంలో ఉక్కు పరిశ్రమ సాధనకై చేసినటువంటి ఉద్యమంలో భాగంగాబుధవారం సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి, జేఏసీ నేతలు శంతన్ రామ రాజు, గుంజే హనుమంతు, సిపిఐనేత మిర్యాల మల్లి కార్జున్ కోర్టుకు హాజరైనారు.సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మా ట్లాడుతూ విభజన చట్టంలో పొందుపరిచిన బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఇంతవరకు పదేళ్ల పాలనలో బిజెపిప్రభుత్వంప్రారంభించ లేదు అన్నారు.గతపదేండ్ల టిఆర్ఎస్ పాలనలో కూడా నాటి ముఖ్యమంత్రి ఒకసారి కూడా బయ్యారం ఉక్కు పరిశ్రమకోసంమాట్లాడలేదన్నారు. అటు బిజెపి రెండు కేంద్రంలో రాష్ట్రంలో ఆనాడు అధికారంలో ఉండి ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పుడు తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కోసం పోరాడాలన్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వంపై అధికారంలోకి దగ్గరగా వచ్చినటువంటి ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలన్నీ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ప్రారంభిస్తే ఈ ప్రాంత నిరుద్యోగ సమస్య పోతుందన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఉద్యమాలు చేశామన్నారు. రాబోవు కాలం లో బయ్యారంలో ఉక్కు పరిశ్రమకై తెలంగాణ వ్యాప్తం గా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. వెంటనే బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం ఉద్యమించిన ఉద్యమకారులందరి పైన పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని అన్నారు.

'నీట్'పై స్పందించకపోవడం బాధాకరం

ప్రజాపక్షం / నర్సంపేట: దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవం తం చేయాలని ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ,ఏబిఎస్ఎఫ్‌సం ఘాల నాయకులు దిడ్డి పార్థసారది, బొట్ల నరేష్, గుర్రం అజయ్, ప్రశాంత్ డిమాండ్ చేశారు. దిడ్డి పార్థసారధి మాట్లాడుతూ అసమర్ధ ఎన్డీఏ ను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని దేశ వ్యాప్తంగా నీట్ పరీక్ష పేపర్ ఆందోళన జరుగుతున్నప్పటికి కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇటీవల నెట్ నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని, పీహెచ్‌డీ అడ్మిషన్ కోసం ఇటీవల అమోదించిన నైట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. టీఐఎస్ఎస్ ముంబై ఐఐటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి నాయకులపై అక్రమ కేసుల్లో, నిర్బంధాలు, యూనివర్సిటీ వరకు విద్యార్థి నాయకులపై అక్రమ కేసుల్లో నిర్బంధాలు యూనివర్సిటీలో స్వేచ్ఛ వ్యక్తీకరణ ప్రజా అణిచివేత విధానాలు మానుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణకర్, విష్ణు, స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

కలెక్టర్ సత్య శారద

ప్రజాపక్షం / చెన్నారావుపేట : ప్రభుత్వ పాఠశాలలో విధ్యార్థులకు ప్రవేటుకు ధీటుగా నాణ్యమైన విధ్యానందించాలనివరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా అన్నారు . బుధవారం చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో ప్రభుత్వ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అమ ఆదర్శ పాఠశాల కమిటి ఆధ్వర్యంలో గుర్తించి చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు .కలెక్టర్ మాట్లాడుతూ పనులను సకాలంలో పూర్తి చేయాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.పంచాయతిసిబ్బందితోరోజుపాఠశాల ప్రాంగణం శుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపిడిఓ ఆదేశించారు . అనంతరం మండలంలోని తిమ్మరాయని పహాడ్ గ్రామంలో సర్వేనంబర్ 70లో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజురు చేయాలని ప్రజావాణిలో రైతులు విన్నవించుకున్నారు . గ్రామ సందర్శనకు వచ్చి సమస్యను పరిష్కరిస్తానని చెప్పి గ్రామంలో సర్వే నంబర్‌కు వెళ్లి చూడగా అసైన్డ్ పట్టాలు ఇవ్వాడానికి వీలు లేదని ఈ భూమి ఫారెస్టుకు సంబందించిందని చెప్పారు. కాగా రెవిన్యూ ,అటవీ శాఖ అధికారులతో మాట్లాడి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు వర్తించే విధంగా చర్యలు చేపడుతనని తెలిపారు. భూమి దున్నుకుంటున్న రైతులు వారి వద్ద ఉన్న ఆధారాల వివరాల నివేధిక వారం రోజుల్లో ఇవ్వాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు .

ధరణి వేగవంతంగా పరిష్కరించాలి

ధరణి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని చెన్నారావుపేట తహసిల్థార్ ఫణికుమార్‌ను ఆదేశించారు. బుదవారం చెన్నారావుపేట మండలంలోని తహసిల్థార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి ధరఖాస్తులను పరిశీలించారు .కలెక్టర్ సత్యశారధా మాట్లాడుతూ ధరణి రికార్డులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తు పారదర్శకతతో క్షుణంగా పరిశీలించిన తర్వాతే ధరణిదరఖాస్తులనుపూర్తిచేయాలని,పెండింగ్ లేకుండా వేగంగా పనులు చేయాలన్నారు. జిల్లా విధ్యాశాఖ అధికారి వాసంతి ,నర్సంపేట అర్డిఓ క్రిష్ణవేణి ,ఎంపిడిఓ ప్రసాద్ ,తహసిల్థార్ ఫణికుమార్ పాల్గోన్నారు .

అక్రమ నిర్మాణాల పనులు నిలిపివేత

ప్రజాపక్షం/రఘునాథపల్లి: మండల కేంద్రంలోని హన్మకొండ హైదరాబాద్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న అక్షయ హోటల్ ఎదురుగా ఓ రియల్టర్ తన వ్యవసాయ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారన్న సమాచారం తహశిల్దార్‌కు అందింది. బుధవారం తహశిల్దార్ పురం యుగెందర్ తన రెవెన్యూ సిబ్బందితో కలిసి నిర్మాణాల ప్రాంతానికి చేరుకున్నారు. ఎలాంటి గామపంచాయితి పర్మిషన్ కానీ, నాలా కన్వర్షన్ కానీ లేకుండా అక్రమ నిర్మాణం చేపడుతున్న స్థలాన్ని పరిశీలించారు. అక్కడ చేపడుతున్న నిర్మాణానికి పర్మిషన్ లేదని తెలుపడంతో వెంటనే అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని తహశిల్దార్ ఆదేశించారు. అన్ని పర్మిషన్లు తీసుకున్న తర్వాతే నిర్మాణాలు మొదలుపెట్టాలని హెచ్చరించారు. నిర్మాణాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని అన్నారు. తనిఖీలలో ఆర్ఐ బలరాం, గ్రామ పంచాయతి కార్యదర్శి కవిత, గ్రామ పంచాయతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రజాపక్షం/జఫర్‌గడ్: అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎవరైనా అవినీతికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణి కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై మండలానికి చెందిన 101 మంది లబ్దిదారులకు రూ.1,01,11,716 విలువ గల చెక్కులను, అలాగే ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి లబ్దిదారులకు రూ.1లక్ష37 వేల విలువ గల చెక్కులను పంపిణి చేశారు. అనంతరం మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పదవి కాలం ముగుస్తున్న ఎంపీటీసీలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తుందన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు.ఆగస్టు 15లోపు రుణమాఫీ చేయడం జరుగుతుదన్నారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే ప్రధాన కర్తవ్యమని నీతి, నిజాయితీగా పనిచేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. అధికారులు కూడా నిబద్ధతతో పని చేయాలని సూచించారు. తాను తప్పు చేయనని, తప్పు చేయనివ్వనని స్పష్టం చేశారు. అధికారులు. ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. మండలంలో చాలా రోడ్లు అధ్వానంగా ఉన్నాయని త్వరలోనే రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. జఫర్‌గడ్ నుండి సూరారం రోడ్డుతోపాటు మండల కేంద్రంలో రూ.3కోట్లతో నూతన మండల కార్యాలయ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ బేబి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, తహశిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో సుమన్, ప్రజాప్రతినిధులు, అధికారులున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం.. అధికారులకు నోటీసులు

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : జనగామ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ నోటీసులు జారీ చేశారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి ప్రజలు పలుసమస్యలపై అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరు అధికారులు సెల్ పోన్లు చూడడం, పోన్ మాట్లాడుతూ బయటకు వెళ్లడం వంటివి జరుగుతున్నాయి. కలెక్టర్ దృష్టికి వెళ్లడమే గాక ఆయన స్వయంగా పరిశీలించారు. అగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం పలువురు అధికారులకు నోటీసులు జారీ చేశారు. ప్రజావాణి సమస్యలపై నిర్లక్ష్యంగావ వ్యవహరించడం సరియైంది కాదన్నారు. అలాంటి వారు ఏ శాఖలో ఉన్నా చర్యలు తప్పవన్నారు.

పాఠశాల కోసం భూ పరిశీలన

జనగామజిల్లా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం కోసం ప్రభుత్వం నుండి ఆదేశాలు రావడంతో బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శివునుపల్లి శివారు సర్వే నెంబర్ 46, తలకాయల గుట్ట సర్వే నెంబర్ 979లలో గల ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు అనుకూలంగా ఉంటాయా..లేదా అన్న విషయాన్ని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరంమండల కేంద్రంలోని జిల్లా పరిషత్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. నాణ్యమైన పౌష్టిక ఆహారం అందజేయాలని, నాణ్యమైన గుడ్లు పరషరా చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువును పరిశీలించారు. నిరుపేద విద్యార్థులు, గర్భిణిలకు పౌష్టిక ఆహారం అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదవే విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణతతో పాటు 10జిపిఎ వచ్చేలా చదవాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. ఆర్‌డిఓ వెంకన్న, ఆర్ఐ అర్జున్, రెవెన్యూ సిబ్బంది,ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు బస్సుల కోసం వినతి

ప్రజాపక్షం / నర్సంపేట: నర్సంపేట డివిజన్ పరిదిలోని ఉన్న అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎఫ్‌డిఎస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిజన్ను రమేష్ డిమాండ్ చేశారు. నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఏఐఎఫ్‌డిఎస్ నాయకులువినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని పలు గ్రామాలకు పల్లె వెలుగు బస్సు బంద్ చేయడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నల్లబెలి మండలంలోని ముచ్చింపుల, రంగాపురం, నందిగామ, రేలకుంట, ధర్మరావుపల్లి, లెంకాలపల్లి, బుచ్చిరెడ్డిపల్లి, చెన్నారావుపేట మండలంలోని సూర్యాపేటతండా, గొల్లబామతండా, గొల్లపల్లి, శంకర్‌తండా, జల్లి తండాలకు, నెక్కొండ మండలంలోని సూరిపల్లి, చిన్న కోర్పోలు, పంతులు తండా, లింగగిరి శివారు తండా, కాలినడకన వస్తూ పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. నాయకులు మార్త నాగరాజు, రాకేష్, సాంబారి అజయ్, అజిత్, విజయ్, గౌతమ్, రాకేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

ప్రజాపక్షం/దుబ్బాక: ప్రజా సేవతోనే ప్రజా ప్రతినిధుల జీవితాలు ధన్యం అవుతాయని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల ప్రాదేశిక సభ్యుల పదవీకాలం ముగిసిన సందర్భంగా దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులకు ఆత్మీయ సన్మాన సమ్మేళనం ను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పదవీ కాలంలో చేసిన సేవలతో ప్రజాప్రతినిధులు ప్రజల గుండెల్లో చిరకాలం ఉంటారన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ప్రతి పల్లె పల్లెనా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తు చేశారు. పదవితో సంబంధం లేకుండా ప్రజల మధ్య సేవచేస్తూ గడపాలని సూచించారు. ప్రజలకు సేవ చేసిన ప్రభాకర్‌రెడ్డి గెలుపుకు కృషి చేసిన అందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలల కాలంలో గ్రామ పంచాయతీలకు నయా పైసా కూడా ఇవ్వలేదని, పారిశుధ్య కార్మికులకు ఏడు నెలల నుండి జీతాలు రాలేదని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సెన్, జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ పుష్పలతకిషన్‌రెడ్డి, ఆయా మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

ముగిసిన జెడ్‌పిటిసి, ఎంపిటిసి పదవీకాలం

కొనసాగనున్న స్పెషల్ ఆఫీసర్ల పాలన

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లిప్రతినిధి : ప్రభుత్వం మండలాలు, గ్రామాల అభివృద్ధి తో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా గత ఐదు సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధిగా ఎన్నిక కాబడి సేవ చేస్తున్న ప్రజా ప్రతినిధులైన జెడ్పిటిసి, ఎంపీపీ పదవికాలం రాష్ట్రవ్యాప్తంగా నేటితో ముగిసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 11మంది జెడ్పిటిసిలు, 11 మంది ఎంపీపీల పదవి కాలం ముగిసింది. జిల్లాలోని 11 మండలాలకు స్పెషల్ ఆఫీసర్లను ప్రభుత్వం నియమించనుంది. ఇకపై ప్రజా సమస్యలు స్పెషల్ ఆఫీసర్లు పాలనను కొనసాగించనున్నారు. మళ్లీ ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించేంతవరకు స్పెషల్ ఆఫీసర్ల ఆధీనంలో ఉండనున్నాయి. గత ఐదు సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరిగింది. అందులో అనుకున్న స్థాయిలో కాకపోయినా ఎంతో మండలానికి సేవ చేసి మంచి పేరు సంపాదించాలని లక్ష్యంతో కొంతమంది నాయకులు పని చేశారు. ఇంకా కొంత ప్రజలకు సేవ చేయాలని ఆశయం కలిగిన నాయకులు మళ్లీ వచ్చే ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

నేడుజెడ్పిటిసిలకు సన్మానం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా జెడ్పి ప్రత్యేక సమావేశం నేడు జిల్లా కేంద్రంలోని జెడ్పి సమావేశ హాల్లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో విజయలక్ష్మి తెలిపారు. జిల్లాలోని జెడ్పిటిసిలు హాజరు కావాల్సిందిగా కోరారు. జిల్లాలో ఐదు సంవత్సరాలుగా పనిచేసే పదవి కాలం ముగిసినందున జెడ్పిటిసి లకు వీడ్కోలు సమావేశం నిర్వహించనున్నట్లు విజయలక్ష్మి తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న జెడ్పిటిసిలు అందరూ సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

మొక్కల సంరక్షణకు ప్రణాళికా బద్ధంగా చర్యలు

మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : వన మహోత్సవం కార్యక్రమం క్రింద జిల్లాలో నాటిన ప్రతి మొక్క సంరక్షణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని, మొక్కల పెంపకం, సంరక్షణలో నాణ్యత పెరగాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పెద్ద కల్వలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, మునిసిపల్ చైర్ పర్సన్ మమతా రెడ్డిలతో కలిసి మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంప కం, పచ్చదనం ప్రాముఖ్యత విద్యార్థి దశ నుంచే పిల్లలకు తెలియాలనే ఉద్దేశ్యంతో కళాశాల వద్ద వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని అధికారులు జవాబుదారీతనంతో పూర్తి చేయాలని మొక్కల పెంపకం చాలా మంచి ఆలోచన అని, దీనివల్ల అనేక లాభాలు ఉంటాయని తెలిపారు. ఆలోచన బాగా ఉన్న ఆచరణ సరిగ్గా లేకపోతే ఆశించిన ఫలితాలు దక్కవని, పటిష్ట కార్యాచరణతో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. పెద్దపల్లి, గోదావరిఖని ప్రాంతాల్లో అవసరమైన మేర మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ప్రభుత్వం నాటుతున్న మొక్కలు, ఇండ్లకు పంపిణీ చేస్తున్న మొక్కల ఆడిట్ నిర్వహించాలని అన్నారు. అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం జిల్లాలో 27 లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించామని, వంద శాతం నాటిన మొక్కల సంరక్షణకు ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ మంత్రి చేతుల మీదుగా వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభించు కోవడం చాలా సంతోషకరమని అన్నారు. అనంతరం పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమతా రెడ్డి మాట్లాడుతూ చెట్ల సంరక్షణ ద్వారా భూ సంరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఏ.సి.పి. జి. క్రిష్ణ, పెద్దపల్లి మున్సిపల్ కమీషనర్ వెంకటేష్, జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య, డి.ఆర్.డి.ఓ. రవీందర్, జెడ్పీ సి.ఈ.ఓ. నరేందర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జెడ్పిటిసి రామ్మూర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు,తదితరులు ఉన్నారు.

5న వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల నిరసన

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : 5న వామపక్ష పార్టీల కార్మిక సంఘాల నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నామని వామపక్ష పార్టీల నాయకులు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ బాబు అన్నారు. బుధవారం ఎస్ఆర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ బొగ్గు గనులను ప్రైవేటీకరించవద్దని, సింగరేణి ఆధీనంలోనే ఉంచాలని, నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా 5న శుక్రవారం ఉదయం 11 గంటలకు నిజామాబాద్ ధర్నాచౌక్‌లో వామపక్ష పార్టీల, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. ప్రజలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పాపయ్య, జిల్లా కార్యదర్శి కృష్ణ, శీను, రాజశేఖర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

సింగరేణికి బొగ్గు గనుల కేటాయింపు కోసం ధర్నా

ప్రజాపక్షం/మందమర్రి : తెలంగాణలోని బొగ్గు బ్లాకులను వేలం ద్వార ప్రైవేట్ సంస్థలకు కేటాయించడాన్ని నిరసిస్తూ ఈ నెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యాక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎఐటియూసి నాయకులు సలేంద్ర సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని, సింగరేణి పరిరక్షణనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 8 నుండి 13 వరకు తలపెట్టే నిరాహారదీక్ష లో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

5 నుండి 9వ తరగతి వరకు గురుకులాల్లో బదిలీలు

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 సంవత్సరం 5వ తరగతి నుండి 9వ తరగతులలో చదువుతున్న విద్యార్థులు పాఠశాల బదిలీ కోరుకునే వారు ఆన్‌లైన్‌లో 100లు చెల్లించి వెబ్‌సైట్ అంతర్జాలం ద్వారా 27.06.2024 నుండి 31.07.2024 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రాంతీయ సమన్వయాధికారిణి అలివేలు తెలిపారు.

సకాలంలో నిర్దేశిత రుణ లక్ష్యాలు పూర్తి

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : బ్యాంకర్లు నిర్దేశిత రుణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అ న్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరే ట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, బ్యాంకర్ల తో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రుణా లక్ష్యాలను బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసే సకాలంలో సాధించేలా కృషి చేయాలని తెలిపారు. బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాల ప్రకారం 100 శాతం రు ణాలను రైతులు, మహిళా సంఘాలు, అర్హులైన లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. లబ్ధిదారులు పొందిన రుణాలు క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకునే విధంగా బ్యాంకర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ పంట రుణాల ను మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అర్హత కలిగిన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరాని కి గాను పంట రుణాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రుణాలు, ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు సంబంధించి రుణ సదుపాయం కల్పించి అభివృద్ధి దిశగా కృషి చే యడం జరుగుతుందని, బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి సాయి తేజ రెడ్డి, నాబార్డ్ డిడిఎం. వీరభద్రుడు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా అధికారు లు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

సింగరేణికి శ్రావణపల్లి బొగ్గు బ్లాక్

ఎఐటియుసి డిమాండ్

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి : తెలంగాణలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును సింగరేణికి అప్పగించాలని ఎఐటియుసి గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, బ్రాంచ్ ఉపాధ్యక్షులు భయ్యా మొగిలిలు అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓపెన్ కాస్ట్‌లోని బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తలపెట్టిన బొగ్గు బ్లాకుల కేటాయింపుకు వేలాలను రద్దు చేయాలని, రాష్ట్రంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్లులు సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. మైన్స్ మినరల్ డెవలప్మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు బావులు సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ సింగరేణికి బొగ్గు బ్లాక్‌ల సాధనకై ఈనెల 5వ తేదీ నుండి 18 వరకు ఉద్యమించాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ నెల 5న కొమరం భీం జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున ధర్నాలు చేయాలని, ఈనెల 8, 9వ తేదీలలో గోలేటి జిఎం ఆఫీస్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సముద్రాల ఆనంద్, మీనా చంద్రశేఖర్, శేష సేనరావు, కిరణ్ బాబు, దేవరకొండ దివాకర్, కైరిగూడ సహాయ కార్యదర్శి ఎండి షాకిల్, కోటి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

డిఎస్‌పి విజయ భాస్కర్

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ పట్టణంలో బుధవారం రోజు స్థానిక దీక్ష కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్పీ విజయ భాస్కర్ మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలని తెలిపారు.సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలు పెరుగుతున్నాయి అన్నారు. ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారన్నారు. ఆన్లైన్ ద్వారా లావాదేవీ నడిపేవారు కొత్త వ్యక్తుల మాటల నమ్మరాదని, తెలియని మెసేజ్ లాపై క్లిక్ చేయరాదని, సైబార్ నేరగాళ్లు మాయ మాటలు చెబుతూ బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని, ఇతరత్రా ఆశ చూపి ఆన్లైన్ ద్వారా డబ్బులకు ఎర వేస్తారని, అటువంటి వ్యక్తులు పంపే మెసేజ్లకు స్పందించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటరమణ,కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకట్ రెడ్డి,కరస్పాండెంట్ ప్రమోద్ రావు,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు ఉచితంగా కోడెల పంపిణీ

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : రాజన్న గోశాలలోని కోడెలను అర్హులైన రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తిప్పాపూర్ వేములవాడ దేవస్థానం గోశాల నుంచి రైతులకు ఉచితంగా కోడెలు, ఆవుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ వేములవాడ రాజన్న గోశాలలో 400 గోవుల సామర్థం ఉందని, కానీ ప్రస్తుతం అందులో 1500 పైగా కోడెలు, గోవులు ఉండటం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటిని అర్హులైన పేద రైతులకు, ఇతర గోశాలలకు ఉచితంగా పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరువతో అర్హులైన పేద రైతులకు కోడెలను అందిస్తున్నామని అన్నారు. గోశాలలో కోడెల సంరక్షణకు వసతులు కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, గోశాలలో అదనపు షెడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని అన్నారు. గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలు, ఆవులు ఇతరత్రా పనులకు వినియోగించుకోకుండా అర్హులకు మాత్రమే అందేలా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి వారి ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించడం జరిగిందని అన్నారు. వ్యవసాయం చేసే పేద రైతులకు 2 కోడెలను ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. కోడెలను పొందిన రైతులు సొంత వ్యవసాయానికి మాత్రమే వినియోగించుకోవాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వీటి వినియోగం పై పకడ్బందీ అంగీకార పత్రం రూపొందించామని అన్నారు. అర్హులైన రైతులకు ఉచితంగా కోడల పంపిణీ కార్యక్రమం ప్రతి మాసం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అన్నారు. వేములవాడ ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ఆలయ ఈవో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపించాలని విప్ సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ దేవస్థానంలోని కోడెలను పేద రైతులకు ఉచితంగా పంపిణీ చేయడానికి ప్రభుత్వాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఒప్పించారని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరించి, అర్హులైన రైతులను ప్రత్యేక కమిటీ ద్వారా క్షేత్రస్థాయిలో విచారించి ఎంపిక చేసామని అన్నారు. దేవస్థానం గోశాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కోటి 11 లక్షల రూపాయలను మంజూరు చేసిందని, వీటితో గోశాలలో కోడలకు అదనపు షెడ్ల నిర్మాణం, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టామని, వీటిని ద్వేతగా తిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అనంతరం రైతులకు కోడెలను ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతి నిధులు, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ అర్బన్, నిర్మల్ రూరల్, దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాల కళ్యాణ లక్ష్మి , షాదీ ముభారక్ లబ్ధిదారులకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ రత్నకళ్యాణి, ఎంఆర్‌ఓలు, ఎంపిటిసి ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ వీరేష్ కుమార్, సత్యం చంద్రకాంత్, దానే నరసయ్య, జమాల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
సోన్‌లో... మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంపీపీ మానస హరీష్ రెడ్డి, సరికెల గంగన్న, మార గంగారెడ్డి, అశోక్‌తో పాటు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయంగా మారాయని, సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించాలని ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ అన్నారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ పిలుపు మేరకు కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్, కిసాన్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా బలోపేతానికి కృషి చేయాలని, ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థలను అరికట్టాలని, పేద మధ్యతరగతి విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలల కంటే మరింతగా ఆధునీకరించాలని, అదే విధంగా విద్యకు బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకానికి మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, అభినయ్, సాయికుమార్, అనిరుధ్, తదితరులున్నారు.

రైతు భరోసాపై సలహాలు సేకరణ

ప్రజాపక్షం/బాన్సువాడ : రైతు భరోసా పథకం అమలుపై రైతుల సలహాలు సూచనలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బాన్సువాడ మండలంలోని బాన్సువాడ, బోర్లం, దేశాయిపేట్ సహకార సంఘాల్లో బుధవారం అధికారులు ప్రత్యేక మహాజన సభలు నిర్వహిస్తూ రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్య లక్ష్మి మాట్లాడుతూ రైతు భరోసా పథకంపై రైతులు తమ అభిప్రాయాలను తెలుపవచ్చని రైతులనుంచి సేకరించిన అభిప్రాయ సలహాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి నివేదిక అందించనున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు యేర్వాల కృష్ణారెడ్డి, సంగ్రం నాయక్, అంబర్ సింగ్, డివిజన్ సహాయ అధికారి అనిల్ కుమార్, కరుణా కర్ రెడ్డి, నర్సింలు, సాయినాథ్, ఏఓ సుధాకర్, ఏఈవోలు గోపాల్, రాణి, రాజేశ్, సొసైటీ డైరెక్టర్లు రెంజర్ల సాయిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ అధికారులు

కౌశిక్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు
ప్రతిగా జెడ్‌పి సిఇఒపై ఎమ్మెల్యే ఫిర్యాదు
కెటిఆర్, హరీష్‌రావు ఆగ్రహం

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ జిల్లా హుజురాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జరిగిన రచ్చ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యింది. హుజురాబాద్ నియోజకవర్గంలో సమీక్ష సమావేశానికి హాజరైన ఎంఇఒలకు మెమోలు జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ డిఇఒను సస్పెండ్ చేయాలని ఆయనతో పాటు సభ్యులు పోడియం ఎదుట బైఠాయించి ఆందోళన చేయడంతో కలెక్టర్ వెళ్లిపోయారు. మధ్యాహ్నం సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ పదవీ బాధ్యతలు పూర్తి చేసుకున్న జడ్పిటిసిలు, ఎంపిపిలకు వీడ్కోలు సందర్భంగా సత్కరించారు. అప్పటి వరకు వేడిగా ఉన్న సభ శాంతించడం విశేషం. అయితే ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు కలెక్టర్‌ను అడ్డుకుని అధికారుల విధులకు ఆటంకం కలిగించారన్న అభియోగంపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీంతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బుధవారం తన విధులకు ఆటంకం కలిగించారంటూ జెడ్‌పి సిఇఒ శ్రీనివాస్‌పై కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. జెడ్‌పి సిఇఒ, డిఇ ఒపై ప్రివిలేజ్ మూవ్ చేస్తానని స్పష్టం చేశారు. మరో వైపు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బిసి జెడ్‌పిటిసి గీకురు రవీందర్‌పై దుర్భాషలాడినందుకు బిసి సంఘాలు మండిపడుతున్నాయి. ఫలితంగా జిల్లాలో రాజకీయ చర్చ వాడీవేడీగా సాగుతోంది. ఇది సర్కారు ప్రమేయమేనా? లేక అధికారుల ఆలోచనా? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

కొత్త చట్టంలో తొలికేసు ఎమ్మెల్యేపైనే...

కరీంనగర్ జిల్లా పరిషత్ సమావేశంలో కలెక్టర్ సహా అధికారుల విధులకు ఆటంకం కలిగించిన అభియోగాలపై హుజురాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై వన్ టౌన్‌లో క్రిమినల్ కేసు నమోదయ్యింది. భారత్ న్యాయ్ సంహిత యాక్ట్ ప్రకారం 221,126 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. బిఎన్ఎస్ చట్టం అమల్లోకి వచ్చిన రెండవ రోజే కౌశిక్ రెడ్డిపై కేసు నమోదయ్యింది. ఈ యాక్టు కింద కేసు నమోదైన మొట్టమొదటి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కావడం విశేషం. మంగళవారం జరిగిన జెడ్‌పి సమావేశంలో ఎమ్మెల్యే వ్యవహరించిన తీరుపై జెడ్‌పి సిఇఒ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ పమేలా సత్పతి బయటికి వెళ్లే సమయంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అడ్డుకుని బైఠాయించి నిరసనకు దిగారు. దీనికి సంబంధించి జెడ్‌పి సిఇఒ ఫిర్యాదు మేరకు కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర గందరగోళం సృష్టించారు. ఇటీవల హుజురాబాద్ నియోజకవర్గంలో విద్యారంగానికి సంబంధించి నెలకొన్న సమస్యలపై ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి హాజరైన ఎంఇఒలను డిఇఒ బదిలీ చేయడంపై ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే డిఇఒను సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని పట్టుబట్టారు. దళితబంధు అంశంతో పాటు డిఇఒ అంశంపై కలెక్టర్ పమేలా సత్పతి సమాధానం చెప్పాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. దీంతో కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయే ప్రయత్నం చేశారు. కలెక్టర్‌ను వెళ్లనీయకుండా ఎమ్మెల్యే అడ్డుకుని అక్కడే బైఠాయించి నిరసనకు దిగారు. ఈ ఘటనపై జెడ్‌పి సిఇఒ అభ్యంతరం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై క్రిమినల్ కేసును నమోదు చేశారు.

జెడ్‌పి సిఇఒపై ఎమ్మెల్యే ఫిర్యాదు..

కరీంనగర్ జెడ్‌పి సమావేశంలో చోటు చేసుకుంటున్న ఘటన నేపథ్యంలో తనపై నమోదు చేసిన కేసుపై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి ధీటుగా స్పందించారు. ఈ మేరకు కరీంనగర్ జెడ్‌పి సిఇఒ తన విధులకు ఆటంకం కలిగించారంటూ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా పరిషత్ సమావేశంలో హుజురాబాద్ సమస్యలు అడిగితే తప్పా అని ప్రశ్నించారు. తాను ఎవరినీ అడ్డుకోలేదని, ఎవరిని అడ్డుకున్నానో చూపించాలని డిమాండ్ చేశారు. తన విధులకు ఆటంకం కలిగించారని కీరంనగర్ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేస్తానని, జెడ్‌పి సిఇఒ, డిఇఒలపై ప్రివిలేజ్ మూవ్ చేస్తానని స్పష్టం చేశారు. ప్రజా గొంతుకగా ప్రజా సమస్యలపై మాట్లాడితే తన గొంతు నొక్కాలనుకుంటే అది మీ వల్ల కాదంటూ వ్యాఖ్యానించారు. హుజురాబాద్ పేద విద్యార్థులు చదువుకునే హాస్టళ్లలో సౌకర్యాలపై ఎంఇఒలతో మీటింగ్ పెడితే డిఇఒ వారికి డిమోషన్ లెటర్ పంపించారని, ఎమ్మెల్యేగా సమీక్ష జరిపే అధికారం తనకు లేదా అని అడిగారు. కొత్త చట్టం ప్రకారం ఎలా నడుచుకోవాలో అలా నడుచుకుని, న్యాయవాదితో మాట్లాడి చట్టపరంగానే మూవ్ అవుతానని వెల్లడించారు.

కెటిఆర్, హరీష్‌రావుల ఆగ్రహం

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేయడంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్యే హరీష్‌రావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అవినీతిపై పోరాటం చేస్తున్నందుకే కౌశిక్ రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేసినట్లు మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే క్రిమినల్ కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. ఇలాంటి బెదిరింపులకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు భయపడేది లేదని తేల్చి చెప్పారు.

జువ్వాడి కుటుంబం ప్రజా సేవకే అంకితం

ప్రజాపక్షం/ధర్మపురి : దివంగత మాజీ మంత్రి, స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు కుటుంబం ప్రజా సేవకు అంకితమైందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మనపూర్ గ్రామంలో బుధవారం స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు సతీమణి సుమతి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమతి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా, సమితి అధ్యక్షులుగా రత్నాకర్ రావు అనుక్షణం ప్రజల సంక్షేమాన్ని కోరుకునే వారని ఆయన హాయాంలో జిల్లా ఎంతో అభివృద్ధి సాధించిందని అన్నారు. ప్రస్తుతం ఆయన పెద్ద కుమారుడు జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీగా, రెండవ కుమారుడు కృష్ణారావు ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహస్వామి దేవస్థానం అధ్యక్షులుగా గతంలో సేవలందించి ప్రజా క్షేత్రంలో చురుగ్గా కొనసాగుతున్నారని వారు గుర్తు చేశారు. వీరి కుటుంబం రాజకీయంగా ఉన్నత స్థానంలో ఉండటం వెనక రత్నాకర్ రావు సతీమణి సుమతి సహకారం ఎంతగానో ఉందన్నారు.

PUBLIC NOTICE

ఇందుమూలముగా యావత్తు ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ డీసీబీ బ్యాంకు లిమిటెడ్ హనుమకొండ బ్రాంచ్ గారి వద్దకు శ్రీమతి వనం రజిత వైఫ్ ఆఫ్ రవీందర్ R/o. జమ్మికుంట గారు నా క్లయింట్ వద్ద దిగువ షెడ్యూల్ ఆస్తి పై మోర్టిగేజ్ లోన్ కొరకై దరఖాస్తు చేసుకొని ఉన్నారు అట్టి ఆస్తిని వారు శ్రీ మండ వెంకటరాజం గారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు అగ్రిమెంట్ ఆఫ్ సేల్ డాక్యుమెంట్ చేసుకొని ఉన్నారు, మరియు అట్టి దిగువ చూపిన ఆస్తి యొక్క ఒరిజినల్ లింక్ దస్తావేజు డాక్యుమెంట్ నో.5705/2012 దివి: 26-12-2012 SRO హుజురాబాద్ ఎక్కడో పోయినదని తెలిపినారు. కావున దిగువ చూపిన ఆస్తి పై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరము ఆక్షేపణలు మోర్గాగేలు ఉన్నచో (5) రోజులలో క్రింద చూపిన అడ్రస్ కు లిఖిత పూర్వకముగా తెలుపగలరు తదుపరి అభ్యంతరములు చెల్లనేరవు.

షెడ్యూల్: All that the Open plot out of Sy.No. 659 admeasuring to an extent of 96.38 Sq. yards or 80.56 Sq. Mtrs, situated at Sainagar Colony, Jammikunta Village and Mandal Karimnagar District and SRO Huzurabad and bounded as EAST: Kanumalla Rajaiah H.No. 2-4-43, WEST: Ummadi Sambamurthy H.No. 2-4-44, NORTH: 15 Feet wide Municipality Road, SOUTH: Dekonda Venkateshwarlu H.No.2-4-51.

Sd/- NALLELLA SURENDER, NALLELLA SUHAS
ADVOCATES,
H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HANAMKONDA, Warangal. Cell: 9849365117

యుపిలోని హత్రాస్ ఘటనకు బిజెపి ప్రభుత్వానిదే బాధ్యత

తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హత్రాస్ జిల్లాలో జరిగిన ఘటనకు ఆ రాష్ట్ర బిజెపి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం హన్మకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తక్కళ్లపల్లి మాట్లాడారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో ప్రజలను మతం, దేవుళ్లు, బాబాల పేరుతో మూఢ నమ్మకాలవైపు మరలిస్తున్నారన్నారు. ప్రజల మెదళ్లను కలుషితం చేస్తూ వారిని మధ్య యుగాల వైపు తీసుకెళుతున్నదన్నారు. అందులో భాగంగానే యుపిలో బాబాల పేరుతో జరుగుతున్న ఆధ్యాత్మిక సమావేశాలన్నారు. ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా తక్కువ మంది పట్టే స్థలంలో వేలాది మందితో భోలే బాబా ఆధ్యాత్మిక సమావేశం ఏర్పాటు చేసిన వందకు పైగా సామాన్యుల మృతికి కారణమయ్యారన్నారు. సరైన ఏర్పాట్లు చేయడంలో యుపి ప్రభుత్వ వైఫల్యం వల్లే తొక్కిసలాట చోటు చేసుకున్నదని, దీనికి నైతిక బాధ్యత అక్కడి ప్రభుత్వం వహించి, ఈ ఘటనకు కారణమైన భోలేబాబాపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తక్కళ్లపల్లి డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి, బాషబోయిన సంతోష్, ఉట్కూరి ప్రణీత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తి కార్మికులను ఆదుకోవాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాపక్షం/కోదాడ : అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న చేతి వృత్తి కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు కోరారు. బుధవారం పట్టణంలో ఎఐటియుసి అనుబంధ కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ సమావేశం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్పెంటర్లకు పరికరాలను, విద్యుత్‌ను ఉచితంగా అందజేయాలని కోరారు. అర్హులైన కార్మికులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు బీమా కల్పించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్పెంటర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా మేకల శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా రేపూరి సత్యనారాయణచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లేపల్లి శ్రీధర్‌చారి, ప్రధాన కార్యదర్శిగా నెల్లూరి బ్రహ్మచారి, ఉపాధ్యక్షులుగా షేక్ అబ్దుల్లా, ఉపేంద్రచారి, సతీష్, సహాయ కార్యదర్శులుగా రామాచారి, యలమందచారి, శ్రీనివాసచారి, కోశాధికారిగా ఎన్.ఉపేంద్రచారి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.రామాచారి, సమన్వయ కమిటీచైర్మన్ అడ్లూరి అంజయ్యచారితో పాటు 25 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు లతీఫ్, వీరభద్రాచారి, విద్యాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ పోస్టుల్లో అవకతవకలు

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సతీష్

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : కస్తూర్బా, ఆదర్శ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ పోస్టులలో అవకతవకలు జరిగాయని, దానికి సంబంధించి మెరిట్ లిస్టు ప్రకటించకుండానే ఉద్యోగుల భర్తీ చేశారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని స్థానిక కొమురయ్య భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేకమంది ఈ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఎటువంటి ప్రకటన వెలువడకుండానే ఎటువంటి సమాచారం లేకుండానే గత డిఇఒ ఆర్డర్ కాపీలు ఇచ్చి వారిని నియమించారన్నారు. అర్హత లేని వ్యక్తులకు సంబంధిత పోస్టులు ఇచ్చారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మెరిట్ లిస్ట్ వెంటనే ప్రకటించాలని, ఉద్యోగం పొందిన అభ్యర్థుల సమాచారాన్ని డిఇఒ ఆఫీస్‌లో నోటీసు బోర్డులో ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి నూతన విధాన

మూసాయిదా సిద్ధం

మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : పర్యాటక కేంద్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్ది.. ఆర్థికంగా స్వయం సంవృద్ధి సాధించడం.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నూతన పర్యాటక విధాన ముసాయిదా రూపొందించామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బుధవారం సచివాలయంలోని మీడియా సెంటర్‌లో పర్యాటక రంగ అభివృద్ధి, సాంస్కృతికశాఖ బలోపేతంపై మంత్రి జూపల్లి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన పదేళ్ల లో పర్యాటకశాఖ ఉన్నదనే విషయం మరిచిపోయామని, పర్యాటకరంగ అభివృద్ధికి ఓ పాలసీ అంటు లేకుండా పోయిందని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. పర్యాటక రంగం అస్తవ్యస్తమైందని, తారామతి బరాదరి, హరిత హోటల్స్ నిర్వహణ అధ్వాన్నంగా తయారైందని, యుద్ధ ప్రాతిపాదికన పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని, ఆరు నెలల్లోనే పురోగతి సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎకో, టెంపుల్, మెడికల్ టూరిజంపై ప్రధానంగా దృష్టిసారించినట్లు చెప్పారు. త్వరలోనే కేంద్రపర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిని కలిసి తెలంగాణ పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరతామని తెలిపారు. సింగాపూర్, దుబాయ్, ఆఫ్రికా లాంటి దేశాలు... తమ ప్రధాన ఆదాయ వనరుగా పర్యాటక రంగాన్ని మలుచుకున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటకాన్ని అంతర్జాతీయస్థాయిలో తీర్చిదిద్ది...లోకల్ టు గ్లోబల్ టూరిస్ట్‌లను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. కృష్ణానదీ బ్యాక్ వాటర్స్‌లో సోమశిలను డెస్టినేషన్ వెడ్డింగ్, సహస పర్యాటకానికి అనువైన ప్రదేశంగా గుర్తించామని, డెస్టినేషన్ వెడ్డింగ్ ను ప్రమోట్ చేయడానికి.. రామప్ప, లక్నవరం, నాగార్జునసాగర్, అనంతగిరి హిల్స్ వంటి ముఖ్యమైన ప్రదేశాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. అనంతగిరిలో వెల్నెస్ టూరిజం రిసార్ట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

నాగర్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని..

నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని బుద్ధ గయా తరహాలో అంతర్జాతీయస్థాయిలో తీర్చిదిద్ది తూర్పు, దక్షిణ దేశాల పర్యాటకులను అకట్టుకునేలా వసతులు కల్పిస్తామన్నారు. గత ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మక ఎన్ఐటిహెచ్ఎం ప్రతిష్ఠ మసక బారిందని, గతంలో 800 పైగా స్ట్రెంత్ ఉంటే.. ఇప్పుడు 200కు పడిపోయిందని... దీనికి పూర్వవైభవం తీసుకువస్తామని మంత్రి జూపల్లి తెలిపారు. సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డెరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

'చేనేత'కు ప్రభుత్వం బాసట

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : చేనేత కార్మికులకు ప్రభుత్వం బాసటగా ఉంటుందని వ్యవసాయ మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో కలిసి మంత్రి తుమ్మల చేనేత సహకార సంఘాల నాయకులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేత కార్మికుల్ని పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం చేనేత కార్మికులు, మరమగ్గాల కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూర్చే పథకాల అమలుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్మికులందరికీ చేతి నిండా పనికల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నమన్నారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా రూ.25కోట్ల విలువైన ఆర్డర్లు టెస్కోకు వస్త్రసరఫరాకు వచ్చాయన్నారు. చేనేత, మరమగ్గాల కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి నేత, మరమగ్గాల రంగాలకు అన్నివిధాల మేలు జరిగేటట్లు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేత కార్మికులు నిరుత్సాహానికి గురికావద్దని, ప్రభుత్వం నేత కార్మికులకు అండగా ఉంటుందని మంత్రి తుమ్మల భరోసా ఇచ్చారు. ప్రాథమిక చేనేత సహకార సంఘాలలోని వస్త్ర నిల్వలను కొనుగోళ్లు చేసి, బకాయిలను విడుదల చేయాలని, నేతన్న భీమా, పావలా వడ్డీ, యార్న్ సబ్సిడీ, వర్కర్ టు ఓనర్ పథకాలను కొనసాగించాలని, చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేయాలనీ, నేతన్న భీమాను 59 ఏళ్ల దాటినా వారికి కూడా వర్తింపచేయాలనీ, ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిపించాలని, టెస్కో ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కూడా షోరూంలు ఏర్పాటు చేయాలనీ, జనతా చీరలు, ధోతుల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టాలని ఈ సందర్భంగా మంత్రి తుమ్మలకు చేనేత సహకార సంఘాల నాయకులు విన్నవించారు.

గనుల వేలంతో సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర

5న కలెక్టరేట్ ఎదుట ధర్నా : సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా మాస్‌లైన్ పిలుపు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పేరుతో సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ చేయడానికి కుట్రలు పడుతుందని, నూతన చట్టాన్ని తీసుకువచ్చి సింగరేణిని ప్రైవేట్‌వ్యక్తుల చేతుల్లో పెట్టాలని చూస్తోందని సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మిల్కూరి వాసుదేవరెడ్డి, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథ్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్‌లు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి వరప్రసాదం లాంటి సింగరేణి బొగ్గు గనులను వేలం వేయడాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని, బ్లాకులను సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 5న కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించతలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మాట్లాడారు. ఆదానీ, అంబానీల చేతుల్లోనే కేంద్రం నడుస్తోందని, అందులో భాగంగా రాష్ట్రంలో సింగరేణి బొగ్గు గనులను వేలాన్ని వేసేందుకు కేంద్రం పూనుకుందన్నారు. రాబోయే కాలంలో సింగరేణి ఉద్యోగాలు లేకుండా చేస్తుందని, గతంలో లక్ష ఇరవై వేల ఉద్యోగాలు ఉంటే అవి రోజు రోజుకు తగ్గిస్తున్నారని, బొగ్గు గనులను వేలం వేస్తే భవిష్యత్తులో ఉన్న ఉద్యోగాలు లేకుండా కేంద్రం చేస్తుందన్నారు. గనుల వేలంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, వామపక్షాలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు నిర్వహించే ఆందోళనలకు పూర్తి మద్దతు ఇచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పక్షమా లేక ప్రైవేటీకరణ వైపో తేల్చుకోవాలని, ఈ ఉద్యమం ఆరంభం మాత్రమేనని వెంకటస్వామి పేర్కొన్నారు. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో బిజెపి ప్రభుత్వం 6 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందని, దేశ వ్యాప్తంగా 61 బొగ్గు బ్లాకులను వేలం వేసి 28 లక్షల 668 వేల కోట్లను జమ చేసుకోవడానికి వేలం వేస్తున్నారని, వేలం పాటను రద్దు చేయాలని, సింగరేణికే బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బొగ్గు బ్లాక్‌ల వేలం పాటలో పాల్గొనడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో బిజెపికి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు, 8మంది ఎంపిలు స్పందించకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుగులోతు భీమాసాహెబ్, సుంకరి సంపత్, సిపిఐఎంఎల్ ప్రజాపంథ్ మాస్‌లైన్ నాయకులు జిందం ప్రసాద్, ఊకంటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఎఐటియుసి అండ

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : ఆటో కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి నిరంతర పోరాటం చేస్తుందని ఎఐటియుసి అనుబంధ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందారపు వెంకటేశం తెలిపారు. బుధవారం స్వర్ణగిరి దేవాలయం వద్ద స్వర్ణగిరి ఆటో డ్రైవర్ యూనియన్, రేణుక ఎల్లమ్మ తల్లి ఆటో డ్రైవర్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన జెండా దిమ్మెల ఆవిష్కరణ కార్యక్రమానికి బి.వెంకటేశం హాజరయ్యారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డ్ వెంటనే ఏర్పాటు చేయాలని, ఇండ్లు లేని కార్మికలకు ఇండ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, క్యాబ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.తిరుమలేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్, సభ్యులు సామల శోభన్ బాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గనబోయిన వెంకటేష్, సామల భాస్కర్, సభ్యులు దాసరి లక్ష్మయ్య, స్వర్ణగిరి ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు గొర్ల లక్ష్మణ్, అధ్యక్షులు తారాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సమస్యలు పట్టించుకోని కేంద్రం : ఎఐఎస్‌ఎఫ్ విమర్శ

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోవడం లేదని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ ఆరోపించారు. జూలై 4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని, నీట్, నెట్ పరీక్షలను రద్దుచేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హన్మకొండ బాలసముద్రంలోని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నర్సింగరావు, ఎస్‌ఎఫ్ఐ జిల్లా ప్రధన కార్యదర్శి మంద శ్రీకాంత్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు డి.రంజిత్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు పల్లకొండ సతీష్, యుఎస్‌ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు రాజేష్‌తో కలిసి సంతోష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నెట్, నీట్ అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలన్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, కసరబోయిన రవితేజ,శ్రీపతి వినయ్, కుక్కల కుమార్, వేల్పు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్'పై నేడు విద్యాసంస్థల బంద్

విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : నీట్, నెట్ పరీక్షలను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఎఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఎఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు అలువాల నరేష్, ఎన్ఎస్‌యు సిటి అధ్యక్షుడు శ్రావణ్, పిడిఎస్‌యు ఉదయ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీపైన ఆందోళనలు జరుగుతున్నప్పటికీ మోదీ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు.
నిర్మల్ రూరల్ : నీట్ పరీక్ష పత్రాల లీకేజీలను నిరసిస్తూ గురువారం విద్యాసంస్థలు బంద్ పాటించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ కైలాస్ మాట్లాడుతూ విద్యాసంస్థలకు బంద్‌కు సహకరించాలని యజమాన్యాలను కోరారు. నీట్ పరీక్ష పేపర్ రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని, ఎన్‌టిఎను రద్దు చేయాలని, నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ కెజీ టు పిజీ విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజ్‌పై, అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి, నీట్ పరీక్ష మళ్ళీ నిర్వహించాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొత్కు ప్రవీణ్ కుమార్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గురువారం కెజీ టు పిజీ విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలని కోరారు. బంద్‌లో ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు విద్యార్థులు. తల్లిదండ్రులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సభ

టి.వెంకట్రాములు

ప్రజాపక్షం/హైదరాబాద్ : భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరులు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సభ బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11గంటలకు సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంభవన్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో దొడ్డి నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ హాజరు కానున్నారని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకట్రాములు తెలిపారు. కార్యక్రమానికి సిపిఐ శ్రేణులు, బిసిహక్కుల సాధన సమితి నాయకులతో పాటు ప్రజాసంఘాల నేతలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వెంకట్రాములు కోరారు.

పుణెలో జికా వైరస్ కలకలం..

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని అన్ని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. పాజిటివ్ తేలిన తల్లుల పిండాల పెరుగుదలను పర్యవేక్షించడం ద్వారా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఇంటి ఆవరణలో ఎడిస్ దోమలు లేకుండా చూసేందుకు నోడల్ అధికారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించింది. నివాస ప్రాంతాలు, కార్యాలయాలు, పాఠశాలలు, నిర్మాణ స్థలాలు, సంస్థలు, ఆరోగ్య సౌకర్యాల్లో కీటకాలు లేకుండా నిఘా పెంచాలని, నియంత్రణ కార్యకలాపాలను తీవ్రతరం చేయాలని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. కాగా, జులై 1న పుణెలో ఇద్దరు గర్భిణులు సహా ఆరుగురికి జికా వైరస్ పాజిటివ్ తేలిన విషయం తెలిసిందే. నగరంలోని అరంద్వానే ప్రాంతంలో నాలుగు, ముండ్వా ప్రాంతంలో రెండు కేసులు నమోదయ్యాయి. రాష్ట్ర ఆరోగ్యశాఖ తెలిపిన వివరాల ప్రకారం అరంద్వానేలో మొదటి కేసు నమోదయింది. 46 ఏండ్ల డాక్టర్ తొలుత జికా వైరస్ బారిపడ్డారు. అనంతరం అతని కుమార్తె (15)కు వైరస్ సోకినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. వీరిద్దరితో పాటు ముంద్వాకు చెందిన ఇద్దరి రిపోర్టులు పాజిటివ్‌గా వచ్చాయి. ఈ నాలుగురితోపాటు అరంద్వానేకు చెందిన ఇద్దరు గర్భిణులకు జికా వైరస్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. జికా వైరస్ సోకిన ఆడ ఎడిస్ దోమ కుట్టడం వల్ల వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వైరస్‌ను తొలిసారి 1947లో ఉగాండా అడవుల్లోని ఓ కోతిలో గుర్తించారు. ఆ తర్వాత ఆఫ్రికన్ దేశాలతోసహా భారత్, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, వియత్నాం లాంటి ఆసియా దేశాలకూ ఈ వ్యాధి వ్యాప్తి చెందింది. ఈ వైరస్ సోకినవారిలో జ్వరం, చర్మంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, జీర్ణకోశ సంబంధ సమస్యలు, గొంతు నొప్పి, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కుప్పకూలుతున్న వంతెనలు

(మొదటి పేజీ తరువాయి)

భాగం బుధవారం ఉదయం కూలిందని డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ ముఖేష్‌కుమార్ వెల్లడించారు. అయితే ఈ అందుకు గల కారణాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. 1982–83లో ఈ వంతెన నిర్మాణం జరిగిందన్నారు. కొద్ది రోజుల క్రితమే ఈ వంతెన మరమ్మతు పనులు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. మహారాజ్‌గంజ్‌తో వివిధ గ్రామాలను ఈ వంతెన కలుపుతుందని వివరించారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గండకి నది వరద పోటెత్తిందని గ్రామస్తులు తెలిపారు. ఆక్రమంలో వంతెన నిర్మాణం బలహీన పడే అవకాశం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక వంతెన కూలిన ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. జూన్ 22వ తేదీన సివాన్ జిల్లాలో ఇదే డియోరియా ప్రాంతంలో ఓ వంతెన కుప్పకూలిన సంగతి తెలిసిందే.
ఇటీవల కిషన్‌గంజ్ జిల్లాలో కంకయీ ఉపనదిపై నిర్మించిన ఓ వంతెన కుంగిపోయింది. దీంతో బహదూర్‌గంజ్, దిఘాల్–బ్యాంక్ బ్లాక్‌ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అంతకుముందు తూర్పు చంపారన్, సివాన్, అరారియా జిల్లాల్లో వంతెన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇలా పదిహేను రోజుల వ్యవధిలోనే వరుసగా ఏడు ప్రమాదాలు జరగడంపై రాష్ట్రవ్యాప్తంగా వంతెనల నాణ్యతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

గ్రీన్ సిగ్నల్ (మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులను బదిలీ చేయవద్దని, అలాగే 2025 జూన్30లోగా పదవీ విరమ ణ పొందే ఉద్యోగులను కూడా బదిలీ చేయవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జూలై 5నుంచి 8వరకు ఖాళీలు, బదిలీల వివరాలు వెల్లడించాల్సి ఉండగా, జులై 9నుంచి 12వరకు ఉద్యోగుల నుంచి అప్లన్లను స్వీకరించాల్సి ఉంటుంది. జూలై13 నుంచి 18వరకు ఉద్యోగుల బదిలీల దరఖాస్తులను పరిశీలించి, జూలై 19 నుంచి 20వ తేదీ వరకు ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులను జారీచేస్తారు. కాగా రాష్ట్రపతి ఉత్తర్వులను అనుసరించాల్సి ఉంటుంది.
మార్గదర్శకాలు ఇవే... 2024 జూన్ 30వ తేదీ నాటికి ఒక నిర్దిష్ట కేంద్రం/ ప్రాంతంలో రెండేళ్ల సర్వీసు పూర్తికాని ఏ ఉద్యోగిని కూడా బదిలీ చేయకూడదు.అయితే స్పౌస్ కారణాలు కొన్ని షరతులను విధించారు. అలాగే ఒక ప్రాంతంలో నాలుగు సంవత్సరాలు పైబడిన ఉద్యోగులను కొనసాగించకూడదని మార్గదర్శకాల్లో పొందరుపర్చారు. అయితే జూన్ 30, 2025లోపు పదవీ విరమణ పొందే ఉద్యోగులకు ప్రధాన్యత ఇవ్వనున్నారు. అయితే ఆయా శాఖలు, విభాగాలలో 40 శాతం కంటే మించి బదిలీలు చేపట్టరాదని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. బదిలీ కోసం ఎక్కువ మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకుంటే మార్గదర్శకాలలోని షరతులకు అనుగుణంగా బదిలీ ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా స్పౌస్,అలాగే జూన్ 30, 2025లోపు పదవీ విరమణ పొందేవారు, 70 శాతం, లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగిన ఉద్యోగులకు ప్రధాన్యత ఇవ్వనున్నారు. ఉద్యోగులకు మానసిక వికలాంగులు కలిగిన పిల్లలు ఉంటే వారి వైద్య సదుపాయాలను కలిగిన ప్రదేశాలను ఎంపిక చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. వితంతువులకు కూడా ప్రధాన్యాత ఇవ్వనున్నారు. మెడికల్ గ్రౌండ్స్‌ను కూడా పరిగణలోకి తీసుకోవాలని మార్గదర్శకాల్లో పొందపరిచారు. ఉద్యోగులకు లేదా వారి భార్య, పిల్లలకు, ఆధారపడిన తల్లిదండ్రులకు ఆరోగ్య సమస్యలను కూడా పరిగణలోకి తీసుకోనున్నారు. ముఖ్యంగా . క్యాన్సర్, న్యూరోసర్జరీ,కిడ్నీ,కాలేయ మార్పిడి,ఓపెన్ హార్ట్ సర్జరీ,ఎముక టిబి వ్యాదులను మెడికల్ గ్రౌండ్స్‌లో చేర్చారు. ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో రాష్ట్ర,మల్టీ జోనల్, జిల్లా కమిటీలను ఏర్పాటు చేశారు.
బదిలీల షెడ్యూల్ : జూలై 5 నుంచి 8వ తేదీ వరకు : ఆయా శాఖలు, ఉద్యోగ సంఘలను సంప్రదించి, బదిలీల కార్యాచరణ...ఆయా శాఖలలోని విభాగాలలో స్పష్టమైన ఖాళీలు, తప్పనిసరిగా బదిలీ చేయాల్సిన ఉద్యోగుల జాబితాను సిద్ధం చేసి ప్రచురించాలి.
జూలై 13 నుంచి 18 వరకు :దరఖాస్తుల పరిశీలన.కౌన్సిలింగ్ తర్వాత తదనుగుణంగా మాస్టర్ జాబితా
జూలై 19 నుంచి 20 వరకు: బదిలీ ఉత్తర్వులు జారీ..
బిఆర్ఎస్ పాలనలో ఒకే సారి సాధారణ బదిలీ
గత బిఆర్ఎస్ పాలనలో కేవలం ఒకే సారి సాధారణ బదిలీ జరిగింది. 2018లో గత ప్రభుత్వం సాధారణ బదిలీ చేపట్టింది. ఆ తర్వాత సాధారణ బదిలీలు చేపట్టలేదు. దీంతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సాధారణ బదిలీలు చేపట్టాలని కోరినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్యతో కూడిన త్రిసభ్య కమిటీ ఉద్యోగ సంఘాలతో పలు మార్లు భేటీ అయింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

పాఠశాల విద్యాశాఖ కమీషనర్, డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నరసింహారెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపిన స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్‌టియుటిఎస్) రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పర్వత్ రెడ్డి, సదానందం గౌడ్ తదితరులు

అభివృద్ధికి నిధులు కేటాయించండి

జోనల్ కమిషనర్‌కు హస్తినాపురం కార్పొరేటర్ సుజాతనాయక్ వినతి

ప్రజాపక్షం/వనస్థలిపురం : హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేయంత్ కేశవ్ పాటిల్‌ను హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వివరించారు. ఈసందర్భంగా సుజాత నాయక్ మాట్లాడుతూ కాలనీల్లో సమస్యలు పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌కుకోరారు. కార్యక్రమంలో దేరంగుల కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్ నాయక్ ఉన్నారు.

రోగులతో అమర్యాద ప్రవర్తించవద్దు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, రోగుల పట్ల సిబ్బంది అమర్యాద ప్రవర్తించవద్దని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది తోపాటు పేషెంట్లకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది విధులకు సరైన సమయానికి హాజరు కావాలని,ఆసుపత్రికి వచ్చే రోగులను కసరకుండా వారికి వైద్యం అందించాలన్నారు. రోగులకు అవసరమైన చికిత్స అందించి, మందులు అందజేయాలని సూచించారు. అదేవిధంగా ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత డాక్టర్లకు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. టెస్టులు నిర్వహించి వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.శశాంక తెలిపారు. తనిఖీలో శంషాబాద్ తహసీల్దార్ నాగమణి, డాక్టర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

ప్రజాపక్షం/నార్సింగి: జూలై 4న విద్యా సంస్థల బందును విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యుఐ ఆధ్వర్యంలో బుధవారం శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై అదేవిధంగా నీట్ అవకతవకలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 4న జరిగే విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నేతలు మాట్లాడుతూ.. నెట్, నీట్ పరీక్షలు రాసి, నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, నీట్ పరీక్షను రాష్ట్ర ప్రభుత్వాల అద్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారికి 10 రిజర్వేషన్ ఇవ్వాలని మరియు పీహెచ్డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనుక తీసుకోవాలని, టిఐఎస్‌ఎస్ ముంబై, ఐఐటీ ముంబై నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు, యూనివర్సిటీలలో స్వేచ్ఛ వ్యక్తీకరణ ప్రజాస్వామ్య అణచివేత చర్యలను ఆపాలని కోరారు. విద్యాసంస్థల బంద్‌లో విద్యార్థులు తల్లిదండ్రులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి శివకుమార్, జి .క్రాంతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రణయ్ బి.శంకర్, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు మణికంఠ జగదీష్ అభిషేక్, కే శివ విజయ్‌చారి ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు హెచ్చరిక

ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ఏబివి, బుగ్గారెడ్డి ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఆసుపత్రి రిజిస్టర్లను పరిశీలించడంతోపాటు పనిచేసే వైద్య సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులుగా పనిచేస్తున్న వారి సర్టిఫికెట్లను, మెడికల్ కౌన్సిలింగ్‌లో రిజిస్ట్రేషన్ అయిందా లేదా అనే విషయాలను రికార్డులను ద్వారా పరిశీలించారు. ఏబివి ఆసుపత్రిలో లేబర్ రూమ్, థియేటర్లను పరిశుభ్రంగా పెట్టుకొవాలని హెచ్చరించారు. ఓపి, డెలివరి, ఆపరేషన్ రిజిస్ట్రర్లను పరిశీలించడంతోపాటు ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్య సిబ్బంది, క్వాలిఫైడ్ డాక్టర్లను నియమించుకోవాలని హెచ్చరించారు. మీ ఆసుపత్రులు మెరుగైన వైద్యసేవలు అందిస్తే పత్రిల్లో ఎందుకు ఇలాంటి వార్తాలు వస్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. బుగ్గారెడ్డి ఆసుపత్రి ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ఇద్దరు ప్రాణాలను తీయడం ఏమిటని ఆసుపత్రి యాజమానులను ప్రశ్నించారు. మరోమారు మీ ఆసుపత్రుల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటే ఈ రెండు ఆసుపత్రులను సీజ్ చేయడం జరుగుతుందని డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. తనిఖీల్లో షాద్‌నగర్ డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, చేవెళ్ల డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ దామోదర్, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, డివిజన్ ఆఫ్తాల్మేక్ అధికారి జె.శ్రీహరి, ఎల్త్ ఎద్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు, డిఎంహెచ్ఓ ఓసిసి సురేష్‌లు ఉన్నారు.

కెటిఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫిరాయింపులను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, రాబోయే రోజుల్లో పార్టీ రెట్టించిన ఉత్సహంతో పుంజుకుంటుందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. బిఆర్‌ఎస్ గోషామహల్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ నేతృత్వంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కెటిఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కొంత మంది ఎంఎల్‌ఎలు పోయినంత మాత్రన పార్టీకి ఏమాత్రం నష్టం లేదన్నారు. జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని, కాంగ్రెస్ దుశ్చర్యలకు తగినమూల్యం చెల్లించకోక తప్పదన్నారు. ఎప్పుడు ప్రజల మధ్య ఉంటూ, ప్రభుత్వ దుశ్చర్యలపై వారికి అవగాహన కల్పించాలని కెటిఆర్ వారికి సూచించారు.

జెన్‌కోతోనే రామగుండంలో విద్యుత్ కేంద్రం

ఎపి నుంచి రావాల్సిన రూ.3392 కోట్లపై చంద్రబాబుతో చర్చించాలి

డిప్యూటీ సిఎం భట్టికి విద్యుత్ జెఎసి వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యుత్ సంస్థ జెన్‌కోతోనే రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రం మూస్తున్నందున అందులో ప్రభుత్వరంగ సంస్థ అయిన జెన్‌కో ద్వారానే (1X800 మెగావాట్ల) విద్యుత్ కేంద్రం నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రామగుండంలో ఉన్న జెన్‌కో విద్యుత్ కేంద్రాన్ని మూసివేసి ఆ 540 ఎకరాల స్థలాన్ని సింగరేణికి ఇస్తారని వస్తున్న వార్తల సందర్భం గా జేఏసి ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రిని ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు కలువడం ప్రాధాన్యతను సంతరించుకుంది. జెన్‌కోతోనే విద్యుత్ కేంద్రం నిర్మించాలని ఆ ప్రాంతంలో మరింత అభివృద్ధి జరుగుతుందని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జేఏసి నేతలు వివరించారు. తద్వారా సుమారుగా 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. జెన్‌కో ప్రాజెక్టులు ఈక్విటీ రూపంలో చెల్లించాలని మొత్తం జెన్‌కో నుంచి సమకూర్చవచ్చునన్నారు. సింగరేణి సంస్థ ద్వారా కేంద్రం 49 శాతం, తెలంగాణ రాష్ట్ర వాటా 51 శాతం కలిగి ఉందని వెల్లడించింది. జెన్‌కో మాత్రం నూరుశాతం రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ అని గుర్తు చేసింది. ప్రభుత్వరంగ సంస్థ బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు తక్కువ ధరకే ప్రజలకు విద్యుత్తు లభించి, ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. విద్యుత్ ఉద్యోగుల పెన్షన్ ట్రస్టుకి సంబంధించి తెలంగాణ జెన్‌కోకు ఏపీ జెన్‌కో నుండి రూ.2478 కోట్లు, ఏపీ ట్రాన్స్‌కో నుండి తెలంగాణ ట్రాన్స్‌కోకు రూ.914 కోట్లు, మొత్తం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలనుండి తెలంగాణ విద్యుత్ సంస్థలకు రూ.3392 కోట్లు రావలసి ఉందని, ఈ మొత్తాన్ని 6న జరగబోయే ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో చంద్రబాబునాయుడుతో చర్చించి తెలంగాణ విద్యుత్ సంస్థలకు ఇప్పించవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నుండి తెలంగాణ డిస్కామ్‌లకు రావలసిన రూ.28842 కోట్లు, తెలంగాణ డిస్కామ్‌ల నుండి తెలంగాణ జెన్‌కోకు విద్యుత్ కొనుగోలు సంబందించి రావలసిన సుమారుగా 9500 కోట్లు రావాల్సివుందని గుర్తుచేసింది. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి స్పందిస్తూ జెన్‌కో ఆర్థికపరంగా నూతన థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించడానికి సిద్ధంగా ఉన్నట్లయితే ప్రభుత్వం అందుకు సుముఖంగా ఉన్నారు. విద్యుత్ ఇంజనీర్లు, ఉద్యోగులు కార్మికులు బాగా పనిచేస్తున్నారని తెలిపారు. విద్యుత్ సంస్థలను బలోపేతం చేయటానికి ప్రభుత్వం అన్ని ప్రయాత్నాలు చేస్తుందన్నారు. ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ, గృహజ్యోతికి సంబంధించి నిధులను విడుదల చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి విద్యుత్ సంస్థల నుండి పూర్తి సహకారం అందిస్తామని డిప్యూటీ సిఎం భట్టి వెల్లడించారు. డిప్యూటీ సిఎంని కలిసిన వారిలో విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటి కన్వీనర్ రత్నాకర్‌రావు, కోకన్వీనర్ బీసీ రెడ్డి, వైస్‌చైర్మన్ పి.సదానందం, అనిల్ కుమార్, వేణు, ఏ.వెంకటనారాయణరెడ్డి, అబ్దుల్ తఖీ, కుమారస్వామి పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి కార్పొరేటర్ తనయుడు బెదిరింపులు

పోలీసులకు ఫిర్యాదు చేసిన ముషీరాబాద్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ప్రజాపక్షం/హైదరాబాద్ : తమ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతూ బూతుమాటలతో దుర్భాషలాడిన అడిక్‌మెంట్ కార్పొరేటర్ సి.సునీతాగౌడ్ తనయుడు తరుణ్‌గౌడ్, అతడి అనుచరుడు శివపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిహెచ్‌ఎంసి సర్కిల్ 15 టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది బుధవారం వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు, పోలీసుల కథనం ప్రకారం టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ విభాగం చైర్మన్ జగన్, న్యాక్ ఇంజనీర్లు అడిక్‌మెంట్ డివిజన్ రాంనగర్ గుండు సమీపంలో ఓ భవన నిర్మాణాన్ని పరిశీలించేదుకు వెళ్లారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కొలతలు తీసుకుంటుండగా కార్పొరేటర్ సునీత అనుచరుడు శివ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది జగన్‌కు ఫోన్ చేసి అక్కడికి ఎందుకు వెళ్లారు అంటూ దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. కొద్దిసేపటికి కార్పొరేటర్ తనయుడు తరుణ్ సైతం జగన్‌కు ఫోన్ చేసి దుర్భాషలాడారని తెలిపారు. తనకు తెలియకుండా నిర్మాణం చేపడుతున్న భవనం వద్దకు ఎందుకు వెళ్లావంటూ దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారని చెప్పారు. దీంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు చైర్మన్ జగన్ వారాసిగూడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను బెదరించి, విధులకు ఆటంకం కలిగించి, బూతులతో దుర్భాషలాడిన కార్పొరేటర్ తనయుడు తరుణ్, ఆయన అనుచరుడు శివపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారాసిగూడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అరెస్ట్ చేయాలి : బిఎంఎస్ అధ్యక్షుడు శంకర్

టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై అడిక్‌మెంట్ కార్పొరేటర్ సునీతా గౌడ్ తనయుడు, ఆమే అనుచరుడు శివలను పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కె.శంకర్ కోరారు. విధి నిర్వహనలో భాగంగా నిర్మాణంలో ఉన్న భవనాలను తనిఖీ చేయడం టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది దిన చర్య అన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై కార్పొరేటర్ తనయుడు తరుణ్, వారి అనుచరుడు శివ బూతులతో తిట్టారన్నారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో జిహెచ్‌ఎంసిలోని 30 సర్కిళ్ల పరిధిలో విధులు బహిష్కరించి, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని శంకర్ హెచ్చరించారు.

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషిచేయాలి : ఎంపిపి

ప్రజాపక్షం/షాబాద్ : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపిపి కోట్లా ప్రశాంతి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రారంభించారు. గ్రామాల్లో సర్పంచులు లేని కారాణంగా గ్రామ అభివృద్ధి కుంటుబడుతుందని వివిధ గ్రామాల ఎంపిటిసిలు సభలో ప్రశ్నించారు. ప్రత్యేక పాలన పేరుతో గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు విఫలమౌవుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ఎంపిపి స్పందిస్తూ ప్రజల సమస్యలపై మండలంలోని వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో విద్యుత్, త్రాగునీరు, అండర్ డ్రైనేజీ సమస్యలు అధికమౌవుతున్నాయని ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని మండల అభివృద్ధి అధికారిణి అపర్ణను ఎంపిపి కోరారు. మండల సర్వసభ్య సమావేశం చివరిది కావడంతో ఎంపిపి కోట్లా ప్రశాంతి మహేందర్‌రెడ్డిని ఎంపిటిసిలు, అధికారులు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు కుమ్మరి చెన్నయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



ప్రజాపక్షం/రంగారెడ్డి/నార్సింగి: తెలంగాణ వీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం తో పాటు రూ.1.23 కోట్ల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులు, సిసి రోడ్డు, గౌడ సంఘం నూతన భవనాన్ని స్థానిక ఎంపిపి జయమ్మ, జడ్‌పిటిసి నీరటీ తన్వీరాజ్‌లతో కలిసి ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోల్కొండ కోటను రాజధానిగా చేసుకుని పాలించిన మొట్టమొదటి హిందూ మహారాజు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని అప్పటి నియంతృత్వ, నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా పాపన్న పోరాడారని గుర్తు చేశారు. పాపన్న జీవితం నేటి తరానికి స్పూర్తిదాయకమన్నారు. సర్వాయి పాపన్న యావత్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. కార్యక్రమాలలో ఎంపిడిఓ మున్ని, ఎంపిఓ ఉషాకిరణ్, వైస్ ఎంపిపి నీలం మోహన్ నాయక్, డిసిసిబి డైరెక్టర్ బుర్కుంట సతీష్, ఎంపిటీసి గౌతమి అశోక్, ఎంఇఒ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేష్ గౌడ్, ఒబిసి గీత సెల్ కమిటీ కన్వీనర్ పటేల్ వెంకటేష్ గౌడ్, కో కన్వీనర్లు రాగులు కిరణ్ కుమార్ గౌడ్చ తిరుమల క్రిష్ణ గౌడ్, యల్మకంటి మీరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/కొత్తూరు: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్ తండాలో ఉపాధి హామీ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల రూపు రేఖలను మార్చడంతోపాటు ప్రజా పాలన అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నామని, ఇందుకు ప్రజలందరు సహాకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి మధుసూదన్‌రెడ్డి, జడ్పిటిసి ఎమ్మె శ్రీలత, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచులు అంబటి ప్రభాకర్, రవి నాయక్, మాజీ ఉప సర్పంచులు దయానంద్ గుప్తా, దశరథ్ నాయక్, కాంగ్రెస్ నేతలు ఇందారి శ్రీనివాస్, వీరమోని దేవేందర్, సురేందర్, గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షణ ప్రాజెక్టు ఉద్యోగుల వినతి

షాద్‌నగర్: సమగ్ర శిక్షణ ప్రాజెక్టు కాంట్రాక్టు ఉద్యోగులు, మోడల్ స్కూల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్‌ను కోరారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎకు వినతిపత్రాన్ని ఇచ్చారు. విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టుల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు, కెజిబివి, యుఆర్‌ఎస్ స్టాఫ్, సీఆర్పీలు, ఐఆర్ఫ్, కంపుటర్ ఆపరేటర్లు, డిపిఓ స్టాఫ్, పిటిఐలు, మెసెంజర్లు, మోడల్ స్కూల్ హాస్టళ్లలో పని చేస్తున్న కేర్, కుక్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యాశాఖలో విలీనం చేసి కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు.

ప్రజాసేవకు పదవీ విరమణ అడ్డుకాదు..

షాద్‌నగర్/కొత్తూరు : ప్రజా ప్రతినిధులకు పదవీ విరమణ అనేది తాత్కాలికంగానే ఉంటుందే తప్పా ప్రజలకు సేవ చేసేందుకు ఎలాంటి విరమణ ఉండదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయాల అవరణలో ఎంపిపిలు పిన్నీంటి మధుసూదన్‌రెడ్డి, ప్రియాంక, ఇద్రీస్‌ల ఆధ్వర్యంలో ఎంపిటిసి సభ్యులతోపాటు జడ్పిటిసి సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, ఎంపిపిల పదవీకాలం ముగింపు నేపథ్యంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్, మాజీ ఎంఎల్‌ఏ చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు హాజరై వారిని సన్మానించారు. జడ్పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు ఐదేళ్ల కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఘనంగా సత్కరించడంతోపాటు మెమోంటోలను అందజేశారు. కార్యక్రమాల్లో ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్, మాజీ ఎంఎల్‌ఏ చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలను ఎంపిపిలు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కొత్తూరు జడ్పిటిసి ఎమ్మె శ్రీలత, ఫరూఖ్‌నగర్ జడ్పిటిసి సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రమదోపిడీకి గురవుతున్న ప్రభుత్వ ఆస్పత్రుల కార్మికులు

జిఒ 60 అమలు చేయాలి

ఎఐటియుసి ఆధ్వర్యంలో డిఎంఇ కార్యాలయం ఎదుట శానిటేషన్ పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల భారీ ధర్నా

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు జిఒ నంబర్ 60ని, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు రావాల్సిన జీతాలు సక్రమంగా చెల్లించడం లేదని, జిఒ నంబర్ 60ని టెండర్ షెడ్యూల్‌లో పెట్టి, దీనిని అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. సమస్యలను పరిష్కరించకపోతే రాబోవు రోజుల్లో సమ్మెకు కూడా వెళ్తామని హెచ్చరించారు. జిఒం నంబర్ 60ని, కాంట్రాక్ట్ కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు భారీ సంఖ్యలో హైదరాబాద్ కోఠిలోని డిఎంఇ కార్యాలయంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి యూసుఫ్, ఎం.నరసింహా లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కాంట్రాక్టర్ల కింద దాదాపు 20 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. 2022లో టెండర్ ఆహ్వానించిన సందర్భంలో జిఒ నంబర్ 60 ప్రకారం కార్మికులకు రూ.13,600 జీతం రావాల్సి ఉన్నదని, కానీ ప్రస్తుతం ఏ ఆసుపత్రిలో కూడా ఈ జీతాలు అమలు కావడం లేదని ఆరోపించారు. జిఒ నంబర్ 60ను అమలు చేయకుండా వేరొక సర్క్యులర్‌ను జారీ చేశారని, దీని ప్రకారం నిర్ణయించిన రూ.12 వేల వేతనాన్ని కూడా చెల్లించడం లేదని విమర్శించారు. గాంధీ ఉస్మానియా, నీలోఫర్ లాంటి పెద్ద ఆసుపత్రుల్లో పడకలకు సరిపడా కార్మికులను నియమించకుండా, తక్కువ మంది కార్మికులతో పని చేయించుకుంటున్నారని, తద్వారా ఉన్న కార్మికుల పై పని భారం పడుతుందన్నారు. టివివిపి ఆసుపత్రుల్లో స్థానిక డిసిహెచ్ఎస్‌ల కాంట్రాక్టర్లతో మిలాఖతై కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తూ, కనీస వేతనాలను కూడా అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు రూ.3200 పిఎఫ్ జమ చేయాల్సి ఉండగా కేవలం రూ.1500ల పిఎఫ్ మాత్రమే జమ చేస్తూ పిఎఫ్ డబ్బులను కూడా కాంట్రాక్టర్లు తింటున్నారన్నారు. ధర్నా అనంతరం డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎద్యుకేషన్, టివివిపి కమిషనర్‌కు కార్మికుల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శు పల్లా దేవేందర్‌రెడ్డి, ఓమయ్య, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు తోటా రామాంజనేయులు, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎం లక్ష్మీ బాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనాబేగం, రాష్ట్ర కార్యదర్శులు పి.సురేష్, ఎస్.కిష్టమ్మ, ఎఐటియుసి నాయకులు సిర్రా దేవేందర్, వినోద, జె.లక్ష్మి, సర్వేశ్వర్, మదన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాపక్షం/బాలానగర్ : గ్రామపంచాయితీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు బాలానగర్ మండలంలోని మన్నె గూడ తాండ, పెద్దబావి తండా గ్రామపంచాయితీల నూతన భవనాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామపంచాయితీ ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. గత ప్రభుత్వంలో అన్ని స్థాయిలలో అవినీతి అక్రమాలు జరిగాయని గ్రామాలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. గత ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి పనితీరులో చాలా తేడా ఉంటుందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని సామాన్యులకు న్యాయం చేయడానికి ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటామని తెలిపారు. త్వరలోనే బాలానగర్ నుండి గంగాపురం వరకు డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించబోతున్నామని, ఈ కార్యక్రమానికి రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. అలాగే బూర్గుల గ్రామం నుంచి హేమాజీపూర్ వయా లింగారం నుంచి పెద్దరేవల్లి గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కూడా చేపట్టబోతున్నట్లు తెలిపారు. ప్రజలు పాలకుల పనితీరును గమనిస్తున్నారని, తాము చేసే పని చెబుతాము తప్ప చేయని పనిని ఆర్భాటం చేసుకోమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయా గ్రామాల ఎంపిటిసి సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్ని వసతులు కల్పిస్తాం : ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి

ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల పట్టణ కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి సందర్శించిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆసుపత్రిలోని సిబ్బంది, విద్యుత్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించి మౌలిక వసతులపై ఆరా తీశారు. నిన్న, మొన్న ఆసుపత్రిలోని జరిగిన విద్యుత్ సమస్య వెంటనే పరిష్కరించాలని అధికారులకు నిర్దేశించారు. అదే విధంగా గతంలో జరిగిన తప్పిదాలు జురాయికొండ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలి అన్నారు. తొందర్లోనే నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా ఆసుపత్రికి కరెంటు సరఫరా చేసి మరల ఆసుపత్రిలో విద్యుత్ సమస్య రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : మహిళల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హన్వాడ మండలంలోని 14 గ్రామాలకు చెందిన 58 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందించి ఆయన మాట్లాడారు. మహిళల సంక్షేమానికి ఈ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అందులో భాగంగానే మహిళా సంఘాలకు పాఠశాలల నిర్వహణ మొదలు పాఠశాల భవనాల నిర్మాణాలను కూడా అప్పగిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకానికి పెళ్లి అయిన నెలలోపే అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోంటే సరిపోతుందని, ఎలాంటి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి వద్దు అని ఆయన హెచ్చరించారు. ఆడ కూతురు పెళ్లి చేసిన ఏ తల్లి దండ్రులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్రం ఎంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికి కళ్యాణలక్ష్మి షాదిముబారక్ పథకానికి ఏలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన చేసి, లబ్దిదారులందరికి కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను అందించడం జరిగిందని చెక్కులు తీసుకున్న అందరి పెదాలపై చిరునవ్వు కనిపిస్తుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం లో మాదిరిగా ,కాంగ్రెస్ ప్రభుత్వం లో ఎక్కడా కమీషన్ల సంస్కృతి లేదని ,ఏ సంక్షేమ పథకానికి చిల్లి గవ్వ ఏ అధికారికి ఏ నాయకుడికి ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు . అధికారం చేపట్టిన తొలి రోజే మేము పాలకులం కాదు సేవకులం అని గౌరవ ముఖ్యమంత్రి స్పష్టం చేశారు అని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు . మేము పేద బడుగు బలహీన వర్గాల వారికి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు . ఈకార్యక్రమంలో హన్వాడ మండల తాహసిల్దార్ కిష్టానాయక్, హన్వాడ ఎంపిటిసి యాదయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్, డిసిసి కార్యదర్శి టంకర కృష్ణయ్య, నాయకులు బి.సుధాకర్ రెడ్డి, మారేపల్లి సురేందర్ రెడ్డి, నవనీత, లింగం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ ప్రభుత్వమే

టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : రాష్ట్రంలో నిరుద్యోగుల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రభుత్వ శాఖల్లో నియామకాలు చేయలేదన్నారు. అప్పటి బీఆర్ఎస్, ఇప్పుడు బీజేపీ లీకేజీల ప్రభుత్వాలని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులను మోసం చేసినందుకే బీఆర్ఎస్ గత ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో 28,942 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. రెండు వారాల్లో జాబ్ క్యాలెండర్ విడుదలవుతుందని, నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సిజే బెనహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు అనేజ్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ బాలస్వామి పాల్గొన్నారు.

అయ్యప్ప సొసైటీలో వెలుస్తున్న భారీ అక్రమ నిర్మాణాలు

కోర్టు పరిధిలో ఉన్న బేకాతర్ అధికారులకు మామ్ముళ్ళు అందితే చాలు

చందానగర్ సర్కిల్‌లో టిపిఎస్ లేకపోవడం విడ్డూరం

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : చందానగర్ సర్కిల్ 21, మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో కోర్టు పరిధిలో ఉన్న స్థలంలో ఇష్టానుసారంగా భారీ స్థాయిలో అక్రమనిర్మాణాల జోరు ఉపందుకున్నాయని, చందానగర్ సర్కిల్ సిబ్బంది అక్రమనిర్మాణాదారులకు, అధికారులకు మధ్యన ఉండి లక్షలలో మామ్ము ళ్ళు అందుకుంటు కోట్లకు పడగలేత్తున్నారని వారి పైన ఎటువంటి చర్యలు ఉండవా, ఇప్పటికైన వారిపైన చర్యలు తీసుకొని అక్రమ నిర్మాణాలను అపాలని చందానగర్ సర్కిల్ వాసులు, మాదాపూర్ డివిజన్ వాసులు వాపోతున్నారు. చందానగర్ సర్కిల్‌లో 4గురు టిపిఎస్‌లు ఉండాల్సి ఉండగా సంవత్సరాలుగా ఓక టౌన్ ప్లానింగ్ అధికారి కూడ లేకపోవడం విడ్డురమైతే చందానగర్ డిప్యూటీ కమీషనర్, ఎసిపిలు అందినకాడికి లక్షలలో అందుకొని చందానగర్ సర్కిల్‌ను భ్రష్టు పట్టిస్తున్నారని, శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ ఉన్న అతను ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదని చందానగర్ సర్కిల్ వాసులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిహెచ్‌యంసి కమీషనర్ చందానగర్ సర్కిల్‌లో ఏం జరుగుతుందో పట్టించుకోవాలని డి మాండ్ చేస్తున్నారు. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా, చందానాయక్ తాండా లలో అకాశాన్ని అందుకునే విధంగా ఎన్ని అంతస్థులైన నిర్మించిన జోనల్ స్థాయి అధికారులు ఉన్న అటు వైపు కన్నేత్తి చూడకపోవడం హాస్యాస్పదంగా ఉందని అనుమతులు లేకుండా జి+5, జి+6, జి+7 అంతస్థుల అక్రమ నిర్మాణాలను చెపడుతున్నారని, పార్కు స్థలం కబ్జా చేసి భారీ అక్రమ నిర్మాణం చెపట్టిన తూతూ మం త్రంగా కూల్చి, అతరువాత వారికి దాసోమైనారని ఏన్ని సార్లు అధికారులకు ఫిర్యాధు చేసిన పట్టించుకొనే నాథుడే లేడని మాదాపూర్ డివిజన్ వాసులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల ఏన్నో సమస్యలు తలేత్తుతున్న , స్థానికులు ఏన్ని ఫిర్యాదులు చేసిన అక్రమనిర్మాణాదారులు అధికారులకు లక్షలలో మామ్ముళ్ళు అందిస్తూ తమ పని కానిస్తున్నారని, మామ్ముళ్ళు అందని నిర్మాణాలను కూల్చుతూ మామ్ముళ్ళు అందించిన నిర్మాణాదాలకు అందలం వేస్తున్నారన్నారు. మేము మీకు అండగా ఉన్నాము ఫిర్యాదులు వచ్చిన మేమే దగ్గర ఉండి పర్యవేక్షించాలి కాబట్టి మీకు ఏటువంటి బయం లేదని కింది స్థాయి సిబ్బంది హమిలు ఇస్తుండడంతో అక్రమనిర్మాణాదారుల అగాడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని న, ఇప్పటికైన అధికారుల పైన, కింది స్థాయి సిబ్బంది పైన కఠిన చర్యలు తీసుకొని లంచాల చందానగర్ సర్కిల్‌ను కాపాడాలని శేరిలింగంపల్లి జోనల్,చందానగర్ సర్కిల్ వాసులు కోరుచున్నారు. సామాన్యుడు ఇల్లు కట్టుకొవాలటే ఏన్నో రూల్స్ పెట్టి వారిని నానా హింస పేట్టే అధికారులకు మాత్రం ఏటువంటి అనుమతులు లేకుండా జి+5,జి+6,జి+7 స్థాయిలలో భారీ అక్రమ నిర్మాణాలతో పాటు అక్రమ షేడ్లను నిర్మిస్తూన్న వారికి కనిపించడం లేదా అని ప్రజలు పశ్నిస్తున్నారు. కొంత మంది దాళరులు సైతం మధ్యవర్తం చేస్తు అక్రమ నిర్మాణాదారులు వద్ద 10లక్షల నుండి 15 లక్షల వరకు వస్సూళ్ళు చేస్తు వాటాలుగా అధికారులకు అందిస్తున్నారని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై కఠినంగా ఉండే విధంగా కోత్త చట్టం తీసుకొచ్చిన దానిని సైతం అధికారులు తమకు అనుకులంగా మార్చకున్నారని అక్రమ నిర్మాణాలపై కోరడా ఘులిపించాలని సపరేట్ డేమాలేషన్ స్కాడ్ ఏర్పాటు చేసిన వారికి సైతం ముడుపులు అందిస్తుండడంతో అక్రమ నిర్మాణాలపై ఎటువంటి చర్యలు చేపట్టలేకపోతున్నారని అధికారులపై స్థానికులు ఆగ్రహం తెలుపుచున్నారు. స్థానిక ప్రజాపథినిధులు కూడ అక్రమ నిర్మాణాదారులకు అండగా ఉంటుండడంతో అక్రమనిర్మాణాదారులు మరిం త రేచ్చిపోయి అక్రమనిర్మాణాలు చేపడుతున్నారని ఇప్పటికైన జోనల్ అధికారులు, సర్కి ల్ అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణాలపై కోరడా ఘులిపించాలని ప్రజలు కోరుకోనుచున్నారు.

విద్యుత్ అంతరాయాలకు చెక్

ఆధునిక సాంకేతికత వినియోగం

ఈ విషయంలో టిజి ఎస్‌పిడిసిఎల్ ముందుంజ

మరింతగా ఉపయోగిస్తూ ముందుకు సాగుతాం : సిఎండి ముషారఫ్ ఫారూఖీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో త్వరలోనే బోనాల పండుగ రానున్న నేపథ్యంలో వినియోగదారులకు మరింతగా దగ్గర అయ్యేందుకు విద్యుత్ శాఖ చర్యలు తీసుకుంటోంది. విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కారణమవుతున్న సమస్యలను ముందే గుర్తించి వాటిని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి టిజి ఎస్‌పిడిసిఎల్ సంస్థ యాజమాన్యం మరో అడుగు ముందుకు వేస్తోంది. మెరుగైన సేవల కోసం ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటోంది. ఇందులో భాగంగా విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఉన్న ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడంలో జోరుగా ముందుకు సాగుతోంది. టిజి ఎస్‌పిడిసిఎల్ సిఎండిగా ముషారఫ్ ఫారుఖీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆధునిక సాంకేతిక పరంగా ఉన్న అవకాశాలన్నింటినీ ఉపయోగించుకుంటున్నారు. మరీ ముఖ్యంగా అత్యాధునిక థర్మల్ విజన్ కెమెరాలతో ముందుకు వెళ్తోంది. టిజి ఎస్‌పిడిసిఎల్ యాజమాన్యం ఇటీవల 35 అత్యాధునిక థర్మో విజన్ కెమెరాలను కొనుగోలు చేసింది. వీటిని కూడా జిహెచ్‌ఎంసి పరిధిలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్లకు పంపిణీ చేశారు. ఈ అధునాతన కెమెరాలు సాధారణంగా రెడ్ హాట్స్ అని పిలువబడే లూజ్ కాంటాక్ట్స్‌ను గర్తించడానికి ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి ప్రధానంగా ఓవర్ హెడ్ లైన్లను లగ్‌లు, బ్రేకర్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు , అలాగే క్లాంప్‌లను వదులుగా ఉండే పరియాయాలను సూచి స్థాయి వంటి సమస్యలను ముందుగాను గుర్తించడం ద్వారా సమస్యను ముందుగానే అందుకు అనుగుణంగా షెడ్యూల్ చేసుకుని విద్యుత్ సమస్య రాకుండా చేయవచ్చు. ఈ పరికరాలు లేకుండా ఉదయం వేళల్లో రెడ్ హాట్‌లను గుర్తించడం సాధ్యం కాదు. ఈ పరికరాలు సమస్యను త్వరితగతిన గుర్తించనున్నాయి. దీంతో సమయానుకూలంగా చర్యలు తీసుకుని ఊహించనివ విద్యుత్ అంతరాయాల ప్రమాదాన్ని సమర్ధవంతంగా తగ్గించడం వల్ల విద్యుత్ పంపిణీ నెట్ వర్క్ విశ్వసనీయత మరింత పెరగడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే తెలంగాణ విద్యుత్ సంస్థలు విద్యుత్ వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్తును అందిస్తు అందరి మన్ననలను పొందుతున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ వినియోగదారులకు మరిన్ని సేవలను అందించడానికి కొత్త సిఎండిగా ముషారఫ్ ఫరూఖీ బాధ్యతలు తీసుకున్న తర్వాత అధునిక సాంకేతికతను మరింతగా ఉపయోగిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని మరిన్ని సేవలు అందిచాలని ఈ సందర్భంగా సిఎండి ముషారఫ్ ఫరూఖీ విద్యుత్ అధికారులకు తెలిపారు.

డ్రోన్‌పైలట్ శిక్షణలకు ప్రభుత్వసహకారం

మంత్రి జూపల్లికృష్ణారావు

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : డ్రోన్‌పైలట్ శిక్షణ తీసుకున్న యువ మహిళా నిరుద్యోగులకు ప్రభుత్వసహకారం అందేలా కృషిచేస్తామని టూరిజంఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. రత్నగిరిఫౌండేషన్ కన్వీనర్ కేతూరిధర్మతేజ అధ్యక్షతన రత్నగిరిఫౌండేషన్ ఆధ్వర్యంలో తార యుఎవి సహకారంతో హైదరాబాద్‌లో 13రోజులు డ్రోన్, డ్రోన్‌డేటా ప్రాసెసింగ్, జిఐఎస్ మ్యాపింగ్, డిజిపిస్‌ల కోర్సులలో శిక్షణతీసుకున్న కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన 20మంది యువ విద్యార్థినిలకు హైదరాబాద్ రవీంద్రభారతిలోని చాంబర్‌లో డ్రోన్‌లైసెన్స్ సర్టిఫికెట్‌లను పంపిణీచేశారు. యువతమారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నికల్ రంగాలవైపు నైపుణ్యంసాధించి ఉన్నతమైన శిఖరాలకు చేరాలని కోరారు.

అభివృద్ధి ప్రదాత ఎంపిపి కిచ్చారెడ్డి

ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : వనపర్తి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చి సమస్యలు లేని గ్రామాలుగా ఎంపీపీ కిచ్చారెడ్డి తీర్చిదిద్దారని కాంగ్రెస్ నేతలు మాజీ కౌన్సిలర్ చుక్క రాజు, మలిదశ ఉద్యమకారుడు కాంగ్రెస్ నాయకులు బోయ మురళి అన్నారు. నేటితో పదవీ కాలం ముగిస్తుండటంతో ఆయన చాంబర్‌లో కిచ్చారెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి ప్రాధాన్య కల్పించిన ఎంపీపీ ఐదేళ్ల పదవీ కాలంలో అభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. ప్రతి గ్రామంలో సిసి రహదారులు , డ్రైనేజీ వ్యవస్థ తాగునీటి సరఫరా బోర్ల ఏర్పాటు వంటి మౌళిక వసతులు కలపడంలో నిరంతరం కిచ్చారెడ్డి కృషి చేశారని ఆయన సేవలకు ప్రజల తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమయ్యే ఎంపీపీ రాబోవు రోజులలో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజల సేవకు అంకితం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రంలో మెగారెడ్డి, యువ సైన్యం, వంశమౌని మోహన్ , ఆర్.టి. కిరణ్ , పోలేపల్లి మోహన్ రాజ్ , ఏటిఎం మహేందర్ , సుగూరు భాస్కర్ , ప్రవీణ్ , బీసన్న, చుక్క చింటూ , కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొలచింతలపల్లిని సందర్శించిన కలెక్టర్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని మొలచింతలపల్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ బుధవారం బాధిత మహిళ ఈశ్వరమ్మ ఇంటికివెళ్లి బాధిత ఆదివాసి మహిళ ఈశ్వర్మ ఆరోగ్యవివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొంది ఆమె ఇంటికివచ్చిన సందర్భంగా కుటుంబసభ్యుల వివరాలను పిల్లలచదువు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. 5లక్షల రూపాయలతో ఇంటినిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లుచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయభూమిసాగుచేసేలా నీటి అవసరాలను తీర్చేలాచూడాలని సూచించారు. అనంతరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలలో అమ్మ ఆదర్శపాఠశాల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, కాంపౌండ్‌వాల్ పనులను వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులు పెండింగ్‌లేకుండా వెంటనే పూర్తిచేయించుకోవాలని హెడ్మాస్టర్‌కు సూచించారు. పనులకు ఎలాంటి నిధుల కొరతలేదని స్పష్టం చేశారు. పాఠశాలలో హాజరుశాతాన్ని విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. మొలచింతలపల్లి గ్రామంలోని భ్రమరాంబకాలనీని సందర్శించారు. నివాసముంటున్న చెంచుప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆధార్‌కార్డులేని చెంచులకు కొత్త ఆధార్ కార్డు అందించేందుకు గ్రామంలో ఆధార్‌కేంద్రాన్ని ఏర్పాటుచేయడం జరిగిందని చెంచులందరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆధార్‌కార్డు పొందాలని సూచించారు. కొత్తరేషన్‌కార్డులు ప్రభుత్వం మంజూరుచేసినవెంటనే అందజేస్తామన్నారు. కలెక్టర్‌వెంట జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి, జిల్లాగిరిజన సంక్షేమశాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, కొల్లాపూర్ ఆర్‌డిఓ నాగరాజు, సమగ్రశిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, కొల్లాపూర్ తహసీల్దార్ శ్రీకాంత్, వివిధశాఖల అధికారులు ఉన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం : డిఇఓ

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ జిల్లాలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2024కు పది సంవత్సరాలకాలం సర్వీస్‌పూర్తి చేసుకొని అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 15లోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని డిఇఓ గోవిందరాజులు బుధవారం తెలిపారు. రెండుకాపీలను సంబంధిత మండలవిద్యాశాఖ అధికారి ధృవీకరణతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలన్నారు. ప్రభుత్వ యాజమాన్యాలపరిధి ప్రాథమిక, యుపిఎస్, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతోపాటు కేంద్రప్రభుత్వ పరిధిలోని కేంద్రీయ, జవహర్‌నవోదయ, సైనిక్‌స్కూల్, ఆటమిక్‌ఎనర్జీ ఎడ్యూకేషన్‌సొసైటి, ఏకలవ్యమోడల్, ఆశ్రమసెంట్రల్‌బోర్డు సెకండరి ఎడ్యూకేషన్‌చే అఫిలియేషన్ పొందిన సంస్థలు, ఇండియన్‌స్కూల్ సర్టిఫికెట్ పొందిన పాఠశాలల ఉపాధ్యాయులు అర్హులన్నారు. ఈనెల 15వతేదిలోగా ఆన్‌లైన్ http.nationalawardsteachers.education. gov.in వ్యక్తిగతంగా అప్‌లోడ్ చేసుకొనిచూడాలని సూచించారు.

పారిశుధ్య పనులు ఆకస్మిక తనిఖీ

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట

ప్రజాపక్షం/హైదరాబాద్ : పారిశుధ్య పనులను జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమే స్వయంగా పరిశీలించారు. నారాయణగూడ క్రాస్ రోడ్ వద్ద నిర్మించిన మార్కెట్ గదులను కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ ఎన్. రవికిరణ్‌కు సూచించారు. శంకర్ మట్ వద్ద రాంకీ ఆర్‌ఎఫ్‌సి వెహికిల్ డ్రైవర్‌తో కమిషనర్ మాట్లాడి చెత్త తరలింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ విద్యార్థినితో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించే విధంగా తోటి విద్యార్థులకు అవగాహన కల్పించి, స్వచ్ఛ హైదరాబాద్ సాధనకు కృషి చేసే విధంగా ప్రయత్నించాలని కోరారు. అలాగే పారిశుధ్య పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు.

జిహెచ్‌ఎంసి సాధారణ సమావేశానికి పూర్తి సమాచారంతో సిద్ధం కావాలి

ఈనెల 6న నిర్వహించనున్న 9వ పాలకమండలి సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయా విభాగాల అధికారులు పూర్తి సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట సంబంధిత అధికారులకు సూచించారు. కమిషనర్ తన ఛాంబర్‌లో బుధవారం వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి, స్థాయిసంఘం, పాలకమండలి సాధారణ సర్వసభ్య సమావేశం ఎజెండా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకమండలి సమావేశంలో ప్రశ్నలు, జవాబులకు సంబంధించి సంబంధిత విభాగాల అధికారులు సమగ్ర వివరణ ఇచ్చేలా సిద్ధం ఉండాలన్నారు. సమావేశానికి పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు. పాలకమండలి సమావేశం సాఫీగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా విభాగాలకు సంబంధించిన పలు అంశాలపై ఆమె చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సి) జియా ఉద్దీన్, చీఫ్ ఇంజనీర్(ప్రాజెక్ట్స్) దేవానంద్, చీఫ్ ఇంజనీర్ కోటేశ్వర రావు, అదనపు కమిషనర్ కె. శ్రీవాత్సవ, స్నేహ శబరీష్, శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, యాదగిరి రావు, సునంద రాణి, చీఫ్ సిటీప్లానర్ రాజేంద్ర ప్రసాద్ నాయక్, సిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమలాజిస్ట్ డాక్టర్ రాంబాబు, చీఫ్ వెటర్నరి ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వకీల్, తదితరులు హాజరయ్యారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాపక్షం/మహ్మదాబాద్ : మహ్మదాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయం ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తుల సవరణ తీరు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రద్దీ తగ్గించేందుకు అదనపు కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పెండింగ్ దరఖాస్తుల పై సమీక్షించారు. 21 దరఖాస్తులు పెండింగ్ లో నున్నట్లు, వాటిని త్వరితంగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీ చేశారు. పాఠశాల 10 వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి పరీక్షలలో మంచి మార్కుల తో ఉత్తీర్ణులు కావాలని కలెక్టర్ ఉద్బోదించారు. పాఠశాల ఆవరణ లో పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహశీల్దార్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో చోరీ

ప్రజాపక్షం/కల్వకుర్తి : పట్టణంలోని విద్యానగర్‌కాలనీలో నివాసముంటున్న వెంకటేశ్వరరావు ఇంట్లోగుర్తు తెలియని వ్యక్తులు తాళాలుపగులకొట్టి చోరీకి పాల్పడటం జరిగిందని వెంకటేశ్వరరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఈచోరీలో లక్షరూపాయలనగదు, మూడున్నరతులాల బంగారం, కిలోవెండి దొంగిలించారని అన్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వెంకటేశ్వరరావు ఆదివారం మధ్యాహ్నం మహబూబ్‌నగర్‌లో గల తనకుమార్తె దగ్గరికివెళ్లి తిరిగి మంగళవారం రాత్రివచ్చి ఇంటిని చూసుకోగా ఎవరో గుర్తుతెలియని దొంగలుతాళంపగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారన్నారు. ఇంట్లోగల బీరువాలోని ఒక లక్షాఇరవైవేల రూపాయలనగదు, మూడున్నర తులాలబంగారం , ఒకకిలోవెండి వస్తువులు దొంగిలించారని ఫిర్యాదుపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. క్లూస్‌టీంవారు వచ్చి సాక్ష్యాలను సేకరించారని తెలిపారు.

మిస్టర్ టీస్టాల్‌ను ప్రారంభించిన మాజీసర్పంచ్

ప్రజాపక్షం/కల్వకుర్తి : పట్టణంలోని హైదరాబాద్‌చౌరస్తాలో జిల్లెల్ల గ్రామానికిచెందిన యువకులు మహేష్, మధులు ఏర్పాటుచేసిన మిస్టర్‌టీస్టాల్‌ను మాజీసర్పంచ్ జిల్లెల్లరాములుతో కలిసికాంగ్రెస్‌పార్టీ రాష్ట్రనాయకులు మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు స్వశక్తితో ఏదో ఒకవ్యాపారం చేసుకొని రాణించి ఆర్థికంగా ఎదగాలనికోరుతూ టీస్టాల్ ఏర్పాటుచేసినవారికి అభినందనలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోరేటిశ్రీనివాస్, సాక్షిరవి గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎముక మహేష్, రాము,శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

ఆరు బయటనే విద్యార్థులు

ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు మండలం కొత్త సూగురు (హరిజనవాద) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా వారిద్దరూ బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో ఉపాధ్యాయులు ఎవ్వరు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల గదులు తెరవకపోవడంతో విద్యార్థులు ఆరుబయటనే కూర్చున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు సమావేశం

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎంపిపిఎస్ స్కూల్‌లో పదోన్నతులు ,పదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు పలికిన ఉపాధ్యాయులు,విద్యార్థులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శుభాకంక్షాలు తెలిపారు. బదిలీలో భాగంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు విద్యార్థులు ఘణ స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వీరేశం, అమ్మ అదర్శ పాఠశాల చైర్పర్సన్ విజయలక్ష్మి , పదోన్నతి పొందిన తుప్పలి అనంద్ కుమార్, నసీం సుల్తానా, పద్మ , శ్రీనివాస్‌రెడ్డి, సరస్వతి, బదిలీలపై పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయురాలు,తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో అంగన్వాడీలలో అందిస్తున్న పౌష్టిక ఆహారం,పూర్వ ప్రాథమిక పాఠశాలలో చిన్న పిల్లలకు భోదించే పాఠ్యప్రణాళిక, అటపాటలపై సిడిపిఓలు , సూపర్వైజర్లతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో కలిసి ప్రత్యేక కార్యదర్శి వాకటి కరణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలలో గతంలో మాదిరిగా కాకుండా పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా పిల్లలకు ఆటలు పాటలతో పాటు ప్రాథమిక విద్యాగా బోధనలు గావించాలన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల వయో వృద్దుల సంక్షేమ శాఖ శైలజ , తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు నిదర్శం నేతాజీ హై స్కూల్

ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాలలో నాణ్యమైన విద్యకు పేరు ప్రఖ్యాతలకు నిదర్శంగా నిలుస్తుంది కుత్బుల్లాపూర్ సుభాష్ నగర్ భాగ్యలక్ష్మి కాలనీలోని నేతాజీ హై స్కూల్ అన్ని పాఠశాలల్లో కన్నా చదువులలో భిన్నంగా ముందుకు దూసుకుపోతూ శభాష్ అనిపించుకున్న రీతిలో ముందుకు వెళుతుంది. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షలలో ఘనమైన ఉత్తీర్ణత పాఠశాల విద్యార్థులు సాధించారు. నేతాజీ హై స్కూల్ ప్రిన్సిపల్ సిహెచ్ మహేష్ కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి వివిధ సైన్స్ ఫెయిర్లు నిర్వహించి వారి నైపుణ్యాన్ని వెలికితీస్తున్నామన్నారు. అన్ని వర్గాల వారికి ఆధునిక విద్యను అందించి ఏకైక స్కూల్ నే తాజీ హైస్కూల్ అని అందరికీ విద్యను అందించడమే తమ లక్ష్యమన్నారు.

పాఠశాలను సందర్శించిన కార్పొరేటర్

ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగ ర్ ప్రభుత్వ పాఠశాలలో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ బుధవారం పాఠశాలలోని మౌలిక సదుపాయాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్కూల్ ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, ఆటస్థలం తదితర అంశాలపై ఆయన చర్చించారు. అనంతరం కార్పొరేటర్ జగన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం తాను కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ గౌడ్, ప్రకాష్, నరసయ్య, విటల్ ముదిరాజ్, సిహెచ్ దాసు, ఖలీల్, ఖాయం, గోవర్ధన్, ఉపాధ్యాయులు, మైపాల్, చంద్రకళ, శైలజ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఎకు వినతి



ప్రజాపక్షం/చర్లపల్లి : కుషాయిగూడలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఎకు వినతి పత్రం అందజేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో డ్రైనేజీ,రోడ్ల సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డికి కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,సిసి రోడ్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.సానుకూలంగా స్పందించిన ఎంఎల్ఏ కుషాయిగూడలో సమస్యలు పరిష్కరించి అన్ని విధాలుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,చక్రపాణిగౌడ్,శివగౌడ్,బాబుగౌడ్,దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నీరు సక్రమంగా అందించాలి



ప్రజాపక్షం/మల్కాజిగిరి: మంచి నీటి సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి జలమండలి అధికారులకు సూచించా రు. గౌతం నగర్ డివిజన్ పరిధిలోని న్యూ వెంకటేశ్వరనగర్, ఇందిరానగర్, నెహ్రూనగర్, గోపాల్‌నగర్,మల్లికార్జున నగర్ ప్రాంతాల్లో మంచి నీటి సమస్య అధికంగా ఉన్న విషయాన్ని స్థానికుల ద్వారా తెల్సుకొన్నారు. దీంతో ఆయన బుధవారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్‌తో కలిసి మారేడ్‌పల్లి జలమండలి డిజిఎం కృష్ణ, మేనేజర్ స్రవంతిలను కలిసి మంచి నీటి సమస్య ఎదురవుతున్న ప్రాంతాల గురించి చర్చించారు. ఇక ముందు ఇలాంటి సమస్య తలెత్తకుండా సరైన ప్రెషర్‌తో తగినంత సమయం పాటు మంచి నీరు సరఫరా చేయాలని ఎమ్మెల్యే కోరారు. స్థానిక పార్టీ నేతలు సిద్ది రాములు, బైరు అనీల్, కాటంరాజు, నందు, పరమేష్, తదితరులు వారి వెంట ఉన్నారు.

మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యం



ప్రజాపక్షం/ నిజాంపేట్ : కాలనీల్లో మౌలిక వసతులను కల్పించడమే తన లక్ష్యమని 18వ డివిజన్ కార్పొరేటర్ కొలను వీరెందర్ రెడ్డి అన్నా రు. ని జాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి 18వ డివిజన్ సా యి అనురాగ్ కాలనీ, కావ్య ఏవెన్యూ కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు పనులను కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కాలనీలో పాదయాత్ర చేసి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరెందర్ రెడ్డి మాట్లాడుతూ సాయి అనురాగ్ కాలనీ, కావ్య ఏవెన్యూ, రేణుక ఎల్లమ్మ కాలనీ తదితర కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు, తాగు నీరు వంటి సదుపాయాలను పూర్తి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలి



ప్రజాపక్షం/నిజాంపేట్ : ప్రతిఒక్కరు మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంచాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ కైసర్ నగర్, బతుకమ్మ బండ, దేవేందర్ నగర్ తదితర ప్రాంతాల్లో జన్ సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నుండి జన్మదినం వరకు మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాకుండా బాధ్యతగా పెంచాలని అప్పుడే పచ్చదనం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయినాథ్ నేత, రేవతి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ రావు, బాలకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ వీడ్కోలు



ప్రజాపక్షం/మోమిన్‌పేట్ : మండల పరిషత్ ఐదు సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసిన సందర్భంగా మండల పరిషత్ అత్మీయ వీడ్కోలు సన్మానోత్సవాన్ని ఎంపీపీ వసంత వెంకట్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. బుధవారం బికేఆర్ ఫంక్షన్ హాల్‌లో మోమిన్‌పేట్ లో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి ప్రజలకు మండల స్థాయి అధికారుల సహకారంతో మండలన్ని ఎంతో ముందుకు సాగించామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి , వైస్ఎంపీపీ మానస , తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవం

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ
స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ప్రజాపక్షం/ కోట్‌పల్లి : కోట్‌పల్లి నూతన మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవం బుధవారం డిఎంఆర్ పంక్షన్ హాల్‌లో హట్టహాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతితులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహార్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ మహెందర్‌రెడ్డిలు హాజరైయ్యారు. కోట్‌పల్లి నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గడ్డకింది అంజయ్య ప్ర మాణ స్వీకారోత్సవం చేయగా వైస్ చైర్మన్‌గా నారాయణరెడ్డితో పాటుగా 12 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశా రు. ఈ సందర్భంగా ముఖ్యఅథితులుగా హాజరైన గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అనేక విధాలుగా అభివృద్ధిని చేస్తుందని , రైతులకు అందుబాటులో రైతు వేధికలను ఏర్పాటు చేసి రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందని అన్నారు. త్వరలోనే రైతు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం సన్నహాలు చేస్తుందన్నారు. పేదింటి ఆడపిల్లలకు న్యాయం చేసేందుకు వీలు గా కల్యాణలక్ష్మీ , ష్యాదిముభారక్ చెక్కులను పంపిణీ చే స్తుందని అందులో భాగంగా కోట్‌పల్లి మండలంలోని ఆ యా గ్రామాలకు సంబంది 58 మంది లబ్దిదారులకు క ల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు నక్కల విజయలక్ష్మీ , జ్ఞానేశ్వర్, బాలమణజసదానందం, శివనందం, నాయకులు నక్కల బందె య్య, దినేష్‌కుమార్, సతీష్‌కుమార్, మల్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కెసిఆర్ ఆశీర్వాదంతోనే మేడ్చల్ అభివృద్ధి

సన్మానించిన మాజీ మంత్రి మల్లారెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట : తెలంగాణ మాజి సిఎం కేసిఆర్ ఆశీర్వాదంతోనే మేడ్చల్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచామని మాజీ మంత్రి, మేడ్చల్ ఎంఎల్ఏ చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రాదేశిక సభ్యుల పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి ఎల్లుబాయిబాబు, జడ్పిటిసి అనితలాలి, మండల ప్రాదేశిక సభ్యులు, కోఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ శామీర్‌పేట ఎంపిపి ఎల్లుబాయిబాబు, జడ్పిటిసి అనితలాలి ఇద్దరు పోటాపోటీగా శామీర్‌పేట మండలాన్ని అన్ని విదాలుగా అభివృద్ధి పరిచారన్నారు. ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజిలు, కమ్యూనిటి భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పాఠశాలల భవనాలను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. మండలంలోని ఎంపిటిసిలు అందరూ సమిష్టిగా కృషి చేసి వారికి వచ్చిన నిధులను అన్ని గ్రామాల్లో సమానంగా మంజూరు చేసి ఆదర్శంగా నిలిచారని అన్నారు. తెలంగాణలోనే నెంబర్‌వన్ జిల్లాగా మేడ్చల్ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, కార్యదర్శులు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వ్ ఫారెస్ట్ అసైన్‌మెంట్ భూముల రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయాలి



ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ రెవెన్యూ పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్, అసైన్‌మెంట్ భూముల అక్రమ రిజిస్రేషన్‌లను వెంటనే నిలిపివేయాలని లక్ష్మాపూర్ గ్రామరైతులు సింగం రాజు తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్మాపూర్‌లో రెవెన్యూ రీసర్వే ప్రకారం సర్వే నెంబర్ 661/122 పాత సర్వే నెంబర్ 120/22లో రిజర్వ్ ఫారెస్ట్, అసైన్‌మెంట్ భూము లు విస్తీర్ణం 4.31 ఎకరాలు ఉందని చెప్పారు. రిజర్వు ఫారెస్ట్, అసైన్‌మెంట్ భూముల్లో గతంలో కొందరి వ్యక్తులకు సర్టిఫికెట్‌లను ఇచ్చారని అన్నారు. కాగా వీరు ఆ గ్రా మం నుంచి బతుకుదెరువు నిమిత్తం వెళ్లిపోయారని, ఇట్టి భూమిని ఇతరులు కబ్జాలోకి తీసుకోవడం జరిగిందన్నారు. మ రోక చోట ఉన్న పట్టాభూమి నెంబర్‌ను తీసుకవచ్చి ఈ భూములపై రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారని ఆరోపించారు. కొందరు అక్రమార్కులు రాజకీయ అండదండలతో ధరణి సహాయంతో తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారని పేర్కొన్నారు. రిజర్వు ఫారెస్ట్, అసైన్‌మెంట్ భూములు అక్రమణకు గురైతున్నాయని వాపోయారు. ఈ భూములకు వాడి న సర్వేనెంబర్ లలోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తహాశీల్దార్ వెంటనే స్పందించి అక్రమ రిజిస్ట్రేషన్‌లను నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శవంతంగా పనిచేయాలి

తాండూరు ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరు : అంగన్‌వాడి కేంద్రాలు ఆదర్శవంతమైన సేవలు అందించాలని తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహార్‌రెడ్డి అన్నారు. బుదవారం తాండూరు పట్టణంలోని 20వ వార్డులో ఏర్పాటు చేసిన అంగన్ వాడి భవనం, ద్వాక్రా భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ చిన్నారులకు, గర్భిణి మహిళలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంతో పాటు చదువుపై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, కౌన్సిలర్ బోంబినా, మున్సిపల్ కమీషనర్ విక్రమ్‌సింహారెడ్డి, కౌన్సిలర్‌లు ప్రభాకర్‌గౌడ్, పట్లోళ్ల నీరాజబాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా బుధవారం తాండూరు పట్టణ పరిధి 14వ వార్డులో అంబేడ్కర్ పార్కులో ఎస్సీ కార్పోరేషన్, సూర్తి రూరల్ డెవలప్మెంట్ అర్గనైజే షన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ల పంపిణి కార్యక్రమానికి ఎంఎల్ఏ ముఖ్యఅథితిగా హాజరైనారు. ఈ సందర్బంగా శిక్షణ పూర్తి చేసుకున్న 60మంది మహిళలకు ఉచితి కుట్టు మిషన్ల, సర్టిఫికట్లను పంపిణి చేశారు.

జవహర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

ప్రజాపక్షం/మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సిహెచ్ నారాయణ, ఉపాధ్యక్షుడిగా కాశిరెడ్డి, కార్యదర్శిగా జాన్, కోశాధికారిగా ముత్యంరెడ్డి, సభ్యులుగా పద్మావతి, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులు బుధవారం స్థానికులు అన్నపూర్ణ, మాధవి, అంజు బాయ్, లక్ష్మీ నరసమ్మలతో కల్సి స్థానిక కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్‌ను కలిసి తమ ప్రాంత సమస్యలను పరిష్కరించాలని కోరారు.

టౌన్‌ప్లానింగ్ ఎసిపిపై ఉప్పల్ ఎమ్మెల్యే ఆగ్రహం

అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తున్నావన్న ఆరోపణ

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: నిబంధనలకు విరుద్దంగా ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదంటూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. బుధవారం ఉప్పల్‌లోని జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయానికి వెళ్లి ఎసిపి వెంకటరమణను ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్దంగా కొనసాగుతున్న నిర్మాణాలు చేస్తున్న యజమానుల నుండి లంచాలు తీసుకొంటూ సహకారం అందిస్తున్నావంటూ నిలదీసారు. అదే పేద కుటుంబాలు చేసుకొనే నిర్మాణాలు మాత్రం చిన్నాచితకా కారణాలతో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇలాంటి పనులు చేయటం వల్ల జిహెచ్ఎంసికి వచ్చే ఆదాయాన్ని కొల్లగొట్టమేనన్నారు. ఇక ముందైనా నిబందనలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తూ జిహెచ్ఎంసికి ఆదాయ వనరులను పెంచాలే తప్ప లంచాలు తీసుకొంటూ ఆదాయాన్ని నష్టపరచ వద్దని ఎమ్మెల్యే హితవు పలికారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలి



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఎక్సైజ్, విద్యాశాఖ, రెవెన్యూ , అగ్రికల్చర్ ,పోలీస్ ,వివిధ శాఖల అధికారులతో మత్తు పదార్థాల నివారణ, పండించడం రవాణాపై తీసుకోవాల్సిన నిర్ణయాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్ ఈ సందర్భంగా మాట్టాడుతూ జిల్లాలో పూర్తిగా మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు అని శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు వేళ్లని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల నందు ఆంతీ డ్రగ్ కమీటిలను ఏర్పాటు చేసి విద్యార్థులలో మత్తు పదార్థాలపై , వాటి వల్ల కలుగు అనర్థాలపై అవగాహనను కల్పించాలని ,ప్రతి ఇంటీ డ్రక్స్ కమీటిల నందు పోలీస్‌లు,విద్యార్థులు ఉపాధ్యాయులు ,వారి తల్లి దండ్రుల భాగస్వామ్యంతో ఐదుగురికి తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి నిర్ములనకై ప్రత్యేకంగా ర్యాలీలు వ్యాసరచన పోటీలు డాన్స్ పోటీలు నిర్వహించాలని డ్రాక్స్‌పై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయి వినియోగదరులకు కౌన్సిలింగ్ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. సమజంలో ,విద్యాసంస్థల నందు , మత్తు పదార్థాలపై ఎటువంటి సమాచారం ఉన్న పోలీసులకు అధికారులకు తెలుపాలని సూచించారు. గ్రామాలను గంజాయి విక్రయదారుల ఆశాలో పడి రైతులు గంజాయిని పండించినట్లుయితే ,వికారాబాద్ జిల్లాలో గంజాయిని తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వాటిని అడ్డుకునేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీస్‌లు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులను చైతన్య పరిచడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అడవిశాఖ అధికారి జ్ఞానేశ్వర్, డిప్యూటి డిఎం జీవరాజ్ , అబ్కారి శాఖ జిల్లా అధికారి శ్రీనివస్‌రెడ్డి , సిఐ వెంకటేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వలేదని శిలాఫలకం ధ్వంసం

ప్రజాపక్షం/నవాబుపేట్ : అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ అసమతి వర్గంకు సమాచారం ఇవ్వలేదని ఆగ్రహంతో శిలాఫలకలను ధ్వంసం చేసిన సంఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం నవాబ్ పేట్ మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్యఅతిథిగా హాజరై హెచ్ఎండిఏ రూ. 40 లక్షలకు సంబంధించిన ప్రారంభ,శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలో కాంగ్రెస్ మండలా నాయకులకు స్వగ్రామ మాజీ సర్పంచ్ కి సమాచారం ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహంతో కాంగ్రెస్ అసమతి వర్గం మూడు శిలాఫలకలను ధ్వంసం చేశారాని చెప్పారు. ఈ సంఘటన పై డిఇ మాధవరెడ్డి పిర్యాదు మేరకు నవాబ్ పేట్ ఎస్సై భరత్ భూషణ్ కేసు నమోదు చేశారని దర్యాప్తు కూడ చేస్తున్నట్లు సిఐ ఆంజనేయులు తెలిపారు.

రైతు భరోసా కోసం ప్రజాభిప్రాయ శేకరణ

పిఎసిఎస్ ఉపాధ్యక్షులు సుధకార్ గౌడ్



ప్రజాపక్షం/బంట్వారం : బంట్వారం మండల కేంద్రంలో పిఎసిఎస్ కార్యలయంలో రైతుల నుంచి ప్రభుత్వం ద్వారా ఎకరకు 15 వేల పెట్టబడి సహాయం అందించేందుకు పంట పోలాలు రైతులు ఎంతవరకు సాగు చేస్తున్నారని డిసిఓ అధికారి ఈశ్వరప్ప రైతుల నుంచి ఎన్ని ఎకరాలకు పైకం అందిచాలని రైతుల నుంచి వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా పి ఎసిఎస్ ఉపద్యక్షులు సుధకార్ గౌడ్ మాట్లాడుతూ 5 నుంచి 10 ఎకరాలు సాగు చెస్తున్నా రైతులకు మాత్రమే సాగుబడి పైకం అందివ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం యేచిస్తుందన్నారు. బీడు భూములకు, రియలేస్టేట్ భూములకు పెట్టుబడి డబ్బులు ఇవ్వకుడదని ప్రభుత్వం అలోచిస్తుందన్నారు. రైతుల నుంచి వచ్చిన ప్రజాభిప్రాయాలను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేధిక చేరవేయడం జరుగుతుందన్నారు.

స్వర్ణగిరికి ప్రత్యేక బస్సులు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: ఉప్పల్ రింగ్ రోడ్ నుండి భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి వెళ్లేందుకు ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు తార్నాక, ఉప్పల్ క్రాస్ రోడ్, మేడిపల్లి, ఘట్‌కేసర్, ఎయిమ్స్ బీబీనగర్, రేణుక ఎల్లమ్మ, స్వర్ణగిరి ఆలయం చేరుకొంటుందని, సిటీ జనరల్, ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో ఉంటాయని, వీటిని ప్రయాణీకులు వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

బహుళ అంతస్తుల భవన నిర్మాణాల్లో

మ్రోగతున్న మృత్యు ఘంటికలు

అపార్ట్‌మెంట్ నిర్మాణ సంస్థల్లో పాటించని భద్రతా ప్రమాణాలు
డాల్ఫిన్ కన్‌స్ట్రక్షన్స్‌లో లిఫ్ట్ తీగ తెగి కార్మికుడి దుర్మరణం



ప్రజాపక్షం/ నిజాంపేట్ : పొట్ట కూటి కోసం ఎక్కడి నుండో హైదరాబాద్ నగరానికి వచ్చి భవన నిర్మాణ సంస్థల్లో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు వలస కార్మికులు. అతిపెద్ద నిర్మాణ సంస్థల్లో రోజుకో ఘటనలు చోటుచేసుకుంటుడంతో కార్మికులు మృత్యువాతకు గురవుతున్నారు. కనీస భద్రత ప్రమాణాలను పాటించకుండా ఇష్టానుసారంగా బహుళ అంతస్థుల భవనాలను నిర్మిస్తుండడంతో వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. నిన్న రైజ్ డెవలపర్స్ నిర్మాణ సంస్థలో, నేడు డాల్ఫిన్ నిర్మాణ సంస్థలో వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి, 17వ డివిజన్ కౌసల్య కాలనీలో డాల్ఫిన్ నిర్మాణ సంస్థ బహుళ అంతస్థుల నిర్మాణం జరుగుతుంది. బుధవారం ఉదయం నిర్మాణ సామాగ్రిని లిఫ్ట్ ద్వారా కార్మికులు పై అంతస్థులకు తీసుకువెళ్తారు. అయితే లిఫ్ట్ తీగ తెగి భవనం ముందు ఉన్న విద్యుత్ తీగల పై ఒక్కసారిగా లిఫ్ట్ పడిపోయింది. దీంతో లిఫ్ట్‌లో నిర్మాణ సామాగ్రిని తీసుకువెళ్తున్న కార్మికుడు వై.రాము లు (56) విద్యుత్ షాక్ తగలడంతో పాటు ఐదంతుస్తు నుండి పడిపోయి తీవ్ర గాయాలకు గురయ్యాడు. దీంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. సదరు బిల్డర్ కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే కార్మికుడి మృతికి కారణమని స్థానికులు, తోటి కార్మికులు వాపోతున్నారు. బాచుపల్లి, 18వ డివిజన్ రేణుక ఎల్లమ్మ కాలనీలో రైజ్ కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణ సంస్థ భారీ భవనాలను నిర్మిస్తుంది. ఈ నిర్మాణ సంస్థ చుట్టూ రిటైనింగ్ వాల్‌ని నిర్మించారు. ఈ గోడకు ఆనుకుని భవన నిర్మాణ కార్మికుల కోసం గుడిసెలను వేశారు. అయితే మే 8వ తేదీన ఒక్కసారిగా రిటైనింగ్ వాల్ కుప్పకూలి గుడిసెల పై పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు మృతి చెందారు. ఈ ఘటన మరువకముందే డాల్ఫిన్ నిర్మాణ సంస్థలో మరో ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. కార్మికులకు కనీస భద్రత ప్రమాణాలను తీసుకోకుండా బహుళ అంతస్థుల భవనాలను నిర్మిస్తుండడంతో వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పలువురు మండిపడుతున్నారు. భవనాలను నిర్మించడంలో కార్మికులకు కావాల్సిన సేఫ్టీ పరికరాలను సదరు బిల్డర్ అందిస్తే ఇలాంటి ఘటనలు జరిగిన సమయంలో కనీసం కార్మికుల ప్రాణాలైనా దక్కుతాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బహుళ అంతస్థుల భవనాల నిర్మాణ సంస్థల్లో కనీస భద్రతా ప్రమాణాలను తీసుకుంటున్నారా లేదా అనే వాటి పై ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తూ చర్యలు తీసుకోవాలని పలువురు నేతలు డిమాండ్ చేస్తున్నారు.

పెన్షన్లను పెంచాలంటూ 5న ధర్నా

ప్రజాపక్షం/మల్కాజిగిరి: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు పెన్షన్ పెంచక పోవటాన్ని మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల సమితి తీవ్రంగా విమర్శించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ల ను పెంచాలన్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకుడిమాండ్‌తో ఈ నెల 5న అన్ని జిల్లాల్లో మహాధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొనాలని సమితి కోరింది. ఈ సందర్భంగా మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల సమితి అధ్యక్షుడు ఎన్. వినయ్ ఆధ్వర్యంలో తెలంగాణా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎరుపలి మంగమ్మ, మల్కాజిగిరి మండల అధ్యక్షురాలు బండారి లక్ష్మీ వికలాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సురేష్‌కుమార్, షబానా, బాసిద్, మల్లేశ్వర్, నరేందర్, ప్రణయ్, సాయి కుమార్, రజిత, విజయలక్ష్మి తదితరులతో కల్సి ఆల్వాల్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాపక్షం/మల్కాజిగిరి: ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. తమ ప్రాంతాల పరిశుభ్రతను కాపాడుకోవటంలో ప్రజలందరూ తమకూ బాధ్యత ఉందన్న విషయాన్ని గుర్తుంచుకొని ప్రతి రోజు తమ ఇంటికి వచ్చే చెత్త తీసుకొని వెళ్లే సిబ్బందికి అప్పచెప్పాలే తప్ప రోడ్లపైనో ఇళ్ల పక్కనో, పార్కుల సమీపానో పడేయవద్దని ఆయన కోరారు. మల్కాజిగిరి డివిజన్ బాలసరస్వతినగర్‌లో జరుగుతున్న నాలా పనులను కార్పొరేటర్ జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు మహేష్, దీపక్, రమేష్, సానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, గిరి, బాలమణి, రాములు, కాలనీ వాసులు ప్రవీణ్, భాస్కర్, రమేష్, మూర్తి, సన్నీ తదితరులతో కల్సి పరిశీలించారు. నాలాలో పూడిక తీత పనులను వెంటనే పూర్తి చెయ్యాలని అధికారులకు కోరారు. నాలా మధ్యలో ఉన్న ప్రైవేట్ భూమికి చెందిన వారికి నష్టపరిహారం ఇప్పిస్తానన్నారు.నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని వాటర్ వర్క్స్ అధికారులను కార్పొరేటర్ కోరారు.

క్రీడ

6 నుంచి జింబాబ్వే వర్సెస్ ఇండియా

జింబాబ్వే వర్సెస్ ఇండియా టీ20 సిరీస్ ఈ నెల 6 నుంచి మొదలు కానుంది. హరారేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్ మొత్తం ఐదు టీ20ఐ మ్యాచ్‌లకు వేదిక కానుంది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో యంగ్ ఇండియా టీమ్ బరిలో దిగుతోంది. అయితే ప్రస్తుతం జింబాబ్వే అంత ప్రమాదకరంగా కనిపించడం లేదు. భారత్ సులువుగానే సిరీస్ ఛేజిక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. కానీగతంలో జింబాబ్వే సంచలన విజయాలు సాధించింది. పెద్ద టీమ్‌లకు సైతం గట్టి పోటీ ఇచ్చింది. ఇప్పటి వరకు జింబాబ్వే భారత్ మధ్య 8టీ20లు జరిగితే, 6 మ్యాచుల్లో భారత్ విజయం సాధించింది. 2 జింబాబ్వే గెలిచింది. ఇప్పటి వర కు జింబాబ్వే భారత్ టీ20 సిరీస్‌ల ఫలితాలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.

2022 టీ20 ప్రపంచ కప్... టీ20 ప్రపంచ కప్ 2022లో జింబాబ్వేపై భారత్ 71 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మెల్‌బోర్న్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ మొదట 186/5 స్కోరు చేసింది. సూర్యకుమార్ యాదవ్ 25 బంతుల్లో 61 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. జింబాబ్వే 115 పరుగులకే ఆలౌటైంది. అశ్విన్ (3/22) అద్భుత గణాంకాలు నమోదు చేశాడు.

2010లో సులువుగా గెలిచిన భారత్... 2010లో సురేశ్ రైనా కెప్టెన్సీలో భారత్ జింబాబ్వేలో పర్యటించింది. మొదటి టీ20 సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు గెలిచి క్లీన్ స్వీప్ చేసింది. టీమ్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా ఉన్నారు. మొదటి టీ20లో యూసఫ్ పఠాన్ (37*), రెండో మ్యాచ్‌లో సురేశ్ రైనా (72*) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు కెప్టెన్ అందుకున్నాడు. జింబాబ్వేపై భారత్ ఈజీగానే గెలిచింది.

2015లో షాక్ ఇచ్చిన జింబాబ్వే.. 2015లో అజింక్య రహానే కెప్టెన్సీలో టీమ్ ఇండియా జింబాబ్వే పర్యటన చేపట్టింది. 11తో జింబాబ్వే సిరీస్‌ను సమయం చేసింది. తొలి మ్యాచ్‌లో భారత్ 179 టార్గెట్ ఇవ్వగా, జింబాబ్వే 124 పరుగులకే ఆలౌట్ అయింది. అక్షర్ పటేల్ (3/17) అదరగొట్టాడు. రెండో మ్యాచ్‌లో జింబాబ్వే నిర్దేశించిన 146 పరుగుల టార్గెట్‌ను టీమ్ ఇండియా ఛేదించలేకపోయింది. అప్పటి జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న సికందర్ రాజా ఇప్పుడు జింబాబ్వే కెప్టెన్‌గా బరిలోకి దిగుతున్నాడు.

2016లో కష్టపడిన ఇండియా... 2016లో ధోనీ కెప్టెన్సీలో భారత్ జింబాబ్వే వెళ్లింది. మూడు టీ20ల సిరీస్‌ను 21 తేడాతో గెలుచుకుంది. మొదటి మ్యాచ్‌లో జింబాబ్వే నిర్దేశించిన 170 పరుగులకు భారత్ 2 పరుగుల దూరంలో నిలిచిపోయింది. రెండో టీ20లో బరిందర్ శ్రాన్ (4/10) చెలరేగడంతో జింబాబ్వే 99/9కే పరిమితమైంది. ఒక్క వికెట్ కోల్పోకుండా భారత్ 13.1 ఓవర్లలో టార్గెట్ అందుకుంది. మూడో టీ20లో జింబాబ్వే గట్టి పోటీ ఇచ్చింది. భారత్ నిర్దేశించిన 139 పరుగుల టార్గెట్‌ని ఛేదించేలా కనిపించింది. చివరికి 135 పరుగులకు పరిమితం అయింది. భారత్ కాస్త కష్టపడి సిరీస్ గెలిచింది.

పాకిస్థాన్ క్రికెటర్లకు యోయో టెస్ట్!

టీ20 వరల్ కప్ 2024 నుంచి పాకిస్థాన్ అనూహ్యంగా గ్రూప్ స్టేజ్‌లోనే ఎలిమినేట్ అయిన సంగతి తెలిసిందే. దీంతో పాక్ టీమ్‌పై చాలా విమర్శలు వచ్చాయి. అయితే ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పిసిబి), టీమ్‌ను పటిష్ఠం చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. పాత బలమైన పాకిస్థాన్ టీమ్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే ఆటగాళ్ల ఫిట్‌నెస్ ప్రమాణాలను మెరుగుపరిచేందుకు యోయో టెస్ట్‌ను తిరిగి తీసుకురావాలని నిర్ణయించింది.

కొత్త ఫిట్‌నెస్ మోడల్‌కు ఆమోదం... గతంలో యోయో టెస్ట్‌లు ఇర్రెగ్యులర్‌గా జరిగేవి. అయితే డొమెస్టిక్ క్రికెట్ కొత్త డైరెక్టర్ ఖుర్రం నియాజీ, కాంప్రహెన్సివ్ ఫిట్‌నెస్ మోడల్‌ను ఆమోదించారు. ఈ మోడల్ రెగ్యులర్‌గా, సిస్టమేటిక్‌గ ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహించేలా చూస్తుంది. ఈ టెస్ట్‌లు జులై 11న ప్రారంభమవుతాయి. రెండు దశల్లో జరుగుతాయి. మొదటి దశలో జిల్లా స్థాయిలో టెస్ట్‌లు ప్రారంభమవుతాయి. రెండో దశలో రీజినల్ లెవల్లో జరుగుతాయి. పిసిబి ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ కూడా ఈ కొత్త మోడల్‌ను ఆమోదించారు.

టెస్టుల్లో ఫెయిల్ అయితే ఏం జరుగుతుంది?... యోయో టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించని ఆటగాళ్లు జాతీయ, ప్రాంతీయ జట్లలో చోటు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. రీజినల్ కాంట్రాక్ట్స్, జట్టు ఎంపికలకు ఈ టెస్టుల్లో ఉత్తీర్ణత తప్పనిసరి అని నియాజీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ ఆటగాడు అయినా లేదా జాతీయ స్థాయి ఆటగాడు అయినా ఈ టెస్టుల నుంచి మినహాయింపు ఉండదు.

మహ్మద్ హఫీజ్ విమర్శలు... గత టీమ్ మేనేజ్‌మెంట్ ఫిట్‌నెస్ ప్రమాణాలను సడలించిందని పాకిస్థాన్ జట్టు మాజీ డైరెక్టర్ మహ్మద్ హఫీజ్ విమర్శించారు. మిక్కీ ఆర్థర్, గ్రాంట్ బ్రాడ్‌బర్న్ జట్టు బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు యోయో టెస్ట్, ఇతర ఫిట్‌నెస్ అసెస్‌మెంట్‌లకు ప్రాముఖ్యత ఇవ్వలేదని క్లబ్ ప్రైరీ ఫైర్ పోడ్‌కాస్ట్‌లో హఫీజ్ పేర్కొన్నాడు. మేనేజ్‌మెంట్ రిలాక్స్‌డ ఫిట్‌నెస్ గైడ్‌లైన్స్‌ను ఫాలో అవ్వడానికి టీమ్ ట్రైనర్ అంగీకరించడంపై నిరాశ వ్యక్తం చేశాడు.

బంగ్లాతో టెస్ట్ సిరీస్... యోయో టెస్ట్‌ను తిరిగి ప్రవేశపెట్టడంతో, ప్రపంచ క్రికెట్‌లోని అగ్ర శ్రేణి జట్ల మాదిరిగానే పాకిస్థాన్ ఆటగాళ్లు కూడా ఫిట్‌గా ఉండేలా చూడాలని పిసిబి లక్ష్యంగా పెట్టుకుంది. పాక్ స్వదేశంలో ఆగస్టులో బంగ్లాదేశ్‌తో రెండు టెస్ట్ మ్యాచ్‌లు ఆడేందుకు సిద్ధమవుతోంది. ఈ సిరీస్ 2023–2025 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగం. ప్రస్తుతం పాకిస్థాన్ పాయింట్ల పట్టికలో 5వ స్థానంలో ఉండగా, బంగ్లాదేశ్ 8వ స్థానంలో ఉంది.

ముంబయిలో టీమిండియా విజయోత్సవ ర్యాలీ

టీ20 ప్రపంచకప్ 2024లో విజేతగా నిలిచిన టీమిండియా గురువారం స్వదేశంలో అడుగుపెట్టనుంది. 11 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐసిసి టైటిల్ గెలిచిన టీమిండియాకు ఘన స్వాగతం పలికేందుకు బిసిసిఐ భారీ ఏర్పాట్లు చేస్తోంది. గురువారం తెల్లవారుజామున 1.30 గంటలకు టీమిండియా న్యూఢిల్లీ చేరుకోనుంది. ఉదయం 11 గంటలకు టీమిండియా ఆటగాళ్లతో దేశ ప్రధాని నరేంద్ర మోదీ బ్రేక్ ఫాస్ట్ చేయనున్నారు. అనంతరం ప్రపంచకప్ గెలిచి ఆటగాళ్లను ప్రభుత్వం తరఫున సత్కరించనున్నారు. ఇక ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుతో ముంబైలోని మెరైన్ డ్రైవ్ ప్రాంతంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించనున్నట్లు బిసిసిఐ ప్రకటించింది. ఈ మేరకు బిసిసిఐ సెక్రటరీ జై షా ట్వీట్ చేశాడు. సాయంత్రం 5 గంటలకు ఈ విజయోత్సవ సంబరాలు మొదలవుతాయని, అభిమానులు భారీ సంఖ్యలో హాజరు కావాలని జై షా కోరారు. ప్రపంచకప్ గెలిచిన జట్టుతో ఓపెన్ బస్ పరేడ్ నిర్వహించనున్నారు. ధోనీ సారథ్యంలోని టీమిండియా 2007 టీ20 ప్రపంచ కప్ గెలిచినప్పుడు కూడా ఇలానే ముంబైలో భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు.

రీల్

రామ్‌చరణ్‌కు మోక్షజ్ఞ పోటీ అవుతాడా..?

టాలీవుడ్ సీనియర్ స్టార్స్‌లో టాప్2 హీరోలు అంటే మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ పేర్లు వినిపిస్తాయి. అప్పట్లో వీరి బాక్సాఫీస్ వార్ కి ఫుల్ క్రేజ్ ఉండేది. తరువాతి తరం స్టార్స్ వచ్చినా కూడా.. ఇప్పటికీ ఈ స్టార్స్ బాక్సాఫీస్ దగ్గర నువ్వా నేనా అన్నట్టుగా తలపడుతూనే ఉంటారు. ఇదిలా ఉంటే, ఇప్పటికే చిరంజీవి వారసుడిగా ఆయన కుమారుడు రామ్ చరణ్ సినీ రంగ ప్రవేశం చేసి.. తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నాడు. కానీ బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ మాత్రం లేట్ గా లేటెస్ట్ గా ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రస్తుతం మోక్షజ్ఞ ఎంట్రీ గురించి ఓ రేంజ్ లో చర్చ జరుగుతోంది. అతని రీసెంట్ ఫొటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. స్టార్ మెటీరియల్ అంటూ నందమూరి అభిమానులు సంబరపడుతున్నారు. ఇప్పటికే మోక్షజ్ఞ ఎంట్రీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలతో పాటు ఒత్తిడి కూడా భారీగానే ఉంటుంది అనడంలో సందేహం లేదు. అదే సమయంలో రామ్ చరణ్ వంటి స్టార్స్ తో పోలికలు కూడా వస్తాయి. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'చిరుత' సినిమాతో హీరోగా పరిచయమైన రామ్ చరణ్.. మొదటి చిత్రంతోనే మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇక రెండో సినిమాగా రాజమౌళి డైరెక్షన్ లో చేసిన 'మగధీర' ఇండస్ట్రీ హిట్ గా నిలిచి, చరణ్ ని తిరుగులేని స్టార్ ని చేసింది. ఇప్పుడు మోక్షజ్ఞకు కూడా అలాంటి ఎంట్రీ పడాలి. మోక్షజ్ఞ మొదటి మూవీ 'హనుమాన్' ఫేమ్ ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో చేయనున్నాడని తెలుస్తోంది. రెండో సినిమా కోసం బోయపాటి శ్రీను లేదా త్రివిక్రమ్ శ్రీనివాస్ రంగంలోకి దిగే అవకాశముంది అంటున్నారు. ఈ రెండు సినిమాలు మంచి విజయం సాధిస్తే, మోక్షజ్ఞకు సాలిడ్ ఎంట్రీ కుదిరినట్టే. ఇప్పటికే తన రీసెంట్ లుక్స్ తో అందరినీ ఆకట్టుకున్నాడు. ఇక యాక్టింగ్ తోనూ అదరగొడితే తిరుగులేని స్టార్ అవుతాడు అనడంలో డౌట్ లేదు. అదే జరిగితే, అప్పట్లో చిరంజీవిబాలకృష్ణ బాక్సాఫీస్ వార్ ని తలపించేలా.. భవిష్యత్ లో రామ్ చరణ్‌మోక్షజ్ఞ బాక్సాఫీస్ వార్ ని చూడవచ్చు.

మహేష్ - రాజమౌళి సినిమాలో సలారోడు..!



'ఆర్‌ఆర్‌ఆర్'తో ప్రపంచస్థాయిలో సత్తా చా టిన దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తన తదుపరి సినిమా ని సూపర్ స్టార్ మహేష్‌బాబు తో చేయనున్న సంగతి తెలిసిందే. మహేష్, రాజమౌళి కాంబినేషన్ లో రానున్న మొదటి సినిమా ఇది. భారీ బడ్జెట్ తో ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో అడ్వెంచర్ ఫిల్మ్ గా రూపొందనుంది. మహేష్ కెరీర్ లో 29వ సినిమాగా రానున్న ఈ ప్రాజెక్ట్.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. ఇదిలా ఉంటే ఈ సినిమాలో విలన్ గా 'సలార్' స్టార్ నటించనున్నట్లు తెలుస్తోంది.రాజమౌళి సినిమాల్లో విలన్ రోల్స్ ఎంతో పవర్ ఫుల్ గా ఉంటాయి. 'ఎస్ఎస్ఎంబి 29'లో విలన్ పాత్ర మరింత పవర్ ఫుల్ గా ఉంటుందట. హీరో, విలన్ రోల్స్ నువ్వానేనా అన్నట్టుగా పోటాపోటీగా తలపడేలా ఉంటాయట. అందుకే ఈ మూవీలో విలన్ రోల్ కోసం మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్‌ని..రాజమౌళి రంగంలోకి దింపుతున్నారట. పృథ్వీరాజ్ టాలెంటెడ్ యాక్టర్, పైగా పాన్ ఇండియా గుర్తింపు ఉంది. అందుకే పృథ్వీరాజ్ పై రాజమౌళి దృష్టి పడిందట. పృథ్వీరాజ్ సైతం ఏమాత్రం ఆలోచించకుండా.. ఈ భారీ సినిమాలో నటించడానికి అంగీకరించినట్లు సమాచారం. పృథ్వీరాజ్ తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా సుపరిచితమే. పలు డబ్బింగ్ సినిమాలతో అలరించాడు.2010లో 'పోలీస్ పోలీస్' అనే తెలుగు సినిమాలో నటించాడు. గతేడాది ప్రభాస్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో వచ్చిన 'సలార్'లో మన్నార్ గా అదరగొట్టాడు.

శంషాబాద్‌లో ఎన్టీఆర్, జాన్వీ రచ్చరచ్చ..!



జూనియర్ ఎన్టీఆర్ హీ రోగా కొరటాలశివ దర్శ క త్వంలోరూపొందుతోన్న చిత్రం 'దేవర' యువసు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్ కాగా, సైఫ్ అ లీఖాన్‌విలన్‌గా నటిస్తున్నాడు. ఈ చిత్రం సెప్టెం బర్ 27న విడుదల కానుం ది. ఏకంగా 8 ఏళ్ళ తరువాత ఎన్టీఆర్ నుంచి వస్తున్న సోలో మూవీ కావడ ంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ముఖ్యంగా మాస్ ప్రేక్షకులు ఈ సినిమా కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. అయితే ఈ మూవీకి సంబంధించి మాస్ ఆడియన్స్ కి కిక్కిచ్చే న్యూస్ ఒకటి వినిపిస్తోంది. అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్న 'దేవర' చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ 'ఫియర్ సాంగ్' కి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా కోసం అనిరుధ్ అంతకు మించి అనేలా అదిరిపోయే సాంగ్స్‌ని స్వరపరిచాడట. ముఖ్యంగా ఎన్టీఆర్ జాన్వీ కపూర్ కలిసి చిందేసే మాస్ డ్యూయెట్ ఓ రేంజ్‌లో ఉంటుందట. ఈ సాంగ్ కి థియే టర్లలో మాస్ ఆడియన్స్ ఊగిపోవడం ఖాయమని అంటున్నారు. త్వరలోనే ఈ సాంగ్‌ని చిత్రీకరించనున్నారు. శంషాబాద్ లో వేసిన భారీ సెట్‌లో జులై 10 నుంచి షూట్ జరగనుందని తెలుస్తోంది. ఈ సాంగ్ కి శేఖర్ మాస్టర్ కొరియోగ్రాఫర్. ఈ సాంగ్ కోసం ఆయన అదిరిపోయే స్టెప్పులను కంపోజ్ చేసే పనిలో ఉన్నాడట. కష్టమైనా స్టెప్ ని కూడా సింగిల్ టేక్ లో చేస్తాడనే పేరుంది. మరి అలాంటి ఎన్టీఆర్ స్పీడ ని జాన్వీ ఎంతవరకు అందుకుంటుందో చూడాలి.కాగా, ఇటీవల గోవాలో ఎన్టీఆర్‌జాన్వీ లపై ఒక రొమాంటిక్ సాంగ్ చిత్రీకరణ జరిగింది. ఆ సాంగ్ ని సెకండ సింగిల్ గా ఈ నెలలోనే విడుదల చేసే అవకాశముంది.

ప్రచండ.. దిగిపో : నేపాలీ కాంగ్రెస్

ఖట్మండూ : నేపాల్ ప్రధాని ప్రచండ రాజీనామా చేసి నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమం చేయాలని నేపాలీ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. నేపాలీ కాంగ్రెస్ వర్కింగ్ పెర్ఫార్మెన్స్ కమిటీ బుధవారం నాడు ఆ పార్టీ అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవుబా నివాసంలో సమావేశమై తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్తు వ్యూహంపై చర్చించిందుకు సమావేశమయింది. నూతన సంకీర్ణం ఏర్పాటుకు సిపిఎన్ – యుఎంఎల్‌తో ఒప్పందం కుదిరిన తరువాత ఈ సమావేశం జరిగింది. నేపాలీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ ప్రకాశ్ శరన్ మహత్ మాట్లాడుతూ అతి పెద్ద పార్టీలైన నేపాలీ కాంగ్రెస్, సిపిఎన్— యుఎంఎల్‌లు ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రధాని మార్గం సుగమం చేయాలని తమ సమావేశం విజ్ఞప్తి చేసిందని తెలిపారు. తమ కూటమికి ఇతర పార్టీలు కూడా మద్దతునిస్తున్నాయని చెప్పారు. తాము రాజ్యాంగబద్ధంగా నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. నేపాలీ రాజ్యాంగం ప్రకారం మెజారిటీ కోల్పోయిన ప్రధాన మంత్రికి సభలో విశ్వాసం పరీక్షను ఎదుర్కొనేందుకు 30 రోజుల సమయం ఉంటుంది.

బోనాలు-మొహరం బందోబస్తుపై

అధికారులు, శాంతి కమిటీలతో కొత్వాల్ సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: బోనాలు, మొహరం పండుగల సందర్భంగా హైదరాబాద్‌లో పోలీసు బందోబస్తుపై పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్ని జోన్‌ల అధికారులు, శాంతి కమిటీల సభ్యులతో బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..హైదరాబాద్‌లో త్వరలో రాబోతున్న ఈ రెండు పండుగలను శాంతి యుతంగా జరిపేందుకు శాంతి కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఆయా పోలీసు స్టేషన్‌ల పరిధిలో స్థానిక పోలీసులతో పాటు శాంతి కమిటీ సభ్యులు సలహాలు, సహకారాలు అందించాలని సూచించారు. దశాబ్దాలుగా పోలీసులకు సహరిస్తున్న సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ నిబద్ధతను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈ సమావేశంలో అన్ని జోన్‌ల డిసిపిలు, ఎసిపిలు, సిఐలతో పాటు శాంతి కమిటీల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : జాతీయ,అంతర్జాతీయ క్రీడా వేదికలపై తెలంగాణ, దేశ కీర్తిని చాటే క్రీడాకారులందరికీ తమ ప్రభుత్వంఅన్ని విధాలుగా అండగా ఉంటుందని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఒలింపిక్స్ లో మనదేశం తరపున పాల్గొనేందుకు సన్నద్ధం అవుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన అథ్లెట్ పాయం కుమారికి అవసరమైన సహాయ, సహకారాలను అందించాలని మంత్రి సీతక్క భద్రాచలం ఐటిడిఏ అధికారులను ఆదేశించారు. సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి కుమారి సీతక్కను సచివాలయంలో కలిసిన తనకు సహాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి సీతక్క తక్షణ సహాయం కింద వ్యక్తిగతంగా రూ.5వేల గాఆర్థిక సహాయం అందించడంతో పాటు కుమారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని భద్రాచలం ఐటిడిఏ అధికారులను ఆదేశాలు జారీ చేశారు.

మణిపూర్ ఎంపి ప్రసంగం వైరల్

ఏడాదికి పైగా 60వేల మంది నిరాశ్రయులు అయినా ప్రధాని మౌనం



న్యూఢిల్లీ : మీ గుండెలపై చేయి వేసుకొని మణిపూర్‌లోని పునరావాస కేంద్రాల్లో ఏడాదికి పైగా మగ్గుతున్న 60 వేలకు పైగా నిరాశ్రయుల గురించి ఆలోచించండి, అక్కడి తల్లులు, వితంతువుల గురించి ఆలోచించండి, అప్పుడు మీకు మణిపూర్ విషాదం గురించి అర్థమవుతుందని ఇన్నర్ మణిపూర్ ఎంపి బిమల్ అకోయ్‌జామ్ అన్నారు. మణిపూర్ గురించి రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావన లేదని, ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. లోక్‌సభలో సోమవారం అర్ధ రాత్రి సమయంలో ప్రసంగించేందుకు అవకాశం వచ్చిన మణిపూర్ ఎంపి బిమల్ అకోయ్‌జామ్ చేసిన భావోద్వేగ ప్రసంగం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాను మణిపూర్‌లో కేంద్ర మంత్రిని ఓడించి ప్రజాస్వామ్య దేవస్థానమైన పార్లమెంటుకు వచ్చానండే అక్కడి ప్రజల బాధ ఏమిటో అర్థం చేసుకోవాలని కోరారు. తన గొంతులో బాధ, ఆవేదనను మీరు విన్నట్లయితే, ఆ బాధ గురించి ఆలోచించండి, ఇప్పటికైనా మణిపూర్‌కు వెళ్ళి పునరావాస కేంద్రాలలో మగ్గుతున్న 60వేలకు పైగా నిరాశ్రయులను చూసి రావాలని కోరారు. తమ రాష్ట్రంలో ప్రతి ఇంచు, సెంటిమీటర్ భూ భాగం కేంద్ర బలగాలతో నిండిపోయిందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సాధారణ పోలీసుల కంటే కేంద్ర బలగాలే తమ రాష్ట్రంలో ఎక్కువ ఉన్నారని చెప్పారు. అయినప్పటికీ 60వేలకు పైగా నిరాశ్రయులయ్యారని, వేల గ్రామాలు విధ్వంసమయ్యాయని చెప్పారు. అయినప్పటికీ ప్రధాని మౌనంగా ఉంటారని, రాష్ట్రపతి ప్రసంగం ఆ అంశాన్ని పక్కకు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ పౌర యుద్ధం లాంటి పరిస్థితులు కొనసాగుతున్నాయని, ప్రజలు సాయుధులై ఒకరి నుండి మరొకరు గ్రామాలను రక్షించుకుంటున్నారని తెలిపారు. 60 వేలకు పైగా మణిపూరీలు ఏడాదికి పైగా పునరావాస కేంద్రాలలో దుర్భర జీవితం గడుపుతున్నారంటే జోక్ కాదన్నారు. అయినప్పటికీ ఏడాదిగా భారత ప్రభుత్వం మౌనంగా ఉందన్నారు. జాతీయ పార్టీ అని చెప్పుకునే బిజెపి మణిపూర్‌ను దేశంలో భాగంగా చూడడం లేదా అని ప్రశ్నించారు. ఆ పార్టీ వారు మణిపూర్‌కు వచ్చి , మణిపూర్ దేశంలో భాగమేనని చెబితే జాతీయ వాద పార్టీగా అంగీకరిస్తానన్నారు. మణిపూర్ గురించి ప్రధాని మౌనం వీడి మాట్లాడిన వెంటనే తాను నోర్మూసుకుంటానని చెప్పారు.

కజిరంగ నేషనల్ పార్క్‌ను ముంచెత్తిన వరద..

నీట మునిగిన జంతువులు..

న్యూఢిల్లీ: అసోంలో వరద బీభత్సం కొనసాగుతోంది. 8 నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. ఈ వరదల కారణంగా 23 జిల్లాల్లో 11.3 లక్షల మంది ప్రజలు ప్రభావితమయ్యారు. ఇక ఈ ఏడాది వరదలు, కొండ చరియలు విరిగిపడటం, తుపానుల కారణంగా రాష్ట్రంలో మొత్తం 48 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 2 లక్షల మంది ప్రజలు ముంపు ప్రాంతంలో చిక్కుకుపోయారు. వారందరినీ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 72 పునరావాస శిబిరాలను అధికారులు ఏర్పాటు చేశారు. అందులో 8 వేల మందికిపైగా తలదాచుకుంటున్నారు. బ్రహ్మపుత్ర నది ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తోంది. దీంతో దిబ్రూగఢ్ జిల్లాలో పరిస్థితి దారుణంగా తయారైంది. గువహటిలో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న దేవతా విగ్రహాలు నీట మునిగాయి. ఇక ఈ వరదల కారణంగా కజిరంగ జాతీయ పార్కు తీవ్ర ప్రభావానికి గురైంది. పార్కులోకి భారీగా నీరు చేరింది. దీంతో నాలుగు జింకలు నీటమునిగి మృతి చెందాయి. సుమారు 24 ఇతర జంతువులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న ఐఎండి (ఐఎండి) హెచ్చరికలు జారీ చేసింది. దీంతో అసోం ప్రజలను తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

121కి చేరిన తొక్కిసలాట మృతులు

జ్యుడీషియల్ విచారణకు సిఎం యోగి ఆదేశం

హత్రాస్ : ఉత్తర్‌ప్రదేశ్ హత్రాస్ తొక్కిసలాట మృతుల సంఖ్య 121కు చేరుకుంది. మరో 28 మంది క్షతగాత్రులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, హత్రాస్‌లో సత్సంగ్ నిర్వహించిన వారిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సత్సంగ్ ముఖ్య నిర్వాహకుడు దేవ ప్రకాశ్ మధుకర్, సికందరరావు తదితరులపై కేసు నమోదైంది. అయితే హత్రాస్‌లో సత్సంగ్ నిర్వహించిన మత బోధకుడు నారాయణ్ సాకర్ హరి అలియాస్ 'భోలే బాబా'ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం భోలే బాబా పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. మెయిన్‌పురిలో భోలే బాబాకు చెందిన రామ్ కుటీర్ ఛారిటబుల్ ట్రస్ట్‌లో సోదాలు నిర్వహించగా అక్కడా ఆయన కనిపించలేదని డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సునీల్ కుమార్ తెలిపారు.

ఎఫ్ఐఆర్ నమోదు... మరోవైపు హత్రాస్‌లో సత్సంగ్ జరిగిన ప్రదేశంలో ఫోరెన్సిక్ ఆధారాలను అధికారులు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను తీసుకొచ్చి తొక్కిసలాట జరిగిన ప్రదేశం చుట్టుపక్కల గాలించారు. ఈ ఘటనను ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. పోలీసులు సికిందరరావు పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌ను నమోదుచేశారు. సత్సంగ్ నిర్వహించిన ముఖ్య సేవాదార్ దేవప్రకాశ్, ఇతర నిర్వాహకులపై వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టారు. నిర్వాహకులు అనుతులను నిబంధనలు ఉల్లఘించినట్లు పేర్కొన్నారు. 80 వేల మందికి అనుమతిస్తే 2.5లక్షల మంది హాజరైనట్లు పోలీసులు పేర్కొన్నారు.

హత్రస్ తొక్కిసలాటపై జ్యుడీషియల్ విచారణ: సిఎం యోగి ప్రకటన

సత్సంగ్ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాట ఘటన దేశంలో పెనువిషాదం నింపింది. ఈ దుర్ఘటనలో 121 మంది మృతి చెందగా.. వీరిలో ఆరుగురు ఇతర రాష్ట్రాల వారు ఉన్నట్లు యూపి సిఎం యోగి ఆదిత్యనాథ్ బుధవారం వెల్లడించారు. ఆరుగురు మృతుల్లో హరియాణా నుంచి నలుగురు, మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి ఒక్కొక్కరు ఉన్నట్లు తెలిపారు. ఈ దుర్ఘటనపై విశ్రాంత హైకోర్టు జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరుపుతామని ప్రకటించారు. న్యాయ విచారణ కమిటీలో విశ్రాంత అధికారులతో పాటు పోలీసు అధికారులు కూడా భాగంగా ఉంటారని తెలిపారు. ఈ విషాదానికి బాధ్యులెవరో గుర్తించడంతో పాటు, ఏదైనా కుట్ర ఉందా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తారని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకొనేలా నిబంధనలు రూపొందిస్తామని సీఎం తెలిపారు.

సుప్రీం కోర్టులో పిటిషన్...హత్రాస్ ఘటనపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. గతంలో జరిగిన తొక్కిసలాట ఘటనల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని, దీనిపై కఠిన మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ అభ్యర్థించారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఐదుగురు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. అటు ఘటనపై సిబిఐ దర్యాప్తు చేపట్టాలని అలహాబాద్ హైకోర్టులో మరో వ్యాజ్యం దాఖలైంది.

కేజ్రీవాల్ కస్టడీ 12 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ:ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కష్టాలు కొనసాగుతున్నాయి. మద్యం పాలసీ కేసులో సిఎం కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు ఈ నెల 12 వరకు పొడిగించింది. కేజ్రీవాల్‌ను ఇడి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరిచింది. ఇంతకుముందు ఇడి జూన్ 29న సిబిఐ కోర్టు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం ప్రత్యేక సిబిఐ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఇచ్చింది. మద్యం పాలసీ కేసులో గత నెల 26న సిబిఐ అరెస్టు చేసిన విషయం విధితమే. ఆ తర్వాత మూడురోజులు సిబిఐ కస్టడీకి తీసుకోగా.. రిమాండ్ గడువు ముగియగా 29న కోర్టులో హాజరుపరిచింది. దీంతో కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసుకు సంబంధించి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆప్ కన్వీనర్‌కు జూన్ 20న ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే, ట్రయల్ కోర్టు ఆదేశాలపై హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. ఆ తర్వాత స్టేపై సవాల్ చేయగా.. హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. ఇదిలా ఉండగా.. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను మార్చి 21న ఇడి అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన తిహార్ జైలులో ఉంటున్నారు.

కవితకు మరోసారి షాక్

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కేసులో బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి పొడిగించింది. కవిత, మనీశ్ సిసోదియా కస్టడీని జులై 25 వరకు పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు వెలువరించింది. ఇడి కేసులో కవిత, సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ బుధవారంతో ముగిసిన నేపథ్యంలో వీరిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు కోర్టు ముందు హాజరు పర్చారు. ఈ కేసు విచారణను రౌస్ అవెన్యూ కోర్టు జులై 25కు వాయిదా వేస్తూ అప్పటి వరకు వారి కస్టడీని పొడిగించింది. మద్యం విధానానికి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ ఢిల్లీ తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఎంఎల్‌సి కవిత బెయిల్ కోరుతూ ఢిల్లీ హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లను దాఖలు చేసిన విషయం విదితమే. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం వాటిని తిరస్కరించింది. కవితను ఈ కేసులో ఇరికించేందుకే ఆరోపణలు చేస్తున్నారని కవిత తరఫు న్యాయవాది వాదించగా, ఆమే మద్యం కేసులో కీలక సూత్రధారి, పాత్రధారి అని ఇడి, సిబిఐ తరఫు న్యాయవాది వాదించారు. వీరిరువురి వాదనలు విన్న న్యాయస్థానం కవిత రెండు పిటిషన్లను కొట్టివేస్తూ బెయిల్‌ను తిరస్కరించింది. మరోవైపు బుధవారం జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో జులై 25వ తేదీ వరకు రౌస్ అవెన్యూ కోర్టు కస్టడీ పొడిగించింది. ఈ ఏడాది మార్చి 15న మద్యం కుంభకోణం కేసులో ప్రమేయం ఉందన్న ఆరోపణలతో బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవితను ఇడి అధికారులు అరెస్టు చేశారు. అనం తరం ఆమెను ఢిల్లీకి తరలించి కోర్టులో హాజరుపరిచిన విషయం తెలిసిందే. అయితే అప్పుడు ఆమెకు వారం రోజులు ఇడి కస్టడీకి ఇస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తెలిపిన విషయం విధితమే. అనంతరం జ్యుడీషియల్ కస్టడీకి తరలించి ఏప్రిల్ నెలలో రెండు రోజుల పాటు సిబిఐ విచారణకు ఆమెను కస్టడీలోకి తీసుకుంది. ప్రశ్నల అనంతరం ఆమెను అరెస్టు చేశారు. తర్వాత ఆమెను కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధిస్తూ ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అప్పటి నుంచి ఆమె తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉంటుండగా, పలుమార్లు కస్టడీ పొడిగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమెను కలిసేందుకు బిఆర్ఎస్ శ్రేణులు తీహార్‌కు వెళ్లి వస్తున్నారు.